చివరి గుడిసె

డా.కేశవరెడ్డి

SHOUT
SHARE
IT

చివరి గుడిసె

డా॥ కేశవరెడ్డి

హైదరాబాద్ బుక్ ట్రస్ట్

ధర : రూ. **80/**
మొదటి ముద్రణ : ఆహ్వానం మాసపత్రిక, 1993,
రీతిక పబ్లికేషన్స్, 1996,
HBT మొదటి ముద్రణ : అక్టోబర్, 2008
ముఖ చిత్రం : కాళ్ళ
పేజ్ సెట్టింగ్ : విజయ్
ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85,
బాలాజీ నగర్,
హైదరాబాద్ - 500 067,
ఫోన్ 040 - 2352 1849.

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్‌వ్యూ,
126 శాంతినగర్,
హైదరాబాద్ - 28
ఫోన్ : 23391364, 23304194

కేశవరెడ్డికి శ్రోతగా ....

'చివరి గుడిసె' బాధామయం, భయావహం అయిన తీవ్ర ఉత్కంఠతో కూడిన విషాదాంత గాథ. నాకు తెలిసినంత మటుకు ఇంత అద్భుతమయిన కథని నేను తెలుగు సాహిత్యంలో ఇంతదాకా చదవలేదనే చెప్పాలి. శిల్పంలో, చిత్రణలో, ప్రయోజనంలో ఒక 'కన్యాశుల్కం' ఒక 'యజ్ఞం' మాత్రమే దీనికి సాటిరాగల రచనలు.

అయితే గురజాడ. ఉన్నవ, కాళీపట్నం వంటి మహారచయితలు ఒకే కాలానికీ, ఒకే వ్యవస్థకూ చెందిన వైరుధ్యాల్ని చిత్రించగా డా॥ కేశవరెడ్డి భిన్న వ్యవస్థలకు చెందిన వైరుధ్యాల్నీ, భూమిపైనా, పాతాళంలోనూ కూడా జరిగే పోరాటాన్నీ అత్యంత ప్రతిభావంతమైన శిల్ప నైపుణ్యంతో చిత్రించాడు ఈ నవలలో.

తన మొదటి కథల్లోలానే ఇందులో కూడా గ్రామంలోని అగ్రవర్ణాలకూ, నిమ్నవర్ణాలకూ జరిగే సంఘర్షణే స్థూల ఇతివృత్తం. కాని ఈసారి కథాకాలం దాదాపు యాభై ఏళ్ళ వెనక్కు జరిగింది. అక్కడ నుండి మరొక ఇరవయ్యేళ్ళు వెనక్కుపోయి చెప్పుకొస్తాడు కథని. అంటే సుమారు 1925 నుండి 45 మధ్యకాలంలో జరిగిన కథ. స్పష్టంగా తేదీలు ఇవ్వకపోయి నప్పటికీ ఈ కథలోని ప్రతి సంఘటనా తన నిర్దిష్ట చారిత్రిక నేపథ్యాన్ని ఎంతో స్పష్టంగా ప్రకటిస్తూనే వుంటుంది.

ఆంధ్రదేశంలోని నల్లమల అడవుల నుండి నెల్లూరు సముద్ర తీరం దాకా విస్తరించి ఉన్న సంచార గిరిజన తెగ యానాదులు సామాజిక పరిణామంలో ఆహార సేకరణ దశకు చెందిన జాతి. ఏళ్ళ మీదట వారి చుట్టూతా సమాజం వివిధ ఆర్థిక దశల్ని దాటుతూ స్థిర వ్యావసాయిక జీవితంలోకి స్థిరపడిన వందల యేళ్ళ తరువాత కూడా యానాదులు తమ ప్రాచీన ఆర్థిక విశ్వాసాలకే అంటిపెట్టుకుని వుండిపొయ్యేరు.

వాళ్ళసోదరులు చెంచులు అడవుల్ని పట్టి వేటలోకి పురోగమించగా, యానాదులు మాత్రం కొండదిగువ, అడివి బయట భూస్వామ్య సమా జంలో మాట చాతనయిన జంతువుల స్థాయిలోనే జీవించడానికి అలవాటు పడిపోయేరు. ఆహారాన్ని ఏరుకుని తినే దశ మానవులకి ఆస్తి, హక్కులకి సంబంధించిన సకల భావజాలం, ముఖ్యంగా భూస్వామ్య సమాజాల్లో మరింత కరడు గట్టినట్లుండే న్యాయ శాస్త్రాలతో సహా ఎంతమాత్రం అర్థం కావు. అటువంటి అమాయికులని దొంగలనడం పరిణత సమాజాలకి చాలా సులభం. కాబట్టే మద్రాసు ప్రెసిడెన్సీకి చెందిన 1871 క్రిమినల్ తెగల చట్టంలో 1924 నుండి యానా దుల్ని కూడా పుట్టు నేరస్థ జాతిగా పరిగణించడం మొదలు

పెట్టింది ప్రభుత్వం.

ఈ నేపథ్యంలో తన కథాంశాన్ని ఎత్తుకుంటాడు రచయిత. ఒక జాతిని తల్లి కడుపులోనించే నేరస్థులుగా నిర్ణయించిన ప్రభుత్వం గురించి ఏ యానాదికయినా స్పష్టంగా తెలుసు. 'గవుర్మెం టోళ్ళంటే ఎవరు సావి. తాసిల్దారు, రివినిస్సెట్రూ, మనేగాడూ ఈళ్ళేగదా గవుర్మెంటు' (33 అటువంటి ప్రభుత్వాని కంతటికీ ఆధార స్తంభమయిన గ్రామ మణియాన్నే నిజమయిన క్రిమినల్‌గా చూపించడమే ఈ కథా ప్రజ్ఞ.

ఇంకా బలంగా వూడలు దిగి మననీ, మన సంస్కృతినీ బలంగా ప్రభావితం చేస్తోన్న భూస్వామ్య భావజాలం గురించి ఒట్టి భూస్వామ్య నేపథ్యంలో చెప్పేకథ చాలదు. దాన్ని అంతకన్నా వెనకబడిన సమాజం తోనో, అంతకన్నా పురోగమించిన సమాజంతోనో పోల్చి చెప్పగలిగినప్పడే అందులోని మానవత్వం, అమానుషత్వం రెండూ బోధ పడేవి. భూస్వామ్య సమాజాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థతోనో, సోషలిస్టు వ్యవస్థతోనో పోల్చి చెప్పే కథలు కొన్ని రాకపోలేదు. కాని పురోగామి సమాజాల గురించి మన రచయితల భావనాశక్తి, అటువంటి జీవితానుభావాన్ని అర్థం చేసుకోగలిగే శక్తి పరిమితమయినందున ఆ రచనలేవీ మనని బలంగా కదిలించలేవు. కాగా భూస్వామ్య సమాజం కన్నా వెనుక బడిన సమాజాలు, సమూహాలు మన మధ్యనే జీవిస్తున్నాయని మన రచయితల్లో చాలా మందికి తెలియనే తెలియదు.

డా॥ కేశవరెడ్డి భూస్వామ్య సమాజంలోని మానవత్వం బయటకి ప్రకటితం కావడానికి బైరాగినీ, భూస్వామ్య అమాను షత్వమంతటికీ మణీయాన్నీ ప్రతినిధులుగా తీసుకున్నాడు. ఇద్దరిదీ 'చేను' గురించిన తాపత్రయమే. తనది కాని భూమిని ఆక్రమించుకున్నా మణియానికి దానిపైన ఎవరన్నా చెయ్యి

వెయ్యగలరన్న ఊహేతట్టుకోలేనట్టుగా ఉంటుంది. తానే ఒక దొంగ తనదే ఒక దౌర్జన్యం. అటువంటి చేలో మరెవరో దొంగ పడ్డాడనగానే మణియం దుర్మార్గుడిగా, పీడకుడిగా, హంతకుడిగా, క్షణాల మీద మారిపోయేడు. భూస్వామ్య వర్గ స్వభావాన్ని ఇంత శక్తిమంతంగా ఎవరు చూపించగలిగేరు? బైరాగి 'చేను' అతని ఆత్మ. ఆత్మని చేనుతో పోల్చడంలోనే అద్భుతమైన వ్యంగ్యం ఉంది. కామ క్రోధాలనే ఎలుకల నుండి తన చేనుని ఎలా కాపాడు కోగలడన్నదే అతని ఆవేదన. యధార్థమయిన చేనులో ఎలకల నుండి కాపాడటానికి మణియానికి ఏ యానాది అవసరమ య్యాడో అదే యానాది బైరాగి ఆత్మిక క్షేత్రాన్ని కామక్రోధాలనే ఎలుకలు పడి కొల్లగొట్టడానికీ కారణమయ్యాడు. వాస్తవ సన్నివేశమూ, ప్రతీకా ఇంత అద్భుతంగా కలగలిసిన రచనలు ఎంతో అరుదుగా కన్పిస్తాయి.

ఒట్టి యానాదుల జీవితం గురించి, పీడన గురించి రాయడానికి మాత్రమే రచయిత ఈ కథని రాసాడనుకోను. తాను తొలి నుంచీ ప్రయత్నిస్తున్న స్థూల, సూక్ష్మ పోరాటాల అత్యంత సునిశితమయిన చిత్రణకి ప్రయత్నించడమే ఈ ఇతివృత్తం లోని బలం. భూస్వామికీ, ఆహారాన్ని ఏరుకుని తినే యానాదికీ మధ్య సంఘర్షణ భూమిపైన కథ. యానాది చేనునీ, అతని శ్రమనీ, అస్తిత్వాన్నీ, ఆత్మ విశ్వాసాన్నీ అన్నిటినీ కొల్లగొట్టాడు భూస్వామి, యానాది తన కళ్ళ ముందున్నంతకాలం తన దౌర్జన్యం తనకి గుర్తుచేస్తున్నట్లుంటాడనేమో. యానాదులందర్నీ వూరి నుంచి తరివెయ్యడం ఒక గ్రామానికే చెందిన యాదృచ్ఛిక సంఘటన కాదు. సాపేక్ష పురోగామి సమాజాలు తమ పాత పితృ సమాజాల్ని ఎప్పుడూ ఇలాగే నిర్మూలిస్తూ వచ్చాయి. వెన్నెలకంటి రాఘవయ్య ఇలా రాస్తున్నారు. "యానాదుల గురించి తెలుసుకుంటున్నపుడు వాళ్ల రాజకీయంగా గానీ సాంఘికంగా గానీ ఏకీకృతమయిన

వాళ్ళు కానీ ఒక ప్రదేశాన్ని ఆక్రమించుకు స్వయం నిర్ణయం చేసుకోగల వాళ్ళు కానీ కారని గుర్తుంచుకోవాలి. జీవితంలో ఒక్కలాంటి ఒడిదుడుకులే పడుతూ, సమాజం చేత నిర్లక్ష్యం చెయ్యబడి, ప్రభుత్వం పట్టించుకోని అనేక మంది వ్యక్తులు ఒక సాముదాయకమయిన పేరుతో పిలవబడుతున్న అభాగ్యులు గానూ తక్కిన సమూహాలకు చెందిన మనుషుల్తో పోటీపడలేని అశక్తులుగానూ మాత్రమే వాళ్ళని బాగా అర్థం చేసుకోగలం" (యానాదులు, 1962 పే.79.)

ఇక్కడితో ఆగక రచయిత భూమి కింద జరిగే జీవిత సంఘర్షణని కూడా చిత్రిస్తాడు. అశక్త యానాదులలానే తమ ఆహారాన్ని ఏరుకుతినే ఎలకలని వాటి బోరియల్లో పట్టుకుని పొగపెట్టి బయటకి లాగి వాటినీ, అవి తమ బుల్లి పిడికిళ్ళతో దాచుకున్న ధాన్యపు కంకుల్నీ కూడా కొల్లగొట్టే యానాదినీ కూడా మనం చూడాలి ఇందులో. ఒక జంతువు దాచుకున్న తిండిని కొల్లగొట్టే మరొక జంతువుని కొల్లగొట్టే మరొక జంతువు– చివరికి ఆ జంతువుని మరొక జంతువు సంహరించడం– ఈ అమానుష హింసా చక్రాన్నీ, ఈ క్రమంలో ఒక జాతి వెనుక మరొక జాతి అంతరించిపోవడాన్నీ మర్త్య, పాతాళలోకాల్లో జరిగే బీభత్సరస ప్రధానమైన జీవిత నాటకాన్నీ ఎంతో ప్రతిభావంతంగా మన కళ్ళ ముందు ఆవిష్కరిస్తుంది ఈ కథ.

ఇక శిల్పం గురించి చెప్పవలసి ఉంది. ఈ కథ ఆద్యంతం అత్యద్భుతమయిన శిల్ప ప్రజ్ఞతో తీర్చిదిద్దబడింది. పరమ విషాదాత్మకమైన ఈ కథలోని శిల్ప రహస్యాల్ని గుర్తించడానికి అరిస్టాటిల్ ట్రాజెడీపైన చేసిన సూత్రీకరణలు అవసరమవుతాయి. గొప్ప ట్రాజెడీకి ఉండవలసిన లక్షణాలుగా అరిస్టాటిల్ పేర్కొన్నవి గొప్ప గ్రీకు నాటకాలూ, షేక్స్పియర్ కూడా సాధించలేనివి చాలా వరకు

ఈ కథా నిర్మాణంలో కన్పిస్తాయి. మొదటిది. ఈ కథకి స్పష్టంగా ఉన్న ఆదిమధ్యాంతాలు. అది అంటే ఏ సంఘటన తర్వాత కథ క్రమం సత్వరమే ప్రారంభమవుతుందో అటువంటి ప్రారంభం. నవల మొదలు పెట్టగానే మిలటరీ మార్చ్, ఆ దండు తాకిడికి ఉడతలాగా ఒణికిపోయిన యానాది కుర్రవాడు– నవల మొదలు కావడమే దుమ్ము రేపుకంటూ మొదలయింది. ఇక ముగింపు అంటే, ఏ సంఘటన వైపుగా కథా క్రమంలోని అన్ని సంఘటనలూ ప్రవహిస్తాయో.

ఆ చివరి సంఘటన తొలి మానవుడి చివరి గుడిసె కూడా నిర్జనమై చివరకి దుమ్ములో కలసిపోవడమే ఈ కథకి ముగింపు. ఈ స్పష్ట మయిన ఆది మధ్యాంతాలతో పాటు ఇతివృత్తంలో ఏకత, స్థలంలో ఏకత, కాలగమనంలో ఏకత– గొప్ప నాటకాలకు ఏ త్రివిధ ఏకత్వాలను ఉత్తమ లక్షణాలుగా పేర్కొంటారో అవి ఈ కథలో అద్భుతంగా అమరాయి.

ఏ ట్రాజడీ అయినా ఒక్క సూర్యభ్రమణ కాలంలో జరిగేట్టు చిత్రిం చాలన్నాడు అరిస్టాటిల్. ఈ కథ – ఒక సూర్యోదయంతో మొదలయి మరో సూర్యోదయం లోపల అనూహ్య పరిణామాల వైపు సుళ్ళు తిరిగి బీభత్సంగా ముగుస్తుంది ట్రాజడీ అంటే మనుషుల స్వభావం చిత్రణ కాదు, చేతల చిత్రణ అన్నాడు అరిస్టాటిల్. ఇందోలోని ప్రతి ఒక్కవాక్యం, ఒక కదలిక, ఒక చేత, ఒక కర్మ నుంచి మరొక కర్మకు వేసే అంగ.

మనుషులు తమ చేతుల్తో తమ జీవితాల్ని ప్రభావితం చేసుకునే నాటక గమనం. అలాగే మనుషుల వ్యక్తిత్వం వాళ్ళు కోరుకునే దాని రూపం లోనో ఒదలుకునే దాని రూపంలోనో బహిర్గతం అవుతుందన్నాడు అరి స్టాటిల్. ఇందుకు ఎన్నో అద్భుతమయిన ఉదాహరణలున్నాయి ఈ కథ పొడుగునా.

ఒక్క వాక్యంతో, ఒక్క మాటతో ఆ మనిషి వ్యక్తిత్వాన్ని స్పష్టంగా అతని వర్గ స్వభావంతో సహా కళ్ళ ముందు పెడతాడు రచయిత. దొర యానాదివాడి ఇంటికి వచ్చి ఎలకల్ని పట్టమన్నప్పటి సన్నివేశంలో అదే దొర వాడి మీదకు దాడి చెయ్యడానికి వచ్చి, ముందు అరుస్తున్న కుక్కని కట్టెయ్యమన్నప్పుడు దొర అర్ధరాత్రి గుర్రంపైన యానాది ఇంటికి వెళ్తున్నపుడు 'ఆ పనికి పాలు మాలిన వాడెవడో గాని వాని పెండ్లాం మెడలో తాడు ఈ పొద్దు తెగిపోతుంది' అని ముసుగు పెట్టి పడుకునే రైతు ఉదాసీనతలో గాని ఇది స్పష్టంగా కనిపిస్తుంది. కాగా అన్నిటి లోనూ గొప్ప స్వభావ చిత్రణ మంచెపైన కూచుని మన్నుగాడు తన బిడ్డ గురించి కన్నకలల్లో కనిపిస్తుంది. మనుషుల అంతరంగ, భౌతిక వాస్తవాల గురించి ఎంతో అవగాహన కలిగిన రచయిత కితప్ప ఇలా రాయడం మరొకరికి చాతకాదు.

ఒక అన్నిటకన్నా విశిష్టమయింది – ఈ కథని చెప్పే తీరు. పురాతన ఆసియా సంప్రదాయపు కథన రీతి ఇది. జరగబొయ్యే సంఘటనలని ముందే సూచిస్తూ ఉత్కంఠ రేకెత్తించే ఈ పద్ధతి గ్రామీణులు కథలు చెప్పే పద్ధతి లాంటిది.

ఆంగ్లో – అమెరికన్ సంప్రదాయంలో నవలా రచనను నేర్చుకున్న మన రచయితలకి ఇది కొత్తగా అన్పిస్తుంది. కాని ఈ అంశం గురించి కూడా అరిస్టాటిల్ ఇలా రాసి వున్నాడు." సంఘటనలు గతానుగతికంగా జరిగినట్లే గాక, వాటంతట అవి, అలానే యాదృ చ్ఛికంగానూ జరిగినట్లు చూపిస్తే మరింత రసవత్తరంగా వుంటుంది.

యాదృచ్ఛిక సంఘటనలు కూడా ఏదో ఒక అదృశ్యవ్యూహం ప్రకారం జరిగినట్టుంటే మరీ గమ్మత్తుగా ఉంటుంది. ఏమంటే అటువంటి సంఘటనల వెనక ఏదో ఒక అర్థం లేకపోదని మనం

అనుకొంటాం కనుక '(పొయెటిక్స్, 1452 పేరా) కథకుడి పట్ల శ్రోతకి విశ్వాసాన్ని పెంచే పద్ధతి ఇది. కథకునికి తను చెప్పేది చివరి దాకా తెలుసుననీ, దాని సకల పర్యవసానాలతో సహా దాన్ని పూర్తిగా హృదయగతం చేసుకొన్నాడనీ, అనుభవాల చేదు విషాదం నుండి తరువాతి తరాల వారికి ఏదో నైతిక సందేశాన్ని అందిస్తున్నాడనీ శ్రోతకి నమ్మకం కలిగించేది అదే. కేశవ రెడ్డికి శ్రోతగా నాకు అనిపించిందీ ఇదే.

- వాడ్రేవు చినవీరభద్రుడు

హైదరాబాదు
08-06-1996.

1

వేసవి గనుక త్వరగా తెల్లవారింది. ఇంకా సూర్యోదయం కానప్పటికీ తూర్పు ఆకాశం తేజోవంతమయింది. గుడ్లగూబలు, గబ్బిలాలు చెట్ల తొర్రలలోకి అటకలోకి ప్రవేశిస్తున్నాయి. రాత్రంతా గునగున నడుస్తూ శ్రమిస్తుండిన చీమలు తమ పుట్టలలోకి దూరుతున్నాయి.

కుక్కి మంచాలపైన, చాపలపైన, బొంతలపైన పడుకుని ఉండిన గ్రామస్థులు ఒక్కొక్కరే నిద్రలేచి వీధులలోకి వస్తున్నారు. కొట్టాలలో పశువులు చప్పుడు చేసుకుంటూ లేచి, తోకలతో వీపుల మీద, జబ్బల మీద కొట్టుకోసాగాయి.

ప్రపంచాన్ని మేలుకొల్పడంలో సూర్యునికి సహాయపడడానికి అన్నట్లు గాలి కూడా వీచడం ప్రారంభించింది. ఊరికి తూర్పుగా ఉన్న చింత చెట్ల కొమ్మలు చప్పుడు చేసుకుంటూ కదలసాగాయి. చింతచెట్ల కవతల వున్న జిల్లేడు చెట్లు, వెంపలి చెట్లు నిశ్శబ్దంగా కదలసాగాయి.

జిల్లేడు చెట్ల కవతల ఒంటరిగా ఒక యానాది గుడిసె ఉన్నది. గుడిసె కప్పులోని తాటాకులు గాలిపాటుకు టిక్కు టిక్కుమని చప్పుడు చేస్తున్నాయి. గుడిసెలో మన్నుగాడు ఈత చాపపైన వెల్లకిల పడుకుని ఉన్నాడు. అతనికి మెలకువ వచ్చి చాలా సేపయింది. కాని కళ్ళు తెరవలేదు.

మిగత గ్రామస్థుల వలె కోడికూతతో మేలుకునే అవసరం అతనికి లేదు. అతని జీవనోపాధులు అనేకం. అవి సంవత్సరం పొడుగునా ఆయా రుతువులను బట్టి ఆధారపడి వుంటాయి. కొన్ని రుతువులలో అతడు రాత్రంతా నిద్రించి పగలు మేల్కొంటాడు. కొన్ని రుతువులలో రాత్రంతా మేల్కొని పగలు నిద్రిస్తాడు. మరికొన్ని రుతువులలో నడిరాత్రి నుంచి మధ్యాహ్నం వరకు నిద్రపోతాడు.

మరికొన్ని రుతువులలో మధ్యాహ్నం నుంచి నడిరాత్రి వరకు మేల్కొని వుంటాడు. చెట్లలోని పక్షులకు వలె, నేల మీద చీమలకువలె, అడవిలోని జంతువులకు వలె అతని జీవనోపాధులు అనేకమైనవే గాక, అనిశ్చితమైనవి కూడా. కాని అతడు మిగిలిన గ్రామస్థులవలె ఆలోచిం చగలడు, మాట్లా డగలడు, రాగద్వేషాలను ప్రదర్శించగలడు.

మన్నుగాడు కళ్ళు తెరిచాడు. గుడిసెకప్పు అక్కడక్కడ ఎగిరిపోయి వున్నది. ఆ రంధ్రాల గుండా కనిపిస్తున్న నీలాకాశాన్ని, నిస్తేజమవుతున్న నక్షత్రాలను అతడు చూడసాగాడు. అతని ప్రక్కన అతని కొడుకు నోటి అంచుల వద్ద చొంగ కారుతుండగా, గుర్రుకొడుతూ నిద్రిస్తున్నాడు.

ఇంతలో గుడిసె బయట పెంపుడు కుక్క మొరగడం వినిపించింది. అది తన కంఠస్వరం ద్వారా ఇచ్చే సంకేతాలన్నీ

మన్నుగాడికి కరతలామలకం. అతడు పైకి లేచి, గుడిసె ద్వారానికడ్డంగా ఉన్న వెదురు తడికను పక్కకు నెట్టి బయటకొచ్చి నిలబడ్డాడు.

గుడిసెకు ఇరవై గజాల దూరాన విశాలమైన మట్టిబాట ఉన్నది. ఆ బాట వెంబడి కొంతమంది సిపాయిలు నడుస్తున్నారు. వారు ఒకరి వెనక ఒకరుగా మూడు వరుసలలో నడుస్తున్నారు. వాళ్ళు దాదాపు నూరుమంది వున్నారు. వాళ్ళలో ఒకడు అందరికన్నా ముందు నడుస్తూ, "లెఫ్ట్, రైట్" అని అరుస్తున్నారు. మిగిలిన వాళ్ళు అతని అరుపులకు అనుగుణంగా చేతులు ఆడిస్తూ, అడుగులు వేస్తున్నారు. వాళ్ళ తలల మీద నల్లటి ఉక్కుటోపీలు ఉన్నాయి. కాళ్ళకు ఎత్తయిన బూట్లు ఉన్నాయి. దళసరి బట్టతో కుట్టిన చొక్కాలను, లాగులను వారు ధరించి ఉన్నారు. వాళ్ళందరి భుజాల మీద పొడవాటి తుపాకులున్నాయి. వాళ్ళ వెనక బూడిద రంగులో ఉన్న రెండు పెద్ద ట్రక్కులు మందగమనంతో సాగుతున్నాయి.

మట్టిబాట మీద సాగుతున్న సిపాయిల దండును చూసి కుక్క మొరుగుతూ ఉంది. మన్నుగాడు బయటకు రాగానే అది మొరగడం ఆపి, తన యజమాని కాళ్ళ వద్దకు వచ్చి నిలబడింది.

మన్నుగాడు గుడిసె ద్వారం వద్ద నిలబడి నోరు వెళ్ళబెట్టుకుని చూడసాగాడు. ఈలోగా అతని కొడుకు లేచి బయటకు వచ్చి తండ్రి వెనుక నిలబడ్డాడు.

అతని పొలకువను గుర్తించి మన్నుగాడు తలతిప్పి, "నువ్వెప్పుడు నిద్దర్లేస్తివిరా సిన్నోడా?" అన్నాడు.

చిన్నోడు, "కుక్క మొరిగినప్పుడే లేసినాన్నాయనా." అని తండ్రి వెనక నుండి తొంగి చూస్తూ "ఎవుర్నాయనా వాళ్ళు?" అన్నాడు.

మన్నుగాడు బాటమీదకు చూస్తూ "ఎవురో నాకేమి దెల్సు. పోలీసోల్లు మాదిరుండారు" అన్నాడు.

చిన్నోడు వణుకుతున్న స్వరంతో, "పోలీసోల్లా! ఐతే లోపలకొచ్చెయ్ నాయనా లోపలకొచ్చెయ్" అని తండ్రి రెక్కను పట్టి లోపలకు గుంజసాగాడు.

మన్నుగాడు, "పోలీసోల్లయితే మనకెందుకురా భయం. మనం దొంగతనం చేసినామా ఏమన్నానా?" అన్నాడు.

చిన్నోడు అప్పటికే నిలువెల్లా వణుకుతున్నాడు. వాడు తండ్రి రెక్కను పట్టిగుంజుతూ, "నాకు భయంగా ఉంది నాయనా. లోపలికొచ్చెయ్. ఒకరా, ఇద్దరా? ఎంత మంది ఉండారో సూడు. వాళ్ళ కండ్లల్లో పడితే ఇంగమనం అతమై పోతాం. లోపలకొచ్చెయ్ నాయనా" అన్నాడు.

తండ్రి ఎంత సేపటికీ కదలక పోయేటప్పటికి చిన్నోడు వెదురు తడకను ద్వారానికి అడ్డంగా పెట్టి, లోపలకు వెళ్ళి ఒక మూలన తడిసిన పిట్టవలె కూర్చున్నాడు.

మన్నుగాడు సిపాయిల దండును మరుగయి పోయేదాక చూస్తూ నిలబడ్డాడు. తరువాత పెరట్లోకి వెళ్ళి కాళ్ళు, చేతులు, ముఖం కడుక్కున్నాడు. తుండు గుడ్డతో ముఖం తుడుచుకుని, "సిన్నోడా? ఓరి సిన్నోడా!" అని పిలిచాడు. అతని పిలుపుకు సమాధానం రాలేదు.

మన్నుగాడు లోపలకొచ్చి "పిలస్తా ఉంటే పలక్కుండా ఈడకూసోనుండా వేందిరా?" అన్నాడు.

చిన్నోడు కండ్లు పెద్దవిగా చేసుకుని, "వాళ్లు ఎల్లిపోయినారా?" అనడి గాడు.

"ఎవరు?" అనడిగాడు మన్నుగాడు.

"పోలీసోల్లు ఉండారా? ఎల్లిపోయినారా?" అన్నాడు చిన్నోడు.

మన్నుగాడు, "వాళ్ళుపోయి జావుసేపయింది. నువ్వు లేచి మొకం కడుక్కో యలబారదాం" అని కుందేళ్ళను, ఉడుతలను పట్టడానికి ఉపయోగించే సామాగ్రిని సవరించుకోసాగాడు.

చిన్నోడు అలాగే కూర్చుని, "నాయినా" అన్నాడు.

మన్నుగాడు తన పని చేసుకుంటూనే, "ఏందిరా?" అన్నాడు.

చిన్నోడు, "నాయినా. ఈ పొద్దు మనం బయటకు పోవద్దే నాకు బయంగా వుంది" అన్నాడు.

మన్నుగాడు "నువ్వు లేచి మొకం కడుక్కుంటావా? నడుంవులిరగదన్న మంటావా?" అన్నాడు.

చిన్నోడు ప్రాధేయపడుతున్నట్టు, "వాళ్ళు ఓపినంతమంది ఉండారు. ఒక్కొ క్కరి దగ్గర బారెడు పొడుగు తుపాకులుండాయి. మనల్ని కాల్చిపారేస్తే యట్ట?" అన్నాడు.

మన్నుగాడు వలను మడతపెట్టి గడప దగ్గర ఉంచి, "దోవనెవరో పోలీ సోల్లు పోయినారని మనం ఇంట్లో కూసుంటే యట్టరా? బయటకు పోకపోతే పొట్ట గడిచేదెట్ట?" అన్నాడు.

చిన్నోడు "ఆ తుపాకుల్ని తల్చుకుంటే పేగులు నీళ్ళయిపోతా ఉండాయి. ఉండేదేదో ఉడకబెట్టుకుని తిని ఈ పూట ఇంట్లోనే ఉందాం నాయనా" అన్నాడు.

మన్నుగాడు బోటుకొయ్యలను మోపుకడుతూ, "ఐతే నువ్వు గుడిసెలోనే ఉండు. నేను పొయ్యొస్తా" అన్నాడు.

చిన్నోడు నీళ్ళలో మునిగిపోతున్న వాడివలె చేతులు ఆడిస్తూ, "వొద్దు వొద్దు. నువ్వు గూడా ఉండు నాయనా. నేనొక్కడినే ఉంటే నాకు బయం. వాళ్ళొచ్చి కాల్చి సంపేస్తారు" అన్నాడు.

అప్పటికి మన్నుగాడు సహనం గోల్పోయి, "సంపితే సావు. అదురు నా కొడకా. నీ యట్టా కొడుకు ఉన్నా ఒకటే, చచ్చినా ఒకటే" అని విసురుగా వెళ్ళి చిన్నోడిని ఒక తాపు తన్నాడు. చిన్నోడు దబ్బున పక్కకు తూలిపడి వికృతంగా ఏడవడం ప్రారంభించాడు.

మన్నుగాడు ఒక బోటు కొయ్యను తీసుకుని, "నీతో యట్ల ఏగేదిరా. నువ్వు సావవు, నన్ను సావనియ్యవు" అని కర్ర పైకెత్తి, స్వరం హెచ్చించి, "ఏడుపు ఆపుతావా? బర్రెవికలిరగ్గొట్ట మంటావా?" అనరచాడు.

చిన్నోడు గబుక్కున ఏడుపు ఆపి, అరచేతులతో తలను కప్పుకుని, "కొట్టొద్దు నాయనా. నన్ను కొట్టొద్దు నాయనా. నేనొస్తా. నువ్వు యాడికి రమ్మంటే ఆడకి వస్తా. నన్ను కొట్టొద్దు నాయనా" అన్నాడు.

మన్నుగాడు కర్రను కింద పడేశాడు. చిన్నోడు భారంగా లేచి నిల్చున్నాడు. మన్నుగాడు కొడుకు భుజంపైన చేయివేసి అనునయిస్తూ "నేనుండానుగదరా సిన్నోడా నేను బతికే ఉండాను గదరా. నేనుండగా నీకేం బయం. వాళ్ళు పోలీసోల్లయితే మనకేవి? ఇంగెవురన్నా అయితే మనకేవి? వాళ్ళ దగ్గర తుపాకులుంటే మనకేవి. బాంబులుంటే మనకేవి" అన్నాడు.

చిన్నోడు చెంపల మీద కారుతున్న కన్నీళ్ళు తుడుచుకుని, "ఔగద నాయనా. నువ్వుండగా నాకేం బయం" అని మట్టిబాటను చూస్తూ, అక్కడె వరినో సంబోధిస్తున్నట్టు గట్టిగా, "మా నాయన

ఉండగా నాకేం బయంలేదు. పోలీసోల్లయినా సరే. ఇంగెవు రయినా సరే. నాకేం బయం లేదు" అన్నాడు.

మన్నుగాడు కొడుకు భుజం మీద చరచి, "అదీ అట్టుండాల. ఇంగపో. పెరట్లోకి పోయి మొకం కడుక్కో. మనం బిన్నె బయలుదేరాల. ఎండ బారడెక్కిందంటే ఉడతలు చెట్లు దిగేస్తాయి" అన్నాడు.

2

తూర్పు ఆకాశం అంతకంతకూ తేజోవంతమవుతూ ఉంది. ఆ తేజస్సుకంతటికీ మూలం తానేనని ప్రకటించుకుంటూ కొంత సేపటికి సూర్యుడు తూర్పు కొండల మీద ప్రత్యక్షమయ్యాడు.

మన్నుగాడు ఒక కాలిబాట మీద నడుస్తున్నాడు. అతని భుజం మీద వల ఉన్నది. అతడు దారికిరువైపుల వుండే చెట్లను, పొదలను పరిశీలనగా చూస్తూ నడుస్తున్నాడు. చిన్నోడు తండ్రి నీడను తొక్కుకుంటూ అతని వెంబడి నడుస్తున్నాడు. వాడి భుజం మీద బోటు కొయ్యల మోపు ఉన్నది. అతడు తల వాల్చుకుని తన పాదాలను చూసుకుంటూ నడుస్తున్నాడు.

అలా కొంత దూరం నడిచాక చిన్నోడు చటుకున్న నేలమీద మోకాళ్ళపైన కూర్చుని, "నాయనా. ఈ పొద్దు మనం నక్కతోక తొక్కినాం" అనరిచాడు.

మన్నుగాడు ఆగి వెనుదిరిగి "ఏవయిందిరా?" అనడిగాడు.

చిన్నోడు, "ఈడసూడు. ఇసుకలో కుందేలు అడుగులు కనిపిస్తా ఉండాయి. అది సుట్టు పక్కల యాడనో దాక్కోనుండాది" అన్నాడు.

మన్నుగాడు కూడా ఇసుకలో మోకాళ్ళమీద కూర్చుని, కొడుకు చూపిస్తున్న గుర్తులను కాసేపు పరిశీలించాడు. తరువాత నుదుటిమీద మెల్లగా కొట్టుకుని, "నీ తెలివి మండ. అవి కుందేలు అడుగులని యట్టనుకుంటివిరా" అన్నాడు.

చిన్నోడు "కుందేలు అడుగులు కాకపోతే ఇంగేవిటివి?" అని చూపుడు వేలుతో చూపిస్తూ, "ఇద్దో ఇది బొటనవేలు. ఇవి నాలుగు మిగిలిన వేళ్ళు" అని తన వాదన లోపరహితమైనదన్నట్టు తండ్రివైపు చూశాడు.

మన్నుగాడు తల అడ్డంగా ఆడించి, "బొటనవేలు సరే. మిగిలిన నాలుగు వేళ్ళు సరే. మరి ఇవిజూడు. వేళ్ళ ముందర చిన్న గీతలుండాయి జూడు. అవి గోళ్ళ గుర్తులు. కుందేలు కాళ్ళకు గోళ్ళుంటాయంట్రా?" అన్నాడు.

చిన్నోడు కనుబొమలు ముడివేసుకుంటూ కాసేపు ఆలోచించి, "ఔ, నువు జెప్పేది నిజమే. ఐతే ఇవి పిల్లి అడుగులో, కుక్క అడుగులో అయ్యుండాల" అన్నాడు.

మన్నుగాడు కొడుకు వైపు చుర చుర చూసి, "యానాది పుటక పుట్టివి. ఇరవైయేండ్లు వయసొచ్చింది. ఈనాటికీ నువ్వు పిల్లి అడుగుల్ని, కుందేలు అడుగుల్ను పోల్చుకోలేకపోతే యట్టరా. రేపు నేను దాటుకున్నాక యట్ట బతకతావురా" అని వలను తీసి భుజాన వేసుకుని, "ఇంగలెయ్యి. దున్నేవానికి నక్కల్ను జూపించినట్టు పని పంచేటు చేస్తివి. ఇంగలేసి బయలుదేరు" అన్నాడు. చిన్నోడు అయిష్టంగా లేచి బోటు కొయ్యల మోపును భుజాన పెట్టుకుని నడవసాగాడు.

చిన్నోడు, "అవి కుందేలు అడుగులయ్యుంటే ఎంత బాగుండు నాయనా. ఈపాటికి వలేసి పట్టేసుందుం. కుందేలు మాంసం తిని

ఎన్నాళ్ళయింది నాయినా. ఈసారి కుందేలు దొరికితే దాని మాంసం నూనెలో వేయించి తిందం నాయనా. కమ్మగా ఉంటుంది" అన్నాడు.

మన్నుగాడు, "అట్టనే చేద్దాంలే. కావాలంటే మసాల ఏసి కూర చేసుకుని తిందాం. నువ్వు సరసర అడుగులెయ్యి. పొద్దెక్కి వస్తా వుంది" అని గాలిలో కాసేపు వాసన పట్టి వెనక్కు తిరిగి చిన్నోడి నిక్కరును చూస్తూ, "రాత్రి మళ్లీ పడకలో ఉచ్చబోసున్నావంట్రా?" అన్నాడు.

చిన్నోడు తన నిక్కరుపై తేమ మరకలున్న చోటును చేతులతో కప్పుకోవడానికి ప్రయత్నిస్తూ, "రాత్రి ఒంటేలు కొచ్చినప్పుడు నిన్ను లేపినా నాయనా. రెండు సార్లు లేపినా. నువ్వు మూసిన కన్ను తెరవకపోతివి" అన్నాడు.

మన్నుగాడు, "నేను కన్ను తెరవకపోతే ఏవయిందిరా. నువ్వు లేచి నాలుగ డుగులేసి పెరట్లోకి పోకపోతివా" అన్నాడు.

చిన్నోడు, "పెరట్లోకి పోదామని తడిక దాకా వస్తిన్నాయనా. పెరట్లో గొండ్రకప్పలు అరస్తా ఉండినాయి. వాటి అరుపులు యినంగానే నా గుండి కాయలు నీళ్ళయిపోయినాయి. ఇంగ అట్టనే పోయి పడుకున్నా" అన్నాడు.

మన్నుగాడు "థూ, నీయమ్మ. అదురునాకొడకా. గొండ్ర కప్పలకు, జెముడు కాకులకు బయపడేటోడివి యానాది పుటక ఎందుకు పుట్తివిరా" అన్నాడు.

తండ్రి అంటున్నదేమిటో అర్థం కాక చిన్నోడు గుక్కిళ్ళు మింగుతూ నిల్చు న్నాడు.

సూర్యుడు తూర్పుకొండ అంచుకు జానెడెత్తున నిలబడి ఉన్నాడు. అంతకంతకు సూర్యుడు ఎర్రదనాన్ని కోల్పోతూ, తెల్లదనాన్ని సంతరించు కుంటున్నాడు. ఇంత దనుక వెలుగును మాత్రమే ఉత్పత్తి చేస్తుండిన సూర్యుడు ఇప్పుడు వేడిమిని గూడా ఉత్పత్తి చేస్తున్నాడు.

మన్నుగాడు దారికిరువైపుల వున్న పొదలను, చెట్లను పరిశీలనగా చూస్తూ నడుస్తున్నాడు. చివరికతడొక సిగర చెట్టు వద్ద ఆగాడు. చెట్టు కొమ్మలను జాగ్రత్తగా పరిశీలించి, భుజం మీదున్న వలను దించుతూ, "చిన్నోడా, చెట్టు చుట్టూ బోటుకొయ్యలు నాటు. శబ్దం కాకుండా నాటాల. కొయ్యలు నేలలోకి రెండు అడ్డేళ్ళు దిగితే చాలు" అన్నాడు.

చిన్నోడు "ఎందుకు నాయనా. చెట్లో ఏవన్నా కనిపించిందా?" అన్నాడు.

మన్నుగాడు, "ఉడత ఉండాదిరా. ఆ పడమర తట్టు కొమ్మ మీద ఉండాది జూడు" అన్నాడు.

చిన్నోడు పడమటి తట్టుకొమ్మను చూసి గట్టిగా "ఔ నాయనా. కొనకొమ్మ మీద పడుకోనుండాది. ఈడికి కనిపిస్తా వుండాది" అనరిచాడు.

మన్నుగాడు కొడుకును కసురుకుంటూ, "గట్టిగా అరవొద్దురా బెస్టునా కొడకా. ఎలుగు వినిపిస్తే అది నిద్రలేచి కిందకు దూకే స్తుంది" అన్నాడు.

చిన్నోడు తన తప్పును గ్రహించినట్లు నాలిక్కరుచుకుని "అవున్నాయనా. దాన్ని బెదరు పెట్టకూడదు" అన్నాడు. అతడు భుజం మీదున్న బోటుకొయ్యల మోపును దించి, కొయ్యలను చెట్టు

చుట్టూ నాటసాగాడు. నాటడం ముగించి నిలబడి నడుం పైన చేతులు పెట్టుకొని చెట్టు కొమ్మలను పరిశీలించి, గబగబ తండ్రి వద్దకు నడిచి మెల్లగ "నాయనా చెట్టుపైన ఇంకొక ఉడత గూడా వుండాది" అన్నాడు.

మన్నుగాడు, "యాడ?" అనడిగాడు.

చిన్నోడు, "అద్దో ... ఆడకూసోనుండాది జూడు" అంటూ చేయి పైకెత్తి ఒక కొమ్మ వైపు చూపించాడు.

మన్నుగాడు కొడుకు చేతిపైన ఫెడీల్మని ఒక దెబ్బ వేసి, "చేత్తో చూపించొద్దురా. మనకున్నట్లే దానిగ్గూడ కండ్లుండాయి. యాడుందో నోటితో చెప్పు" అన్నాడు.

చిన్నోడు దెబ్బ తగిలిన చోట రుద్దుకుంటూ, "ఉత్తర పక్కన ఎండు కొమ్మ ఉండాజ్జూడు దానిపక్క కొమ్మమీదుండాది.

యనక కాళ్ళ మీద కూసోని తోకపైకెత్తకోనుండాది" అన్నాడు.

మన్నుగాడు సూర్యకిరణాలకడ్డంగా అరచేయి పెట్టుకుని ఉత్తరం వైపు కొమ్మలను పరిశీలించి, "ఔ. యనక కాళ్ళ మీద కూర్చుని తోక పైకెత్తు కోనుండాది. మనం ఆలస్యం చేసినామంటే అవి చెట్టు దిగేస్తాయి" అన్నాడు.

అతడు గబగబ బోటు కొయ్యల వెంబడి వలను పూనించాడు. చెట్టు చుట్టూ పన్నిన వలను ఒకసారి తృప్తిగ చూసుకొని, "ఇంగ తప్పించుకోవడం వాటబ్బతరం గాదు.

చిన్నోడా. నువ్వు చెట్టెక్కి కొమ్మల్ని పట్టుకొని ఊపు. అవి కిందపడి పరుగెత్తుకుంటూ వచ్చి వలలో పడతాయి" అన్నాడు.

చిన్నోడు. “మనం చెట్టెక్కేదేవిటి నాయనా? ఎండ ఎక్కే కొద్ది అవే చెట్టు దిగి వలలో పడతాయి. వలలో పడినప్పుడు పట్టుకుందాం” అన్నాడు.

మన్నుగాడు “వాటంతటవే దిగేదాక ఎగజూసుకుని కూసోవాలంటే అయ్యే పనేనా. అవి సద్దేలకు దిగుతాయో, సంగటేలకు దిగుతాయో. ఎవురికి తెల్సు, వలపన్నినామని తెలిస్తే అవి అసలు చెట్టు దిగవు. నువ్వు చెట్టెక్కు” అన్నాడు.

చిన్నోడు తటపటాయిస్తూ “నాయనా, నాకు బయంగా వుందే అసలే సిగర చెట్టు కొమ్మలు పెళుసుగా వుంటాయి. కొమ్మ ఇరిగి పడితే తుంటి ఇరిగితే, కాలిరిగితే మల్ల యట్ల? నువ్వు ఎక్కు” అన్నాడు.

మన్నుగాడు కొడుకు వైపు ఉరిమి చూసి, “సిగర చెట్టు ఎక్కమంటే కొమ్మలు పెళుసంటావు. తుమ్మ చెట్టు ఎక్కమంటే ముండ్లు గుచ్చుకుంటాయంటావు. నువ్వు యానాదోని కడుపున పుట్టాల్సినోడివి కాదురా. యాడనో మారాజుల కడుపున పుట్టాల్సినోడివి. సరే నేనే ఎక్కుతా” అని గోచి బిగించి కట్టుకుని, “ఉడతలు కిందపడంగానే నువ్వు చేయాల్సిన పని ఏంది?” అనడిగాడు.

చిన్నోడు గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డాడు.

మన్నుగాడు, “నువ్వు తూరుప్పక్కన నిలబడు. ఉడత వలలోకి దూరగానే గబుక్కున అదిమి పట్టెయ్. దాని మెడ మీద తోలు ఉంటుంది జూడు – ఆ తోలును నీ బొటన వేలితో, చూపుడు వేలితో పట్టుకో”అని ఎలా పట్టుకోవాలో అభినయించి చూపి, “దాని తోకను గాని, కాళ్ళను గాని పట్టుకోవద్దు. పండ్లతో కొరికేస్తుంది” అన్నాడు.

చిన్నోడు, “సరే నాయనా. ఒక ఉడతకత నేను చూసుకుంటా. రెండో ఉడతకత?” అన్నాడు.

మన్నుగాడు, “దాని కత “రాజి” చూసుకుంటుంది” అని పెంపుడు కుక్కను పిలిచి, చెట్టుకు పడమర వైపున నిలబడి వుండమని దానికి సైగ చేసి చెప్పాడు.

చిన్నోడు తూర్పువైపున, “రాజి” పడమటి వైపున నిలబడి కొమ్మల మీదున్న ఉడతలను చూడసాగారు.

మన్నుగాడు తలపాగా బిగించి కట్టుకుని చెట్టెక్కడం ప్రారంభించాడు. కాండం కొమ్మలుగా చీలుతున్న చోట నిలబడి రెండు చేతులతో కొమ్మలను పట్టుకుని బలంగా ఊపసాగాడు. ఉడుతలు రెండూ ఈ కొమ్మనుంచి ఆ కొమ్మకు, ఆ కొమ్మ నుండి మరో కొమ్మకు దాటడం ప్రారంభించాయి. అవి కీచుకీచుమని అరుస్తూ, వెర్రెత్తినట్టు ముందుకు, వెనక్కు కాసేపు పరుగెత్తి దబ్బుమని నేలమీద వెల్లకిల పడ్డాయి. మరుక్షణమే బోర్ల తిరిగి తోకలు పైకెత్తుకుని పరుగిడుతూ వలలోకి దూరాయి. చిన్నోడు వెంటనే ఒక ఉడుతను వలతో సహా అదిమి పట్టుకుని, వలతో సహా పైకెత్తాడు. చెట్టు చుట్టూ ఉండిన వల యావత్తూ పైకిలేచింది. వలపైకి లేవగానే రెండో ఉడుత తప్పించుకుని ఇసుక మీద పరుగెత్తడం ప్రారంభించింది. రాజి దానిని వెంబడించి నోటితో పట్టుకుని తిరిగి వచ్చింది.

ఈలోగా చిన్నోడు తన కుడిచేతిని వలలోకి జొనిపి జాగ్రత్తగా ఉడుతను పిడికిట్లో పట్టుకున్నాడు. మరుక్షణమే, “నీయమ్మ! సంపితివి గదనే” అంటూ దానిని విసిరి నేలకేసి కొట్టాడు. ఉడుత నేలమీద పడి కీచుకీచుమని అరుస్తూ పరుగెత్తి దాపున వున్న గచ్చపొదలోకి మాయమైపోయింది.

మన్నుగాడు చెట్టు దిగాడు. రాజి తన నోట కరచుకుని తెచ్చిన ఉడుతను యజమాని కాళ్ళ వద్ద పడేసింది. ఉడుత కొన ప్రాణంతో కొట్టుకుంటూ వుంది. మన్నుగాడు తల పాగా విప్పి. "రెండో ఉడత ఏదిరా?" అని కొడుకుని అడిగాడు.

చిన్నోడు ఏడుపుమూతి పెట్టి, "కొరికేసి పారిపోయింది. యట్ట కొరికేసిందో చూడు" అని తన కుడిచేతి వెనక భాగాన్ని చూపించి. "నాయాల్ది. మళ్ళీ దొరి కితే పండ్లూడగొట్టి పొట్లం కట్టేద్దును" అన్నాడు.

మన్నుగాడు, "వలలో పడిన జీవాన్ని యిడిసిపెట్టేస్తివిగదరా పాపిష్టోడా. నీకన్న ఈ కుక్క మేలు. దీనికుండే తెలివి కూడా నీకు లేదు" అన్నాడు.

చిన్నోడు ఏడుపు, దుఃఖము కలిసిన గొంతుతో, "నన్నేవి జెయ్యమంటావు. నువ్వు చెప్పినట్టే వలలో పడంగానే అదిమి పట్టుకుంటిని. అది కొరికే దానికి మొదులు పెట్టె. ఒక్కొక్క పల్లు ఎంత లోతు దిగిందో చూడు" అన్నాడు.

మన్నుగాడు, "కొరికితే ఏవయిందిరా. ఆమాత్రం ఓర్చుకుని దాన్ని సమాళిం చలేవా? నువ్వేమన్నా పాళెగాని కొడుకువా? ముండపని చేసింది చాలక ఇంకా మాట్లాడతా ఉండావా?" అంటూ విసురుగా వెళ్ళి కొడుకు చెంపపైన చాచి ఒక దెబ్బ కొట్టాడు. చిన్నోడు చెంపను రెండు అరచేతులతో కప్పుకుని, ఇసుక మీద కూర్చుని ఏడవడం ప్రారంభించాడు.

3

సూర్యుడు తూర్పు కొండలకు బారడెత్తున నిలిచి ప్రకాశిస్తున్నాడు. మనుషులు తనను సూటిగ చూడలేనంత తీక్షణతను ఆపాదించుకుంటున్నాడు. అతడు చెరువులలోని నీటిని ఆవిరిగాను, మనుషుల శరీరాలలోని నీటిని చెమటగాను మార్చడం ప్రారంభించాడు.

ఒక బైరాగి కాలిబాట మీద నడిచి వస్తున్నాడు. అతడు కాషాయ బట్టలను, మెడలో రుద్రాక్షమాలను ధరించి ఉన్నాడు. నుదుట ఎరుపు, తెలుపు రంగు లలో నామం ఉన్నది. తెల్లటి బవిరి గడ్డం ఎదను కప్పుతున్నది. అతని ఎడమ భుజం నుండి జోలె వ్రేలాడుతున్నది. కుడి చేతిలో తంబుర ఉన్నది.

అతని నుదుటి మీద, మెడ మీద స్వల్పంగా చెమట పట్టి ఉన్నది. చెమట మూలాన కావిరంగు చొక్కా అక్కడక్కడ వీపుకు అతుక్కుని ఉన్నది. పాదరక్షలు లేని అతని కాళ్ళు దుమ్ము కొట్టుకుని ఉన్నాయి. అతని నడకలో అలసట కనిపిస్తున్నది.

అతడు సిగర చెట్టు వద్ద ఆగి, తనలో తాను మాట్లాడుకుంటున్నట్లు, "పొద్దు బారడు కూడా ఎక్కలేదు. అప్పుడే ఎండ మాడబెడుతున్నది" అన్నాడు.

మన్నుగాడు బైరాగిని చూస్తూ "బాగడస్సిపోయినట్టుండావు. నీడలోకి రాసావి" అన్నాడు.

బైరాగి చెట్టు నీడలోకి నడచి వచ్చి జోలను దించి పెట్టాడు.

మన్నుగాడు బైరాగిని కాసేపు చూసి, "మంది ఏ వూరు సావి" అన్నాడు.

బైరాగి, "మాది అరవ దేశవన్నా. సొంత దేశం వదిలిపెట్టి ముప్పై ఏండ్లయ్యింది. ఇప్పుడు అన్నీ నా వూర్లే. ఏ వూరు కాడ పొద్దు పోతే ఆ దినానికి అదే నా వూరు" అని తంబురను చెట్టు బోదెకు ఆనించి పెట్టాడు. అతడు గ్రామం వైపు చేయి చూపిస్తూ, "ఆడ కనపడే ఊరు పేరేందన్నా" అనడిగాడు.

మన్నుగాడు, "అదా, దాని పేరు ఒంటిల్లు సావి. అదే మా వూరు" అన్నాడు.

బైరాగి ఊరును, దాని పరిసరాలను కలయజూసి, "ఊరు పుంజిగా ఉన్న ట్టుంది' అన్నాడు.

మన్నుగాడు "ప్చ్" అని నోరు చప్పరించి, "వానలు పడి చెరువులు నిండితే ఊరు పుంజిగా ఉంటుంది. అది గూడా బూవులు, తోటలు, దొడ్లు ఉండే కాపు మారాజులకే. ఇక నాబోటి వాళ్ళకు వానలు పడినా ఒగిటే పడకపోయినా ఒగిటే" అన్నాడు.

బైరాగి, "మీరు ఏవిటోల్లు?" అన్నాడు.

మన్నుగాడు, "మేవు యానాదులం సావి" అన్నాడు.

బైరాగి చెట్టు చుట్టూ వున్న వలను చూసి, "ఏదో వల పన్నినట్టుండారే, ఏవన్నా పడినాయా?" అనడిగాడు.

మన్నుగాడు, "యట్ట పడతాయి సావి. నెత్తిన సెనేస్పుడు కూసోనుంటే యట్టపడతాయి' అని కొడుకు వైపు చేయి చూపించి, "ఆడ కూసోనుండాడు జూడు. వాడే సెనేస్పుడు" అన్నాడు.

బైరాగి, "ఏవురా మనిషి?" అనడిగాడు.

మన్నుగాడు విరక్తిగా, "నా కొడుకు సావి. చెప్పుకుంటే సిగ్గుచేటు. ఇరవై ఏండ్లు దాటినాయి. నన్ను కూసోబెట్టి సాకాల్సినోడు నా మెడకు గుదిబండ మాదిర తయారైనాడు" అన్నాడు.

బైరాగి చిన్నోడిని పరిశీలనగా చూడసాగాడు. బలిష్టంగా ఉన్న వాడి దండలను, ఛాతీపైన పొంగుతున్న కండలను చూసి, "పిలగోడు పిడిగిత్త మాది రుండాడుగదన్నా. అట్టాటి కొడుకుని పెట్టుకుని బంగారంతో గోడ పెట్టుకో వచ్చునే. ఎందుకట్ట తీసి పారేస్తా వుండావు" అన్నాడు.

మన్నుగాడు "పిడిగిత్త మాదిరుండి ఏం లాబం సావి. తలకాయలో ఓ గురుగింజంత మెదడు లేదు" అన్నాడు.

బైరాగి వారిద్దరిని కాసేపు మార్చి మార్చి చూసి, "నువ్వేమో ఎలుకనరం మాదిరుండావు. నీ కొడుక్కు, నీకు పోలికే లేదు. వాడికి తల్లి పోలిక లొచ్చినాయాయట్ట?" అన్నాడు.

మన్నుగాడు బోటు కొయ్యలను ఒక్కొక్కదాన్నే ఊడబెరుకుతూ, "పదో సంవత్సరం వచ్చేదాకా వాడుగూడా నా మాదిరే వుండినాడు సావి. పదో సంవత్సరంలో పెద్ద కాయిలా పడినాడు. ఒక నెలదినాలు పగలు, రాత్రి యిడవకుండా ఎయ్యిపుట్ల జరం కాసింది. దిక్కు దేశాలన్నీ తిరిగి వైద్యం చేయ్యించినా. బాట గంగమ్మ మొదలుకుని యంగటేస్వరసావి దాక అన్ని దేవుళ్ళకూ ముడుపులు కట్టినా. బిడ్డ దక్కుతాడనే ఆశ వొదిలేసినా సావి. ఆఖరుకు ఏ వైద్యుని చెయ్యి వాసి కొట్టిందో, ఏ దేవునికి దయ కలిగిందో పిలగోడు బతికి బయటపడినాడు" అని బోటు కొయ్యలను ఒక చోట కుప్పగ వేశాడు.

బైరాగి చెట్టు బోదెనానుకుని, తంబుర పక్కన కూర్చుని మన్నుగాడు చెబుతున్నది వింటున్నాడు.

మన్నుగాడు వలను తీసి చుట్ట చుడుతూ, "పిలగోడు బతికి కండ్ల ముందర తిరగతా ఉండాడన్జెప్పి సంతోషపడటమే తప్ప ఇంకొక లాబం లేదు సావి. కాయిలా పడినప్పుడు వాడు అట్టనే పోయుంటే బాగుండుననిపిస్తా ఉండాది" అన్నాడు.

బైరాగి "కడుపున పుట్టిన బిడ్డను పట్టుకుని అట్టామాటలంటావేందన్నా" అన్నాడు.

మన్నుగాడు చుట్టగా చుట్టిన వలను బైరాగి దాపున ఇసుక మీద వేసి దాని మీద కూర్చుని, "ఏవి జెయ్యాల సావి. కాయిలా పడినప్పట్నుంచి మెదడు పెవళం కాలేదు సావి. వొళ్ళు మాత్రం – నువు చెప్పినట్టు. పిడిగిత్త మాదిర ఇడిగిపోయింది. మెదడు అట్టనే ఉండిపోయింది సావి. ఇప్పటిగ్గూడ పదేండ్ల పిలగోడు మాదిరిగానే మాట్లాడతాడు. కప్పల్ను, నంద్రకాయల్ను చూసి బయపడతాడు. ఈదుల్లో ఎవరన్నా జగడాలాడతా ఉంటే వీడు దుసారక పోయి ఇంట్లో దాక్కుంటాడు. మొబ్బులయినాక నేను తోడు లేందే బయటకు రాడు" అన్నాడు.

బైరాగి సాలోచనగా తల ఊపి, "ముప్పై ఏండ్లుగా నేను రాజ్యాలు తిరగతా ఉండానన్నా. నేను చూడని విచిత్రం లేదు. ఇట్టాటి ఇచిత్రాలు గూడ ఆడాడ సూసినా. ఒకవేళ కాయిలా పడినప్పుడు పిలగోని మెదడు చెడిపోయిందేవో" అన్నాడు.

మన్నుగాడు, "ఏవోసావి. ఆకల్లేడుపులు నాకేవి దెల్సు. వీని వయసుండే పిలగోల్లంతా వాళ్ళ పెండ్లాల్ను వాళ్ళే వెదికి పెండ్లిండ్లు జేసుకుని, బిడ్డల్నుగని సంసారాలు చేసుకుంటూ ఉండారు. వీనికి అట్టాటి ఆలాసిన్లేవీ లేవు. ఎంత సేపూ నా ముడ్డి పట్టుకుని

తిరుగుతానే ఉంటానంటాడు. నేను కాటికి కాళ్లు జాపుకోనుండాను. నేను దాటుకున్నాక వీనిగతి ఏమవుతుందో. అద్దల్సుకుంటే కంటికి నిద్దర పట్టదు సావి" అంటుండగా అతని కంఠం రుద్దమయింది.

బైరాగి అతనిని అనునయిస్తూ "పిలగోడ్ని గురించి అట్టవొగిసేదేవిటికన్నా. కాలూ, సేయి సుద్దంగా ఉండాయిగదా. అజ్జాలు. కులరుత్తులు ఉండనే ఉండాయి. వాటిని అడ్డం పెట్టుకుని వాని బతుకు వాడు బతకతాడు" అన్నాడు.

మన్నుగాడు దీర్ఘంగా నిట్టూర్చి, "కులరుత్తుల కేంవి సాంవీ, లచ్చాపలచ్చ లుండాయి. కాని ఏది చేయాలన్నా ధైర్యం వుండాల గద. ఆ దైర్నింవనేది వీడికి బొత్తిగా లేదు. మాకులరుత్తులు నీకు తెలవదాసాంవి. ఎలుకల్ను పట్టేది, కుందేళ్ళను పట్టేది, ఉడతల్ను పట్టేది, పాముల్నుపట్టేది – ఇవేగద సాంవీ మా కులరుత్తులు. నాగుబామును, రక్తపెంజిరినీ చూసి భయపడినా అద్ధముండాది. పచ్చారుపామును చూస్తే వీడు ఆమడ దూరం పరుగెడతాడు సాంవి. దానికి దగ్గరగా పోతే అది కండ్లు పొడిచేస్తుందంటాడు. నేనూ, ఆ కుక్క కలిసి యట్టనో ఒకట్ల నాగుబామునో, పూడుపామునో పట్టినాంవనుకో. తోలుతీద్దాం ఒకచెయ్యి ఎయ్యరా అంటే దగ్గరగ్గూడా రాడు. నువు ముందు దాని కోరలు పెరికెయ్. మల్ల దగ్గిరికొస్తా" అంటాడు. బొత్తిగా గుండికాయలేనోడు సాంవి. నేను పోయినాక ఒక్కటే ఒక పూట తిండి సంపాదించుకోలేడు. ఈ దిగులుతోనే నేను దిగ్గరికి పోతా ఉండనుసాంవి" అన్నాడు.

బైరాగి, "నేను దిక్కు దేశాలన్నీ తిరిగినానన్నా, ఈ భూమ్మీద ఎంత మంది మనుషులుండారో అన్ని రకాల మనస్తత్వా లుండాయి. మనిషికీ, మనిషికీ పోలిక లేనట్టే వాళ్ళ తత్వాలకూ పోలిక లేదన్నా. ఐతే ఏదీ శాశ్వతం కాదన్నా. ఈ పిలగోడు ఇట్టనే

ఉండిపోతాడని ఎందుకనుకోవాల. వీడికొక వయసు వచ్చినాక చిరతపులిని ఒట్టి చేతులతో ఎదిరించే ధైర్యం వస్తుంది. అట్టాటివి జరగాటం చూసినానన్నా" అన్నాడు.

మన్నుగాడు మళ్ళీ నిట్టూర్చి, "సిరతపులిని యిడిసి పెట్టు. ముంగిస ఎదురుగా వస్తే చెడ్డీలో ఉచ్చాబోసుకుంటాడు. ఊరుసుట్టూ చెరకు తోటలుం టాయి. చెరుకు తోటల్లో యాడసూసిన ముంగిసలే. గెనాల మీద గెడిసేపు తిరిగితే రొండు ముంగిసల్నుకొట్టుకుని రావచ్చు. ముంగిస ఎదురుపడి పండ్లు జూపించిందంటే వీడు వెనక్కు తిరుక్కుని వడిసెలరాయిల బిర్రున పరుగెత్తతాడు. ముంగిస కొండచిలువను తొండెమిట్ల మొండెమట్ల కొరికి పారేస్తుందని వీడికెవురో చెప్పినారంట. అది గెట్టిగా నమ్మేసినాడు. వీని తలకాయనిండా ఇట్టాటి నమ్మకాలే సాంవి" అన్నాడు.

చిన్నోడు ఏడుపు మానేసి చాలా సేపయింది. అతడు దూరాన కనిపిస్తున్న పర్వత పంక్తి వైపు చూస్తూ కూర్చుని ఉన్నాడు. సిగర చెట్టు కింద జరుగుతున్న సంభాషణకూ, తనకు ఏమీ సంబంధం లేనట్లు నిర్లిప్తంగా కూర్చుని ఉన్నాడు.

మన్నుగాడు కొడుకు వైపు కాసేపు చూసి తల అడ్డంగా ఆడించి, "చూసే దానికి మాత్రం రావణాసురుడు మాదిరుండడుగాని ఒట్టి పిరికి గొడ్డు సాంవి" అని బైరాగి వైపు తిరిగి, "నెత్తురు సుక్క కనిపిస్తే చాలు సాంవి. నీళ్ళలో మునిగిపోయేటోని మాదిరి అరవడం మొదలు పెడతాడు. మొన్న – సరిగ్గా నిన్న గాక మొన్న – ఏంవి జరిగింది చెప్తాయిను సాంవి. "అని తూర్పు వైపు చేయి చూపించి" ఆ వంకగెడ్డన వలేసినాను సాంవి. మంచి కుందేలు పడింది. నేను దగ్గరికి పోయేటప్పటికి అది బోటు కొయ్యలను ఊడబెరికేసి, తప్పించుకుని పరుగెత్తటం

మొదలు పెట్టింది. సమయానికి నా దగ్గర ఈటె ఉండింది సాంవి. గురి చూసి యిడిసినా. అది ఈ డొక్కలో దూరి ఆ డొక్కలో బయటకొచ్చేసింది. అరపడి నెత్తురు కారింది. వీడు దగ్గరకొచ్చి ఆ నెత్తురు జూసినాడు. అంతే సాంవి. "అయ్యో నెత్తురు, అయ్యో నెత్తురు" అనరచి తేలకండ్లేసి యదబడిపోయినాడు. వంకలో నీళ్ళు తెచ్చి మొకం మీద చల్లినాక జాంవు సేపటికి తెలివొచ్చింది. ఆ రాత్రి వీనికి సలిజరం వచ్చేసింది సాంవి. నిద్దర్లో గెడికొకసారి ఉలిక్కిపడిలేవటం, లేచినప్పుడంతా "నెత్తురు, నెత్తురు!" అని అరవటం అట్ట జేసినాడు సాంవి" అన్నాడు.

బైరాగి, "కుందేలు నెత్తురు జూస్తేనే ఇట్ల జేసినోడు రేపు మనిషి నెత్తురు చూస్తే ఇంగేవి జేసునో" అన్నాడు.

మన్నుగాడు చటుక్కున తల ఎత్తి బైరాగి కళ్ళలోకి సూటిగ చూసి, "రేపు అంటే?" అన్నాడు.

బైరాగి అతని చూపులను తప్పించుకుంటూ, అసహనంగా కదులుతూ, "మాట వరసకు అంటా ఉండానన్నా. కుందేలు నెత్తురు సూడగానే ఈ పిలగాడు ఇంత ఆగడం చేసినాడు. ఒక వేళ మనిషి నెత్తురు చూస్తే ఇంగెంత ఆగడం చేసునో అని ఆలోచిస్తా ఉండా" అన్నాడు.

మన్నుగాడు సమాధానం చెప్పడం గాని మరు ప్రశ్న వేయడం గాని చేయలేదు. అతడు తన చూపులను బైరాగి ముఖం మీద నుండి మెల్లగ కిందకు దించి తన ముందున్న ఇసుక రేణువులను చూడసాగాడు.

4

ఈ పూట తానొక కొత్త ప్రపంచంలోకి అడుగు పెడుతున్నట్లు బైరాగికి అనిపించసాగింది. అతడు ఇహలోకపు ఆలోచనలను మానివేసి ముప్పయి ఏండ్లయింది. భార్య, పిల్లలు, సంసారం, ఈతి బాధలు మొదలయిన వాటిని అధిగమించడానికి, మరచి పోవడానికి అతడు గత ముప్పయి ఏండ్లుగ ప్రయత్నిస్తూనే ఉన్నాడు. చెరువులో ఈదుతున్న బాతు నీటితడి తన రెక్కలకు అంటకుండా చూసుకుంటున్నట్లు భవబంధాలు తనను చుట్టుముట్టకుండా ఉండడానికి అతడు సాధన చేస్తూనే ఉన్నాడు. అతడు కొన్ని సంవత్సరాలు సాధువులతో తిరిగాడు. చాల సంవత్సరాలు ఆశ్రమాలలో నివశించాడు. సంవత్సరాల తరబడి ఆధ్యాత్మిక సాధన చేస్తూ దేశాటన చేస్తున్నాడు. తన ఆధ్యాత్మిక ప్రగతి ఒకప్పుడు పనిగట్టుకుని సమీక్షించుకోలేదు. కాని తన ఆధ్యాత్మిక ప్రగతి ఒకప్పుడు మహోన్నత శిఖరాలకు ఎదిగినట్టుగాను, మరొకప్పుడు అధఃపాతాళానికి దిగజారినట్టు గాను అతనికి అనిపిస్తూ వుంటుంది.

బైరాగి సిగర చెట్టు బోదెను అనుకుని కూర్చుని తన పరిసరాలను చూడసాగాడు. మన్నుగాడు చుట్టగా చుట్టిన వల మీద కూర్చుని ఇసుక రేణువులను తదేకంగా చూస్తున్నాడు. అతని వెనక రాజి నాలుక బయట పెట్టుకుని ఎండవేడిమికి వగర్చుతూ పడుకుని వుంది. దాని ముందరి కాళ్ళ వద్ద ఉడుత చచ్చిపడి ఉన్నది. చిన్నోడు అల్లంత దూరాన కూర్చుని సుదూరాన ఉన్న పర్వత పంక్తిని చూస్తున్నాడు.

తన ముందు కనిపిస్తున్న సజీవ, నిర్జీవ ప్రాణుల బైరాగి యాంత్రికంగా చూడడం లేదు. మన్నుగాడు చెప్పిన కథనానికి అతని మనసు స్పందిస్తున్నది. ప్రాపంచిక విషయాలపైన ఒక సాటి మానవుని వ్యక్తిగత విషయాలపైన ఇంతటి ఉత్సుకత అతనికి గత ముప్పై ఏండ్లలో ఎప్పుడూ కలగలేదు. ముప్పై ఏండ్ల క్రితం ఆరిపోయిన ఒకానొక ఆకలి తనలో మేలుకుంటున్నట్టుగా అతనికి అనిపిస్తున్నది. అతడు మన్నుగాని వైపు చూసి, "మాటా పలుకూ లేకుండా అట్టనే కూచుంటివేందన్నా" అన్నాడు.

మన్నుగాడు తలెత్తి "నువ్వామాట అనంగానే నాకు మాట పడిపోయినట్ట యిపోయింది సాంవి" అన్నాడు

బైరాగి, "ఏ మాట?" అన్నాడు.

మన్నుగాడు, "రేపు మనిషి నెత్తురు చూస్తే వీడు ఇంకెంత ఆగడం చేస్తాడో అంటివి గదా. ఆ మాట యినంగానే నా గుండికాయ ఆవులించి పోయింది సాంవి. నోట్లో తేమలేకుండా అయిపోయింది" అన్నాడు.

బైరాగి తేలికగా నవ్వి, "నేను ఊరికే మాటవరసకంటినన్నా. ఐనా వీడు ఎవుర్నన్నా ఖూనీ చేయబోతాడా? లేకపోతే ఎవురన్నా ఖూనీ చేస్తా ఉంటే చూడబోతాడా? అన్నాడు.

మన్నుగాడు, "కూనీల దాక ఎందుకు. ఈదిలో ఎవురాన్నా రంపులాడు కుంటా ఉంటే వీడు పరుగెత్తిపోయి ఇంట్లో దాక్కుంటాడు" అని ప్రారంభించి ఈ రోజు తెల్లవారు జామున సిపాయిల దండు మట్టి బాట వెంబడి సాగిపోవడము, దానిని చూసి చిన్నోడు భయపడి గుడిసెలో దాక్కుని బయటకు రావడానికి నిరాకరించడమూ వివరించి చెప్పసాగాడు.

ఇంత సేపు పర్వత పంక్తిని చూస్తూ ఉండిన చిన్నోడు సాంతం ఇటు తిరిగి కూర్చుని తన తండ్రిని, బైరాగిని చూడసాగాడు.

బైరాగి అంతా విని, "వాళ్ళను జూసి వీడు భయపడి దాక్కున్నాడా? ఇది ఎర్రిగాక పోతే ఇంకేంది" అన్నాడు.

మన్నుగాడు, "ఇంతకూ వాళ్ళెవరు సాంవి, నూరు మందికి పైగా ఉండి నారు. సోలుపులు సోలుపులుగా నడుచుకొంటూ పోయినారు. అంతమంది పోలీసోళ్ళను నేనెప్పుడూ సూడలా" అన్నాడు.

బైరాగి, "వాళ్ళు పోలీసోళ్ళు గాదు. మిలిట్రీ వాళ్ళు" అన్నాడు.

మన్నుగాడు, "మిలిట్రీ వాళ్ళా? మరి వాళ్ళు మా వూరి కెందుకొచ్చినట్టు?" అన్నాడు.

బైరాగి, "ఈ ఊరేగాదు, అట్ట కాట్పాడి నుండి ఇట్ల పీలేరు దాకా బాట పక్కన ఉండే ప్రతి ఊరికాడ మిలిట్రీ వాళ్ళుండారు. ఒక్కొక్క ఊరికాడ నూరు, ఇన్నూరు మందిదాక గుడారాలేసుకుని ఉండారు" అన్నాడు.

మన్నుగాడు, "వాళ్ళను ఎవరు పంపించినారో?" అన్నాడు.

బైరాగి, "గవుర్మెంటోడు పంపించినాడు. జపానోళ్ళు మన దేశం మీద యుద్ధం చేసేదానికి వస్తారంట. జపానోళ్ళు రాంగానే వాళ్ళతో భేటీ వేసేదానికి ఒక్కొక్క ఊరికి కొంత మంది సిపాయిల్ను పంపించినారు" అన్నాడు.

మన్నుగాడు, "వాళ్ళ దగ్గర తుపాకులు గూడా ఉండాయి సాంవి. ఒక్కొక్కడి భుజమ్మీద బారెడు పొడుగు తుపాకులుండాయి" అన్నాడు.

చిన్నోడు కూర్చునే మెల్లమెల్లగా జరుగుతూ తండ్రికీ, బైరాగికీ చేరువగా వచ్చాడు.

బైరాగి, "తుపాకులేననుకుంటివా, వాళ్ళ దగ్గర బాంబులు గూడా ఉండాయి. ఒక్క బాంబును గాని ఏస్తే ఆమడ దూరం లోపల ఉండే మనుషులు, గొడ్డూ, గోదా అంతా అతమై పోతారు" అన్నాడు.

చిన్నోడు మెల్లగ, "నాయనా" అన్నాడు.

మన్నుగాడు విసుగ్గా, "ఏందిరా?" అన్నాడు.

చిన్నోడు, 'నాయనా" అని కాసేపు నసిగి, "నాయనా మనం ఊరిడిసి పోదామే, నాకు బయంగా ఉంది" అన్నాడు.

మన్నుగాడు బైరాగివైపు చూసి, "ఇదీ సాంవి వీడి యవ్వారం. యుద్ధం జరగబోతుందని నువ్వు చెప్తివి గద. అది వీడి చెవుల్లో పడింది. అప్పుడే మొదలు పెట్టినాడు" అని కొడుకుని కసురుకుంటూ వాళ్లు సుక్క బెట్టినట్టు నీకోసమే వచ్చినారంట్రా? అంత మంది కట్టగట్టుకుని నీతో యుద్ధం వాడిదానికొచ్చినారని నీకు చెప్పిందెవుర్రా? అన్నాడు.

చిన్నోడు కళ్ళు పెద్దవి చేసుకుని, "వాళ్ళ దగ్గర తుపాకులుండాయి. ఒక గుండు కాలిస్తే చచ్చిపోతాం. తుపాకుల కొనాన బాకులు గూడా ఉండాయి. వాటితో పొడిస్తే పేగులు బయటకొచ్చేస్తాయి. మల్ల యట్ట?" అన్నాడు.

అలా అంటూ ఉండగా వాడి ముఖం మీది కండరాలు భయంతో కొంకర్లు పోసాగాయి. చూస్తుండగానే వాడు ఏడుపు లంకించుకున్నాడు.

మన్నుగాడు నిస్సహాయంగా చేతులు విదిలించి, "ఇంగ ఈ ఎర్రికి మందిచ్చేటోళ్ళెవరు? ఇంగ వీడిని సమాళించేదెవరు?" అని బైరాగి వైపు చూశాడు.

వాడిని సమాళించే బాధ్యత తన మీదున్నట్లు బైరాగి భావించాడు. ఏమి చెప్పి సముదాయించాలో, ఏ స్థాయిలో మాట్లాడి సముదాయించాలో, అతనికి పాలుపోలేదు.

అతడు చెట్టు బోదె నుండి కాస్త జరిగి, చిన్నోడి భుజంపైన చేయి వేసి, "నీ పేరెందయ్యా?" అనడిగాడు.

చిన్నోడు సమాధానం చెప్పకుండా అలాగే ఏడవ సాగాడు.

మన్నుగాడు, "వాడి పేరు చిన్నోడు సాంవి. నాకు నలుగురు కొడుకులు పుట్టిరి. వకరి వెనక వకరుగా ముగ్గురు కాలమైరి, ఈడు కాడావాడు. ఈ వొక్కడు మిగిల్నాడు" అన్నాడు.

బైరాగి, "చిన్నోడా, మనూరు ఒంటిల్లు గద. ఇట్టాటి ఊర్లు లచ్చాప లక్షలు కలిస్తే ఒక దేశమవుతుంది. ఇట్టాటి దేశాలు భూమ్మీద యాభై ఆరు దాకా ఉండాయి. అందులో జర్మనీ, జపాను, అమెరికా, ఇంగ్లండు అనే దేశాలు తిని ఉండబట్టలేక యుద్ధాలు జేసుకుండా ఉండాయి. వాళ్ళూ వాళ్ళూ కొట్టుకుంటూ ఉంటే నువ్వేడిసేదెందుకు?" అన్నాడు.

చిన్నోడు బెక్కుతూ, "మరి వాళ్ళు మనూరికెందుకొచ్చినారు?" అన్నాడు.

బైరాగి, "వాళ్ళు మనల్ను కాపాడేదానికొచ్చినారు. జపానోళ్ళు మన మీదకొస్తే వాళ్ళను మనూరు దగ్గరుండే సిపాయిలు తరిమి కొడతారు" అన్నాడు.

చిన్నోడు నీళ్ళు నిండిన కళ్ళతో, "నువ్వు చెప్పేది నిజమా?" అన్నట్టు బైరాగి వైపు చూశాడు.

బైరాగి "ఇది రాజాపరాజులు జరుపుతున్న యుద్ధం. మనం నాడోడి బతుకులోల్లం. మన జోలికీ, మన పెస్తావనకు ఎవరూ రారు. ఐనా ఈ ఊర్లో నువ్వొక్కడివే ఉండావాయట్ట? ఇంత ఊరుండగా నీ కొక్కడికే ఏం బయం? అందరూ అట్టుండనీ. మీ నాయన ఉండాడు గద, మీ నాయన ఉండగా నీకెందుకు బయం?" అన్నాడు.

చిన్నోడు ఆ చివరి వాక్యం విని గబుక్కు ఏడుపు మానేశాడు. ఏదో జ్ఞాపకం వచ్చినట్టు పండ్లికిలిస్తూ నవ్వి, "ఔ, మా నాయనుండగా నాకేం బయం. జపానోడు రానీ, ఇంగెపుడన్నా రానీ, నాకేం బయం లేదు" అని చెంపల మీద కన్నీళ్ళను తుడుచుకున్నాడు.

బైరాగి చిన్నోడిని నవ్వించగలిగినందుకు సంతోషిస్తూ, "అంతేగాదురా. నీకొక తాత గూడా ఉండాడు. నీకొక నాయన, ఒక తాత ఉండగా ఇక బయం దేనికీ?" అన్నాడు.

చిన్నోడు పండ్లికిలిస్తే ఆ ఇద్దర్ని మార్చి మార్చి చూసి, తండ్రికి చేరువగా జరిగి కూర్చున్నాడు.

మన్నుగాడు, "ఈ ఊర్లో ఎన్నాళ్ళుందాంవనుకుంటా ఉండావు సాంవి" అన్నాడు.

బైరాగి ఆకాశం వైపు రెండు చేతులు చూపించి, "అంతా వాడిదయ, ఈ ఊరి నీళ్ళు ఎన్నాళ్ళు తాగాలని రాసి ఉందో వాడికే తెలుసు. పొద్దు పోయే టప్పటికి జోలెనిండిన్నాళ్ళూ, పొద్దు పోయినాక ముడుక్కోవడానికి సత్రమో సావిడో దొరికి నన్నాళ్ళూ ఇదే నా వూరు" అన్నాడు.

మన్నుగాడు, "ఊరు పుంజిగా ఉండాది సాంవి. మూడు సంవత్సరాల్నుంచి ఆంజినేయుల్సాంవి ఊరును సల్లంగా చూస్తా ఉండాడు. ప్రతి సంవత్సరం చెరువులు నిండతా ఉండాయి. బావుల్లో నీళ్ళు జగ్గాటం లేదు. రొండు ఈదులు తిరిగితే జోలె నిండిపోతుంది సాంవి. ఇంగి పొద్దు పోయినాక ముడుక్కునేదానికి ఊరు మొగుదాల సత్రముండాది. సత్రం దాక ఎందుకు సాంవి, నువ్వు ఉండాలనుకుంటే మా గుడిసెలోనే ఉండొచ్చు. మేం వుండేది అబ్బా కొడుకులం ఇద్దరమే ఇంకెవురూ లేరు" అన్నాడు.

చిన్నోడు అలాగే పండ్లికిలిస్తూ బైరాగితో, "ఔ తాతా. గుడిసెలో ఓపినంత జాగా ఉండాది. పొద్దు పోయినాక నువ్వూ, మా నాయనా చెరొక పక్కన పడుకోండి. నేను మధ్యలో పడుకుంటాను" అన్నాడు.

బైరాగికి తన పూర్వజన్మ తాలూకు సంఘటనలేవో జ్ఞాపకానికొచ్చినట్ల నిపించసాగింది. గత ముప్పైఏండ్లుగా ఎవరు గాని అతనితో ఇలా మాట్లాడలేదు. అతడు ఆశ్రమాలలో గడిపిన రోజులలో అతని తోటి సాధు వులు తమతమ అన్వేషణలలో మునిగిపోయి, తమ సాటివారి ఉనికిని గుర్తించడం గాని, పట్టించుకోవడం గాని చేసేవారు కారు. ఒకరి సుఖదుఃఖాలను, కష్ట నష్టాలను మరొకరు పంచుకునేవారు కారు. భౌతికంగా వాళ్ళు ఒకరికొకరు ఎంత సమీపంగా ఉన్నప్పటికీ, మానసికంగా కొన్ని కాంతి సంవత్సరాల దూరాన ఉండేవారు. బైరాగి భిక్షాటన చేసేటప్పుడు ఇంటి ముందర నిలబడి, "భవతి భిక్షాం దేహి" అనేవాడు. ఇల్లాలు భిక్ష తెచ్చి అతని జోలెలో వేసి, వెనుదిరిగి అతని ముఖమైనా చూడకుండా లోపలకు వెళ్ళిపోయేది. గత ముప్పై ఏండ్లుగ రక్తమాంసాలు, రాగద్వేషాలు కలిగిన ఒక మనిషిగా అతనిని ఈ ప్రపంచం గుర్తించలేదు. అలా

గుర్తించబడాలన్న 'అహం' అతనిలో ఏ కోశానా లేదు. తన అస్తిత్వాన్ని పూర్తిగా నశింపజేసుకోవడానికే అతడు ఈ నాటికీ కృషి చేస్తున్నాడు.

చిన్నోడు తండ్రికి చేరువగా జరిగి తండ్రి మోచేతి కొక్కెంలో చేయి దూర్చి, "నాయనా, మనింట్లో ఉండమని తాతకు చెప్పే. నువ్వూ, తాతా ఉంటే మల్ల నాకేంవీ బయముండదు. మీరిద్దరూ వొళ్ళు మరిచి నిద్రపోయినా మన రాజి తెల్లవార్తు మేలుకునే ఉంటుంది" అన్నాడు.

బైరాగి, "రాజి ఎవరు?" అనడిగాడు.

మన్నుగాడు, "రాజి నా పెండ్లాం సాంవి. నలుగురు కొడుకుల్ను కని సచ్చిపోయింది. దాని పేరు ఈ కుక్కకు పెట్టినాను సాంవి. వీడిప్పుడు చెప్పేది కుక్కను గురించి," అన్నాడు.

బైరాగి, "నీ పెండ్లాం పోయి ఎన్నాళ్ళయింది?" అన్నాడు.

మన్నుగాడు, "ఈడు పుట్టినాక రెండు సంవత్సరాలకో, మూడు సంవత్స రాలకో పోయింది సాంవి. ఇరవై సంవత్సరాలయిందనుకో, అప్పట్నుంచి ఇంట్లో దీపం పెట్టే దిక్కు లేకుండా బతకతా ఉండా" అన్నాడు.

బైరాగికి ముప్పై ఏండ్ల క్రితం విన్న పాట తాలూకు రాగం గుర్తుకొచ్చి నట్లయింది. ఇల్లు – దీపం – ఇల్లాలు. ఈ మాటలు విని ఎన్నాళ్ళయింది! ఈ మాటలలో ఎంత తియ్యదనం ఉంది!

5

మన్నుగాడు, “ఏంది సాంవీ ఆలాసిస్తా ఉండావు?” అన్నాడు.

బైరాగి, “ఇరవై ఏండ్లుగ ఇంట్లో దీపం పెట్టే దిక్కు లేదంటివి. నీ కొడుక్కు పెళ్లీడు వచ్చింది. యాడన్నా పిల్లను జూసి పెండ్లి చేసెయ్యరాదా” అన్నాడు.

మన్నుగాడు విషాద పూరితమైన ఒక చిరునవ్వు నవ్వి, “వీడికి పిల్లనెవ రిస్తారు సాంవి. మేంవు యానాదోల్లం. మాకు కయ్యలు, కాలవలూ లేవు. తెంపు, తెగవ, ధైర్యంవు ఇవే మా ఆస్తిపాస్తులు. ఇవి వీడికి బొత్తిగా లేవు. ఇంగ వీడికి పిల్లనెవరిస్తారు” అన్నాడు.

బైరాగి, “కాలం మారతా ఉందిగదన్నా, యానాదోల్లు ఉడతల్ను పాములు పట్టే బతకాలని ఏముంది? సేద్దింపన్లు చేసుకోవచ్చు గదా. పిలగోనికి కాలు చెయ్యి సుద్దంగా ఉండాది. ఊర్లో కాపోల్ల దగ్గర జీతానికి పెట్టేస్తే వాని పొట్ట వాడు పోసుకుంటాడు గదన్నా” అన్నాడు.

మన్నుగాడు, “అట్టాడిది గూడా చేసిచూసినే సాంవి” అని నోరు చప్ప రించి, “లాబం లేదు సాంవి. నాగలి దున్నమంటే ఎద్దులు యనక్కాళ్ళతో తంతాయంటాడు, బండి తోలమంటే నొగ మీద కూసుంటే కండ్లు తిరిగి కింద పడిపోతానంటాడు. ఆకరుకు గొడ్ల కాసే పన్లో పెడ్తిని. దాంట్లో గూడా కుదురుకోలేదు సాంవి. ఆవుగొడ్డు తలకాయ యిదిలిస్తే చాలు, దాని కొమ్ముల్ను చూసి ఆమడ దూరం పరుగెడతాడు” అని మళ్ళీ నోరు చప్పరించి,

“పిల్లగోడిని చూస్తే కడుపు నిండిపోతుంది. కాని పిసరంత గుండికాయలేదు సాంవి” అన్నాడు.

ఏమి చెప్పాలో పాలుపోక బైరాగి మౌనంగా కూర్చున్నాడు.

సూర్యుడు ఆకాశాన నాలుగు బారలెక్కి మిడిమేలంగా ప్రకాశిస్తున్నాడు. గాలి ఉండుండి మెల్లగా వీస్తున్నది. నాగలి దున్నుతున్న రైతులు కొండ్ర కొండ్రకు నాగలిని ఆపి కాలువలో నీళ్ళు తాగుతున్నారు. వరి పైరును కోస్తున్న వాళ్ళు తమ నెత్తులను కొంగులతోను, తువ్వాళ్ళతోను కప్పుకుంటున్నారు. వాళ్ళ శరీరాలు చెమటలు క్రక్కుతున్నాయి. విసవిస వీస్తున్న గాలికి చెమట వెనువెంటనే ఆరిపోతున్నది. గాలి పాటుకు సిగర చెట్ల నుండి ఆకులు తొడిమలు వీడి చెట్టు కింద పడుతున్నాయి.

కుమ్మరి తాను తయారు చేసిన కుండను తృప్తిగా చూసుకున్నట్టు మన్ను గాడు తన కొడుకువైపు కాసేపు చూసి, “పిలగోనికి గుండికాయలేదుగాని కండబలం దండిగా ఉండాది సాంవి. నలుగురు మనుషులు కదిలించడానికి అలివి కాని గుండును వీడు అలగ్గా ఎత్తి అవతల పెట్టేస్తాడు. పారచేత బట్టినాడంటే ఇంగ పంది కూరాడినట్టే. పలుగు చేతికిచ్చినావంటే ఎంత మిట్టనయినా సరే కన్ను మూసి తెరిచేలోగ కొట్టి వంగదోసేస్తాడు’ అన్నాడు.

బైరాగి సాలోచనగా విని, “అట్లయితే ఈ పిలగోడ్ని రోడ్డు పనిలో పెట్టె య్యన్నా” అన్నాడు.

మన్నుగాడు, “ఏంవి రోడ్డు?” అన్నాడు.

బైరాగి, “కాట్పాడి నుండి పీలేరు దాకా రోడ్డేస్తా ఉండారన్నా. ఇప్పుడది బండిబాటగా ఉందిగదా. దాన్ని పక్కా రోడ్డుగా చేస్తా

ఉండారు. దానికి ఓపినంత మంది కూలోల్లు కావాలంట. ఈ పిలగాడు రోడ్డు పనికి సరీపోతాడు" అన్నాడు.

మన్నుగాడు, "రోడ్డు ఏయించేది ఎవరో?" అనడిగాడు.

బైరాగి, "గవుర్మెంటోడు ఏయిస్తా ఉండాడన్నా. చెన్నపట్నం కాడనుండి మొదలు పెట్టినారు. ఇప్పుడు కాట్పాడిదాక ఏసినారు. ఇంగ పీలేరు, కల్లూరు – ఇట్ల ఎంత దూరం ఏస్తారో ఏంవో. లక్షలు, కోట్లు ఖర్చు బెట్టి ఏయిస్తా ఉండారు" అన్నాడు.

మన్నుగాడు, "అంత కర్చుబెట్టి రోడ్డెయ్యించేది ఎందుకో" అన్నాడు.

బైరాగి, "పొద్దున సిపాయిలు నడిసిపోవడం చూస్తివిగదా. అట్టాటోల్లు ఇంగా లెక్కలేనంత మంది వస్తారంట. మిట్టలు పల్లాలు ఉంటే వాళ్ళు సరసరామని నడిచేదెట్ల? సిపాయిలే గాదు, లారీలు, ట్రక్కులు, జీపులు గూడా వస్తాయంట" అన్నాడు.

మన్నుగాడు, "ఔ, పొద్దున గూడ సిపాయిలు యనకాల రెండు పెద్ద మోటార్లు పోవడం చూసినా" అన్నాడు.

బైరాగి, "లారీలు, ట్రక్కులు, జీపులేగాదు, టాంకులనేటివి గూడా వస్తాయి. వాటికి రబ్బరు చక్రాలుండవు. ఇనప చక్రాలుంటాయి. ఆ చక్రాలు ఇనప గొలుసుల మీద నడుస్తాయి. ఇట్టాటివన్నీ నడవాలంటే పక్కా రోడ్డు లేకుంటే యట్ట?" అన్నాడు.

చిన్నోడు తండ్రిని, బైరాగిని మార్చి మార్చి చూస్తూ వాళ్ళ సంభాషణను జాగ్రత్తగ వినసాగాడు.

మన్నుగాడు, "మా వోడిని రోడ్డు పనిలో పెట్టేస్తే వీడు చేయాల్సింది ఏందో?" అనడిగాడు.

బైరాగి, "బెమ్మోళం ఏమీలేదు. పలుగుతో నేలను తవ్వటం. తవ్విన మట్టిని పారతో తట్టలో వేయటం. ఆ మట్టిని తీసకపోయి రోడ్డు మీద పోయటం. అంతే" అన్నాడు.

మన్నుగాడు, "అంతేనా" అని కొడుకు వైపు తిరిగి "రోడ్డు పనిలో చేర్తా వంట్రా?" అనడిగాడు.

చిన్నోడు. "పలుగుతో నేలను తవ్వటం, తవ్విన మట్టిని పారతో తట్టలో పోయటం, అద్దీసకపోయి రోడ్డుమీద పోయడం. అంతేగద. అట్టా పన్లు ఎడమ చేత్తో చేసేస్తా" అన్నాడు.

బైరాగి, "ఇంకేం తీరిపాయె. ఇంగ రెండో ఆలోచన చెయ్యకుండా పిలగోడ్ని రోడ్డు పనిలో పెట్టెయ్యన్నా. ఆ రోడ్డు పని యట్టలేదన్నా సంవత్సరం దాక జరుగుతుంది. వాని పొట్ట వాడు పోసుకునేదే గాక నిన్ను కూసోబెట్టి కూడు బెడతాడు" అన్నాడు.

మన్నుగాడు "దినకూలి ఎంతిస్తారు సాంవి? అన్నాడు". బైరాగి, "అది గవుర్మెంటోని పనిగదన్నా. గవుర్మెంటోడు కూలి దగ్గర చేతులు పిసుక్కోడు. దారాళంగా ఇస్తాడు. ఎట్టలేదన్నా దినానికి ఎనిమిదణాలకు తక్కువుండదు" అన్నాడు.

మన్నుగాడు కళ్ళు గిర్రున తిప్పి, "ఎనిమిదణాలు! ఒక్క రోజు కూలి ఎనిమిదణాలు! ఆ లెక్కన రోడ్డు పని అయిపోయేటప్పటికి మావోడు పాతి కోపరకో చేతబట్టుకోవచ్చునే" అన్నాడు.

బైరాగి, "పాతికో పరకో ఏందన్నా, ఇన్నూరో, మున్నూరో చేత బట్టు కోవచ్చు. నాలుగు రూకలు చేతిలో ఉంటే మీ వాడికి ఎవరో ఒకరు పిల్చి పిల్లనిస్తారు" అన్నాడు.

బైరాగి చెప్పిన చివరి మాట మన్నుగాని మనుసులో నమోదుకాలేదు. అతడు సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అవుతూ, "ఐతే మావోడిని రోడ్డు పనికి తీసుకుంటారంటావా సాఁవి?" అన్నాడు.

బైరాగి, "కండ్లకద్దుకుని తీసుకుంటారు. వాళ్ళకు కావలసింది బాగ జబ్బ పుష్టి ఉండే వాళ్ళే, ఇట్టాటోల్ల కోసం మేస్త్రీ వోడు ఊరూరా గాలిస్తా ఉండారు" అని కాసేపు ఆగి, "నిన్న పూతల పట్టు రైలుటేసనులో దిగినానన్న. రాత్రంతా ఆ ఊర్లోనే ఉంటిని. రోడ్డు పని చేసేదానికి కూలోల్లు కావాలన్జెప్పి వీధి వీధినా దండోరా వేయించినారు. కండపుష్టి, ఉడుకు నెత్తురు ఉండే వాళ్ళంతా మేస్త్రీ దగ్గర పేర్లు రాయించుకుంటా ఉండినారు" అన్నాడు.

మన్నుగాడు, "ఆ మేస్త్రీ మనూరుకు ఎప్పుడొస్తాడు సాఁమి" అని, "నిన్న రాత్రి పూతల పట్టులో ఉండినాడంటివి. ఈ పొద్దు మనూరికి వస్తాడంటావా?" అన్నాడు.

బైరాగి, "ఈపాటికి వొచ్చివాడేఁవో. నువు ఊర్లోకి పోయి నలగురితో మాట్లాడితే తెలుస్తుంది" అన్నాడు.

మన్నుగాడు, "గవుర్మెంటోళ్ళు ఎవరోచ్చినా ముందుగా మనేగానింటికే వస్తారు" అని సిగర చెట్టుకొమ్మల గుండా సూర్యుని వైపు చూసి, "పొద్దుగూడా నడిమింటికొస్తా ఉంది. నేను ఊర్లోకి పోయి కనుక్కుంటా సాఁవి." అంటూ పైకి లేచాడు.

6

మణియం గారిది మూడంతస్థుల భవంతి. భవంతి ముందర భాగాన వీధివైపున పొడగాటి వరండా ఉన్నది. వరండాలో ఒక చివరన ఒక టేబిలు దాని వెనక రెండు కుర్చీలు ఉన్నాయి. కుర్చీలలో మణియం, మేస్త్రీ కూర్చుని ఉన్నారు. వాళ్ళిద్దరు తమిళంలోను, తెలుగులోను మాట్లాడుకుంటున్నారు. అప్పుడ ప్పుడు టేబిలు మీదున్న రెండు పెద్ద రిజిస్టర్లను తిరగేస్తున్నారు. వారికి దాపున తలారివాడు చేతులు కట్టుకుని నిల్చుని ఉన్నాడు.

వరండా ముందర వీధిలో యాభై మందికి పైగా మగవాళ్ళు గుంపుగా నిలబడి ఉన్నారు. మన్నుగాడు, అతని వెనుక చిన్నోడు బెరుకు బెరుకుగా వీధి వెంబడి నడిచివచ్చి గుంపులో చేరారు.

మన్నుగాడు తన పక్కనున్న మనిషితో తగ్గుస్వరంలో "మేస్త్రీ వచ్చినాడా అన్నా" అనడిగాడు.

పక్కనున్న మనిషి, "వొచ్చినాడు. నొస్టిన విబూది రాసుకో నుండాడు జూడు. ఆయనే" అన్నాడు.

సూర్యుడు నడిమింటికొచ్చి ఉధృతంగా కాస్తున్నాడు.

వీధిలో నిలబడి ఉన్న వాళ్ళు తుండుగుడ్డలను నెత్తుల మీద కప్పుకున్నారు. వాళ్ళ వీపుల మీద, జబ్బుల మీద, రొమ్ముల మీద చెమట పట్టుతూ ఉంది. ఆ చెమట గాలికి కొంత ఆరిపోగా మిగిలింది ధారలుగా కిందకు జారుతున్నది. చెమట ఆరిన చోట వాళ్ళ శరీరాల మీద తెల్లగ ఉప్పు పొంగుతున్నది. వీధిలోని ఇసుక

వేడెక్కి ఉండడం వల్ల వాళ్ళ అసహనంగా అడుగులు మారు స్తున్నారు. వాళ్ళందరి చూపుల మణియం మీద, మేస్త్రీ మీద నిలిచి ఉన్నాయి.

మణయం, మేస్త్రీ తమలో తాము మాట్లాడుకోవడం ముగించి, తలారి వాడికి ఏదో చెప్పారు.

తలారివాడు వరండా అంచుదాక వచ్చి, గుంపు నుద్దేశించి గట్టిగా, "అందరూ వరుసగా నిలబడండయ్యా. గొర్రెల మంద మాదిరి నిలబడకండి. ఒకరి వెనక ఒకరు వరుసగా నిలబడండి" అన్నాడు.

గుంపు చెదిరిపోయి అందరూ ఒకరి వెనక ఒకరు చీమల బారులాగ నిలబడ్డారు. వరుసలో మొదట నిలబడి ఉన్న యువకుడిని మేస్త్రీ చేత్తో సైగ చేసి పిలిచాడు. యువకుడు వరండా మెట్లెక్కి మేస్త్రీ ముందర నిలబడ్డాడు. కొనుగోలుదారుడు పశువుల సంతలో పశువును పరిశీలిస్తున్నట్లు యువకుడిని మేస్త్రీ ఆపాదమస్తకం చూసి, తృప్తిగా తల ఆడించాడు. చేతిలోని కలం తీసుకుని, "పేర్‌సొల్లు తంబి" అన్నాడు.

యువకుడు గుడ్లప్పగించి చూస్తూ నిలబడ్డాడు.

మేస్త్రీ, "వీళ్ళకు తమిళం రాదు కాబోలు" అని మణియం వైపు తిరిగి "నువ్వు మాట్లాడు. వాళ్ళంతా నీకు తెలుసుగదా" అన్నాడు.

మణియం, "నేన్జెప్తాను రాసుకో మేస్త్రీ. వీడి పేరు వీరయ్య. ఆకుల వీరయ్య వయసు -మ్- ఇరవై ఐదు సంవత్సరాలు. తండ్రిపేరు ఆకుల కదిరప్ప" అని చెప్పాడు.

వివరాలను మేస్త్రీ రిజిస్టరులో టపటప రాసుకున్నాడు. పేరు

నమోదు చేయడం అయ్యాక ఆ యువకుడిని తలారి వాడు తీసుకెళ్ళి వరండా రెండవ చివరన కూర్చోబెట్టాడు.

ఇంతలో వరుసలో వున్న రెండో వ్యక్తి వరండా మెట్లెక్కి మేస్త్రీ వద్ద నిలబడ్డాడు. అతడు నడి వయసు దాటిన వాడు. సన్నగా పొడుగ్గా ఉన్నాడు. పక్కటెముకలు చర్మం కింద ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. నోటికడ్డంగా చేయి పెట్టుకుని దగ్గుతున్నాడు.

మేస్త్రీ అతనివైపు చూసి తల అడ్డంగా ఊపాడు. మణయం "యాడికొచ్చి నావురా నారిగా? రోడ్డు పనంటే ఏందనుకుంటివి? గొంతుదాక సద్దితాగి ఆటకమూలపడి నిద్రపోయేదనుకుంటివా? పలుగు పైకెత్తలేవు. ఒక వేళ పైకెత్తినా దాన్ని మీదేసుకుని కిందబడి పోతావు. నువ్వు పోవాల్సింది రోడ్డు పనికి కాదు. ధర్మాసుపత్రికి. నడు. నడు. ముందాపని చూడు" అన్నాడు.

నడివయస్కుడు తల దించుకుని, వరండా మెట్లు దిగి వెళ్ళిపోయాడు.

వరుసలో ఉన్నవాళ్లు ఒక్కొక్కరే వచ్చి మేస్త్రీ ముందర నిలబడుతున్నారు. వయసువల్లగాని, అనారోగ్యంవల్లగాని అనర్హులయిన వారిని మేస్త్రీ వెనక్కు పంపేస్తున్నాడు. అర్హులయిన వారి వివరాలను మేస్త్రీ రిజిస్టరులో నమోదు చేస్తున్నాడు. నమోదయిన వారు వరండాలో రెండవ చివరన ఒకరి పక్కన ఒకరు కూర్చుంటున్నారు.

చివరన చిన్నోడు వరండా మెట్లెక్కి మేస్త్రీ ముందర నిలబడ్డాడు. మేస్త్రీ వాడిని మెచ్చికోలు దృఃఖులతో చూసి, వచ్చీరాని తెలుగులో, "ఎవరీ పిలగోడు మునసబూ. ఇత్తుల్దీసిన పొట్టేలు మాదిరుండాడు. ఇట్టాటోళ్ళు ఊరికి నలుగురు దొరికితే చాలు. డెబ్భై పదకొండు రోడ్లు ఏయిద్దును. పేరు చెప్పు మునసబు అన్నాడు.

మణియం కాసేపు ఊరుకుని, "పిలగోడు ఇత్తుల్దీసిన పొట్టేలు మాదిరుం డాడు. అద్దెలస్తానే ఉంది. వాడెవడనుకున్నావు మేస్త్రీ. వాడు యానాదోడు. అద్దెలవదేవో నీకు" అన్నాడు.

మేస్త్రీ "యానాదోడైతే ఏంవంట?" అన్నాడు.

మణియం, "యానాదోళ్ళుండే యాట్టాటోళ్ళనుకున్నావు? కన్ను అట్టుండ గానే కంటిపాపను కత్తిరించేసేటోల్లు. దొంగతనాలు జేసి బతకమనే బ్రహ్మ దేవుడు వీళ్ళ నొస్టిన రాసినాడు. వీడిని ఇప్పుడు రోడ్డుపనికి తీసుకున్నావనుకో. ఇంగ నువ్వు రోడ్డుపని జరిగే తావున నలుగురు పోలీసోల్లను పెట్టు కోవాల్సిందే" అన్నాడు.

మేస్త్రీ చిన్నోడిని యగాదిగా చూసి "మొకం చూస్తే ఎర్రిబోగలోడు మాది రుండాడే. దొంగతనాల్జేసేటోడు మాదిరి అనిపించటం లేదే" అన్నాడు.

మణయం. "వాడు అట్టనే అగుపిస్తాడు. యానాదోల్లంతా అట్టనే అగు పిస్తారు. నోట్లోఏలు పెట్తే కొరికే దానిగ్గూడ తెలవనట్టుంటారు. చేసే పనులన్నీ దేవాంతకప్పనులే. నువ్వు కొంచెం యామారినావంటే నీ భుజం మీద తుండు గుడ్డ మాయమైపోతుంది. నీ వేలి కుండే ఉంగరం మాయమైపోతుంది. వీళ్ళకీ విద్యలన్నీ పుట్టుకతోనే వస్తాయి. ఈ మాట గెజిట్‌లోనే రాసుండాది" అన్నాడు.

మేస్త్రీ, "ఏ గెజిట్‌లో" అన్నాడు.

మణియం, "జిల్లాగెజిట్‌లో, దొంగతనాల్జేసి బతకడమే వీళ్ళ కులవృత్తని చెప్పి జిల్లా గెజిట్‌లో ఉండాది. నువ్వు సూడలేదేమో" అన్నాడు.

మేస్త్రీ కలం కింద పెట్టి, కణతలు నొక్కుకుంటూ కాసేపు ఆలోచించి, "వీడు దొంగయితే మనకేంవి? దొరతై మనకేంవి ముననబూ. పన్జేసే సత్తా ఉండేవాడు గదా మనకు కావల్సింది. ఒకవేళ వీడేదైనా అడ్డం దొడ్డం పన్లు చేసినాడంటే అప్పుడు చూసుకుందాం. నువ్వ వివరాలు చెప్పు" అన్నాడు.

మణియం, "నీ యిష్టం, రాసుకో, పేరు యానాది చిన్నోడు, వయసు ఇరవై రెండని రాయి. తండ్రి పేరు యానాది మన్నుగాడు" అన్నాడు.

మేస్త్రీ రాయడం ముగించి తలారి వానితో, "ఇంకా ఎవరైనా ఉండార టయ్యా. ఎవరన్నా వస్తా ఉండారేమో చూడు" అన్నాడు.

తలారి వాడు వీధిలోకి దిగి అటూ, ఇటూ చూసి తిరిగి వచ్చి, "ఎవరూ లేదు దొర" అన్నాడు.

మేస్త్రీ, మణియం ఇద్దరు రిజిష్టరులోని పేర్లను చూస్తూ కాసేపు తమలో తామే చర్చించుకున్నారు. తరువాత మేస్త్రీ లేచి వరండాలో రెండవ చివరన గుంపుగా కూర్చుని ఉన్నవారి చెంతకు నడిచి, అందర్నీ ఉద్దేశించి, సగం తెలుగులో సగం తమిళంలో, "అందరూ వినండయ్యా. మొత్తం ముప్పై నాలుగు మందిని రోడ్డు పనికి తీసుకున్నాం. ఒక్కొక్కరి పేరు చదువుతాను. పేరు చదివినప్పుడు లేచి నిలబడండి" అని రిజిస్టరులోకి చూస్తూ చదవసాగాడు. "ఆకుల వీరయ్య, తండ్రి ఆకుల కదిరప్ప, గందం బాలిగాడు, తండ్రి గందం నర్సిమ్ములు, ... యానాది చిన్నోడు, తండ్రి యానాది మన్నుగాడు".

ఒక్కొక్కరుగా అందరూ లేచి నిలబడి చేతులు కట్టుకుని మేస్త్రీ వైపే చూడసాగారు. మేస్త్రీ రిజిస్టరును మడిచి చంకలో పెట్టుకుని,

"రోడ్డు పని రేపు లేదు ఎల్లుండి మొదలవుతుంది. ఈ పొద్దు ఏఁవిదినం?" అనడిగాడు.

గుంపులో ఒకడు, "ఈ పొద్దు బుధవారం దొర" అన్నాడు.

మేస్త్రీ, "ఆఁ. ఈ పొద్దు బుధవారం. శుక్రవారం మీరంతా పనిలో చేరాల. శుక్రవారం ఉదయం ఏడుగంటలకు మీరంతా ఇక్కడ హాజరు కావాల. ఏడుగంటలంటే ఎంత పొద్దు?" అని బడిపంతులు లాగ అడిగాడు.

గుంపులో ఒకడు, "ఏడు గంటలంటే రెండు బార్ల పొద్దు దొర" అన్నాడు.

మేస్త్రీ "ఆఁ. రొండు బారల పొద్దుకు మీరంతా సద్దుల్దాగేసి ఈడ రడీగా ఉండాల. సరిగ్గా ఏడు గంటలకు లారీ వచ్చి మిమ్మల్నందర్నీ రోడ్డుకాడికి తీసకపోతుంది. తొమ్మిది గంటలకు మీరు పనిలోకి వంగాల. పన్నెండు గంటలదాక పని. పన్నెండు నుంచి రెండు గంటల దాక రెస్టు" అన్నాడు.

"రెస్టు అంటే ఏంది దొర" అనడిగాడు గుంపులో ఒకడు.

మేస్త్రీ. "రెస్టు అంటే పని ఆపేసి సంగటి తిని, చెట్టు కింద కాసేపు నడుం వాల్చడం. అర్థమయిందా?" అన్నాడు.

"అర్థమయింది దొర" అన్నారు గుంపులో వాళ్లు.

మేస్త్రీ "మల్లా రెండు గంటల్నుంచి ఐదు గంటల దాక పని ఉంటుంది. అదయినాక మిమ్మల్నందర్నీ లారీలో తీసుకొచ్చి ఊర్లో వొదిలేస్తాం" అన్నాడు.

గుంపులో ఒకడు, "మద్యానం సంగటికత చెప్పలేదు దొర. మీరు పెడ్తారా? మేఁవు తెచ్చుకోవాల్నా?" అన్నాడు.

మేస్త్రీ, "అది మీరే తెచ్చుకోవాల. సంగటి తెచ్చుకుంటారో, కూడు తెచ్చు కుంటారో, అంబలి తెచ్చుకుంటారో అది మీ ఇష్టం. కూలి మాత్రం దినానికి ఎనిమిదణాలిస్తాం" అన్నాడు.

గుంపులోని వాళ్ళంతా మౌనంగా నిల్చున్నారు. మేస్త్రీ, "కూలి రేటు నిర్ణ యించేది నేను గాదు. అది గవుర్మెంటోడు ఏర్పాటు చేసింది. కూలి తక్కువని ఎవరికన్నా అనిపిస్తే ఇప్పుడే చెప్పండి" అన్నాడు.

మణియం కల్పించుకుని, "ఊర్లో వీళ్ళు రోజంతా గోజారితే నాలుగణాలు గిట్టదు. దినానికి ఎనిమిదణాలు దొరకతాయంటే ఇష్టం లేకపోయేదేంది" అన్నాడు. మణియం చెప్పింది నిజమని తెలియజేస్తూ గుంపులోని వాళ్ళంతా పండ్లు బయటపెట్టి తలలు ఆడించారు.

మేస్త్రీ, "అంతేగాదు, వరుసగా రెండు నెలలు అంటే అరవై దినాలు పనిచేసి నోళ్ళకు కొన్ని ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తాం" అన్నాడు.

గుంపులో ఒకడు "ఏవిటోవో అవి?" అన్నాడు

మేస్త్రీ, "మీకు రోగాలు, రొచ్చులు వస్తే ఫీజులేకుండా డాక్టర్ల చేత పరీక్షలు చేయిస్తాం. ఉచితంగా మందులిప్పిస్తాం. పెండ్లిండ్లకు, దేవరలకు అవసరమై నప్పుడు పదో, పరకో అడ్వాన్సు యిప్పిస్తాం" అన్నాడు.

గుంపులో జనం తమకు పట్టబోయే అదృష్టాలను నమ్మలేనట్టు నోరు వెళ్ళబెట్టుకుని చూడసాగారు. అలా కొంత సేపు చూసి గుంపులో ఒకడు, "రోడ్డు కాడ మేఁవు ఏఁవేఁవి పన్లు చేయాల దొరా?" అన్నాడు.

మేస్త్రీ, "చెప్తా. అన్నీ మీకు చేతనయ్యే పనులే. మీకు తలకు మించిన పనులేవీ లేవు. చెట్లు, పుట్టలు కొట్టడం, మిట్టలను సదరం చేయడం, పల్లాలను పూడ్చడం – ఇట్లాంటి పన్లే మీరు చెయ్యాల్సింది" అన్నాడు.

గుంపులో ఒకడు, "ఇవన్నీ మాకు కొట్టిన పిండి దొర. ఈ పన్లన్నీ మేఁవు మా పుటకల్నుంచి చేస్తానే ఉండాం" అన్నాడు.

మేస్త్రీ, "నాకు దెల్సు, ఈ పనులన్నీ మీరు ఎడమ చేత్తో చేసుకొచ్చేస్తారని నాకు తెల్సు. ఐదే ఈ పన్లు మీరు ఊర్లో చేసేదానికి, రోడ్డు కాడ చేసేదానికి శాన తేడా ఉండాది. సూపరైజరు తనికీ చేసేదానికి అప్పుడప్పుడు వస్తా ఉంటాడు. సూపరైజరు ఎవరనుకున్నారు? ఇంగ్లీషోడు. చేసేపనిలో సుద్దీ బుద్దీ లేకుంటే ఇంగ్లీషోడు వొప్పడు. పనిటైంలో బీడీలో కాల్చేదీ, కల్లుదాగేది, గంటకాక ముందే చేతులు కడుక్కునేది, పని ఎగ్గొట్టేది, పని ఎగ్గొట్టమని పక్కనోడిని ఎగదోలేదీ ఇట్లాంటి పన్లు చేసినోడిని ఇంగ్లీషోడు ఆడికాడనే నిలబెట్టి డిస్మిస్ చేసేస్తాడు. ఇంగ రోడ్డు పని జరిగే తావున దొంగ తనాలేఁవన్నా చేసినారంటే సూపరైజరు నేరుగ తీసుకపోయి పోలీసు స్టేషన్లో అప్పగించేస్తాడు" అన్నాడు.

మణియం అందుకని, "ఒకే యానాదోడా! ఇంటావుండావా? ఊర్లో చేసినట్టే ఆడగూడ దొంగతనాలు చేసినావంటే మల్ల నిన్ను దేవుడుగూడా కాపాడలేడు. గెవనం పెట్టుకో" అన్నాడు.

చిన్నోడు మణియం వైపు, తన పక్కనున్న వాళ్ళవైపు చూసి అర్థరహితంగా పండ్లికిలించాడు.

మేస్త్రీ తన చంకలోని రిజిస్టరును తీసి టేబిలు పైన వేసి, "నేను చెప్పిందంతా విన్నారు గదా. ఆ కండిషన్ల ప్రకారం పని చేయడం మీకంతా సమ్మతమేనా?" అన్నాడు.

గుంపులోని వారంతా ఏకగ్రీవంగా, "సమ్మతమేదొరా" అన్నారు.

మేస్త్రీ రిజిస్టరులోని పేజీలు తెరచి, "ఐతే ఒక్కొక్కరే వచ్చి ఈడ ఏలి ముద్దర్లు ఎయ్యండి" అన్నాడు.

వాళ్ళు ఒక్కరొక్కరే వచ్చి, తమ బొటనవేలికి మేస్త్రీ సిరాపూయగా, తమ పేర్లకెదురుగా వ్రేలి ముద్రలు వేశారు. వ్రేలి ముద్రలు వేయడం అయ్యాక మేస్త్రీ, "ఇక వెళ్ళండి. శుక్రవారం ఏడుగంటలకు ఇక్కడ రడీగా ఉండండి" అన్నాడు.

7

"అద్దో, ఆడకనబడతా ఉండాదే అదే సాఁవి మా గుడిసె" అన్నాడు మన్నుగాడు. చేయిఎత్తి చూపుతూ.

బైరాగి కండ్లు చిట్లించుకుని చూశాడు. అల్లంత దూరాన ఒక గుడిసె ఒంటరిగా, దీనంగా నిలబడి ఉంది. దాని కప్పు ఒక చోట తాటి ఆకులతోను, మరొక చోట బొదగడ్డితోను, ఇంకొక చోట ఆరిక గడ్డితోను నేయబడి ఉన్నది. ఒకటి రెండు చోట్ల కప్పు పూర్తిగ ఎగిరిపోయి ఉన్నది. వెదుర్లు ఆస్తి పంజరం తాలూకు పక్కటెముకలలాగ కనిపిస్తున్నాయి. గుడిసె ముందర ఒక చింత మాను ఉన్నది.

వాళ్ళిద్దరు ఒక సన్నని కాలిబాట వెంబడి నడుస్తున్నారు. వారి వెనుక రాజి గునగున నడుస్తున్నది. అందరి కన్న వెనక చిన్నోడు తల వంచుకుని నడుస్తున్నాడు.

దారికిరువైపుల ముళ్ళ తుప్పలున్నాయి. సూర్యుడు పడమరకు వాలి ఉండడం వల్ల వాళ్ళ నీడలు తూర్పు వైపున ముళ్ళ తుప్పల మీద సాగుతున్నాయి. మన్నుగాడు గుడిసె ద్వారాని కడ్డంగా ఉన్న వెదురు తడకను తొలగించాడు. రాజి బాటపైన సాగుతున్న ఒక లారీని చూసి మొరుగుతూ బయటే నిలబడింది. వాళ్ళు ముగ్గురు గుడిసెలోపలకు ప్రవేశించారు. తానొక విచిత్రమైన ప్రపంచంలోకి అడుగు పెట్టినట్టు బైరాగికి అనిపించసాగింది. గత ముప్పై సంవత్సరాలుగ ఏ గృహస్థుడూ తన ఇంటిలోకి బైరాగిని ఆహ్వానించలేదు. అతని జీవితమంతా సత్రాలలోను, వీధి అరుగుల మీదను, దేవాలయ ప్రాంగణాలలోను, బాట పక్కన చెట్ల నీడలలోను గడిచింది. ఇప్పుడు తాను ప్రవేశించింది రాజప్రాసాదం కాదు. ఇప్పుడు తాను దాటింది బంగారు వాకిలికాదు. తనను ఆహ్వానించింది పాశెగాడు కాదు. తాను ప్రవేశించింది సగం కప్పు ఎగిరిపోయిన పూరిగుడిసె. గుడిసె ద్వారానికడ్డంగా ఉన్నది వెదురు బద్దల తడికె. తనను ఆహ్వానించింది అర్ధనగ్నంగానూ, అర్ధాకలితోను ఉన్న ఒక మానవుడు. ఈ మానవుడు ఎండలో ఉండిన తనను నీడలోకి రమ్మని పిలిచాడు. దారిన పోతున్న తనను ఇంటిలోకి ఆహ్వానించాడు. ఇల్లు – వాకిలి – ఆహ్వానం – ఆతిథ్యం తానీ అనుభూతులను మరిచిపోయి ఎన్ని సంవత్సరాలయింది!

ఎండి బీటలు వారిన సరస్సు సెలేరు మాలన నిండుతున్నట్లు అతని మనస్సు ఆర్ద్రత చెందసాగింది.

మన్నుగాడు గుడిసెనంతటినీ కలయజూపుతూ, “మనం నలగురికీ కావలసి నంత జాగా ఉంది సాంవి. నీ కిష్టమొచ్చినన్నాళ్ళుఈడ ఉండొచ్చు” అని బైరాగి చేతిలోని తంబురను తీసి గోడకు ఆనించి, జోలెను తీసి గోడకు

తగిలించాడు.

బైరాగి చుట్టూ కలియజూశాడు. ఒక మూలన పెద్ద కడవ దాని పక్కన ఒక ముంత కనిపించాయి. అతడు ముంతతో నీళ్ళు ముంచుకుని గడగడ తాగాడు.

ముంతను కిందబెట్టి, “ఈదుల్దిరిగీ తిరిగీ కాళ్ళు సచ్చకపోయినాయన్నా. కాసేపు ఆ చెట్టు కింద నడుం వాలస్తా” అని బయటకు నడిచాడు. మన్నుగాడు ఈత చాపను తెచ్చి చింత చెట్టుకింద పరచి. “ఈడ పడుకోసావి. చెట్టుగాలి సల్లగా ఉంటుంది” అన్నాడు.

చిన్నోడు పరుగున వెళ్ళి రెండు ఇటుక రాళ్ళను తెచ్చి. “వీటిని తలకింద పెట్టుకో తాతా” అన్నాడు.

బైరాగి చెట్టుకింద పడుకుని గుడిసెవైపు చూశాడు. కప్పు కొన్ని చోట్ల ఎగిరిపోయి ఉండడం వల్లను, తడక తీసివేసి ఉండడం వల్లను గుడిసెలో కావలసినంత వెలుతురు ఉంది. రెండు వలలు గోడకు వ్రేలాడుతున్నాయి. ఒకటి పెద్ద కళ్ళుగలది, మరొకటి చిన్న కళ్ళుగలది. వలలకు ఒక వైపున ఒక పంగల కర్ర వ్రేలాడుతూ ఉంది. మరోవైపున పదునైన మొనలు గల రెండు ఈటెలు గోడకు ఆనించి ఉన్నాయి. ఈటెలు పక్కన తంబుర ఉన్నది.

వేట సాధనాల పక్కన ఉన్న తంబురను బైరాగి కన్నార్పకుండా కాసేపు చూశాడు. తనకు కనిపిస్తున్న దృశ్యంలోని వైరుధ్యాన్ని గురించి, సారూప్యాన్ని గురించి అతడు ఆలోచించసాగాడు. అలా ఆలోచిస్తుండగా అతని పెదవుల చివరన చిరునవ్వు మెరిసింది.

మన్నుగాడు అతని సమీపాన కూర్చుని, “ఏంది సాంవి లోపల్లోపలే నవ్వుతా ఉండావు?” అన్నాడు.

బైరాగి గుడిసె లోపలకు చూస్తూ, "ఏంవీ లేదన్నా బరిసెల పక్కన తంబూర ఉండటం చూస్తా ఉంటే నవ్వొచ్చింది" అన్నాడు.

మన్నుగాడు గూడా ఒకసారి గుడిసెలోకి చూసి, "దాంట్లో యిచిత్రం ఏముంది సాంవి. నువ్వు తాంబుర పట్టుకుని తిరిగినా, నేను బరిసె పట్టుకుని తిరిగినా పొట్టకూటికే గద. తేడా ఏముండాది సాంవి" అన్నాడు.

బైరాగి కాసేపు మౌనంగా ఉండి, సాలోచనగా తల ఆడించి, "ఔనన్నా, తేడా ఏమీలేదు. తేడా ఏదో ఉందని ఈ పొద్దిటి దాక అనుకుంటా ఉంటి. ఏమీ లేదని ఇప్పుడే అనిపిస్తా ఉంది" అన్నాడు. తన మాటలకు బైరాగి తానే ఆశ్చర్యపోయాడు. తాను అసంకల్పితంగా మాట్లాడుతున్నట్టు గూడా క్షణకాలం అతనికి అనిపించింది. గత ముప్పై ఏండ్లుగ తాను సాధిస్తున్న ఆధ్యాత్మిక ప్రగతి ఏమైపోతున్నది? ఉదయపు టెండ మూలాన మంచుబిందువులు మాయమైనట్లు, సాటిమానవుని సుఖ దుఃఖాలను, కష్టనష్టాలను పంచు కోవడంలో ఉండే అనుభూతి మూలాన తన ఆధ్యాత్మిక ప్రగతి తరిగి పోతున్నదా?

బైరాగి వెల్లకిల పడుకుని దీర్ఘంగా నిట్టూర్చి, "ముప్పై ఏండ్లుగా దేశాలు చూస్తా ఉండాన్నా. చూడని ఊరు లేదు. తిరగని వీధిలేదు. ఐతే గడపదాటి ఒకరింట్లో అడుగు పెట్టింది లేదన్నా. గడపకివతల నిలబెట్టి దోసిలో పట్టమని నీళ్ళు పోసినోళ్ళేగాని, లోపలకు పిలిచి వాళ్ళ కుండల్లో నీళ్ళు తాగనిచ్చినోళ్ళు లేరన్నా. వీధి అరుగు మీద పడుకుంటే లేవగొట్టిన వాళ్లేగాని చాపవేసి పడుకోమన్న వాళ్ళు లేరన్నా" అన్నాడు.

మన్నుగాడు, "మనవి నాడోడి బతుకులు సాంవి. నువ్వు ఊరిడిసి, ఇల్లిడిసి నాడోడి బతుకు బతకతా ఉండావు. నాకొక

ఊరుంది. ఒక గుడిసె ఉంది. నేను గూడా నాడోడి బతుకే బతకతా ఉండాను సాంవి" అన్నాడు.

బైరాగి "నిన్ను నాతో పోల్చుకుంటే యట్టన్నా? చస్తే గుంతమీద మన్నేసి తలకొరివి పెట్టే కొడుకుండాడు నీకు. నువ్వు నాడోడి యట్టయితివి?" అన్నాడు.

మన్నుగాడు "అదొక భాగ్యమా సాంవీ. సచ్చినాక గుంత మీద మన్ను ఏస్తే ఎంత? ఎయ్యకపోతే ఎంత? తలకొరివి పెట్టితే ఎంత? పెట్టకపోతే ఎంత?" అని బైరాగి ముఖంలోకి సూటిగా చూస్తూ ... "నీకు వయసు ఉడిగిపోయింది. ఇంగ దేశాల్దిరిగేదంవిటికి సాంవీ. మాతోనే ఉండిపో సాంవీ" అన్నాడు.

బైరాగి బలహీనంగా నవ్వి, "ఎందుకు? నేను చస్తే నా గుంత మీద నీ కొడుకు చేత మన్ను ఎయ్యించి, తల కొరివి పెట్టిస్తావా యట్ట" అన్నాడు.

మన్నుగాడు, "మన తలరాతలు ఎట్టుండాయో ఏమో. మన గుంతల మీద వాడు మన్నుపోస్తాడో, వానిగుంత మీద మనం మన్నుపోస్తామో. ఎవుడు చూసినాడు?" అన్నాడు.

చిన్నోడు కల్పించుకుని, "ఇంగ మాతోనే ఉండిపో తాతా. గుడిసెలో నీకు మానాయనకు, రాజికి, నాకు – నలుగురికి సరిపోయేంత జాగా ఉంది" అన్నాడు.

బైరాగి చిన్నోడు వైపు తలతిప్పి చూశాడు. చిన్నోడు తనిందాక అన్న మాటలను మౌనంగా ఉచ్చరిస్తున్నట్టు పెదవులను, నాలుకను ఆడిస్తూ, పండ్లికిలిస్తున్నాడు. అతని పక్కన ఉన్న రాజి ఇందాక బయట వ్రేలాడవేసుకుని ఉండిన నాలుకను లోపలకు లాక్కుని

బైరాగి కళ్ళలోకి చూడసాగింది. మన్నుగాడు పుల్లతో నేల మీద గీస్తుండిన గీతను మధ్యలో ఆపేసి బైరాగినే చూడసాగాడు.

చాపమీద పడుకుని ఉండిన బైరాగి కీళ్ళు పటపటమని చప్పుడు చేస్తుం డగా లేచి కూర్చున్నాడు. కాస్త వెనక్కు జరిగి చింత చెట్టు బోదెకు ఆనుకున్నాడు. ముఖం పైకెత్తి దిగంతాల వైపు చూస్తూ, "జరిగేవన్నీ ఆ భగవంతుని చిత్తం ప్రకారం జరుగుతాయన్నా. నువ్వూ, నేనూ అనుకున్నట్టు జరుగుతాయా? ఇన్నాళ్లు పూటకొక పంచన బతికినాను. ఇక మీద ఒకే పంచన గడపాలనేది వాడి చిత్తమైతే ఆట్లనే జరుగుతుంది" అన్నాడు.

మన్నుగాడు నొచ్చుకుంటున్నట్లు, "మా పంచనజేరి నువ్వు తినేది మాత్రం ఏముంది సాఁవి. మాకు రొక్కరోజనాలు లేవు. ఉన్నది గెంజో, గెసో కలిసి తలా అంత తాగుదాం. మనిషిని మనిషి గాకపోతే ఇంకెవరు ఆదుకుంటారు సాఁవి. రాళ్ళూ, రప్పలూ ఆదుకుంటాయా? నువ్వు పొద్దున పోవిడి చెప్పబట్టి ఈ పిలగోడికి బతికే దోవ దొరికింది. నా నెత్తి బరువు దించినావు సాఁవి" అన్నాడు.

8

బైరాగి ఏదో జ్ఞాపక మొచ్చినట్లు, "ఔ. అడగడమే మరిచిపోయినా. మీరు ఊర్లోకి పోయిన పనేఁవయిందన్నా" అన్నాడు.

మన్నుగాడు, "పండే అయింది సాఁవి. మన పిలగోడిని రోడ్డు పనికి తీసుకున్నారు" అన్నాడు.

బైరాగి, "కండ్లకద్దుకుని తీసుకుంటారని నేను చెప్పలా, రోడ్డుపనికి వీడు అచ్చుగుద్దినట్టు సరిపోతాడు" అన్నాడు.

మన్నుగాడు, "పిలగోడ్ని చూసి మేస్త్రీ ఏఁవన్నాడనుకుంటివి? ఇట్టాటోళ్ళు ఊరిగి నలుగురు దొరికితే డెబ్భై పదకొండు రోడ్డు ఏద్దును అన్నాడు. దిన కూలి ఎనిమిదణాలు సాఁవి" అన్నాడు!

బైరాగి, "ఇంకేఁవన్నా. నువ్వు ఇనప్పెట్టి తయారు చేయిం చాల్సిందే. దినానికి ఎనిమిదణాలంటివి. రోడ్డు పని యట్టలేదన్నా సంవత్సరం దాక ఉంటుంది. సంవత్సరమయ్యేటప్పటికి నీకు మానావరి దుడ్డుచేతికొస్తుంది" అన్నాడు.

మన్నుగాడు, "ఎంతొచ్చును సాఁవి. దేవుడు సల్లంగ జూసి పిలగోడు సంవత్సరం దాకా పన్జేసినాడనుకో. ఎంత దుడ్డు చేతికొచ్చును. లెక్కేసిచెప్పు సాఁవి" అన్నాడు.

బైరాగి కాసేపు మనోగణితం వేసి, "దినానికి ఎనిమిదణాల లెక్కన నెలకు పదైదు రూపాయలు. సంవత్సరానికి నూట యనభై రూపాయలు. కర్చులు అవీ పోగా నూట యాభై రూపాయలు మిగుల్తాయి. ఆ దుడ్డు చేతిలో పెట్టుకుని నువ్వు పాళెగాడు మాదిర బతకొచ్చునన్నా" అన్నాడు.

బైరాగి చెప్పింది విని మన్నుగాడు రెండు చేతులను జుట్టులోకి జొనిపి గీరుకోసాగాడు. తనకు అర్థం కాని భాషను వింటున్నట్టు, తనకు ఏ మాత్రం పరిచయం లేని దృశ్యాలను చూస్తున్నట్లు అతనికి అనిపించింది. నూట యాభై రూపాయలంటే ఏమిటి? రెండు పుట్ల వడ్లంటే అతనికి తెలుసు. నాలుగు మానికల రాగులంటే అతనికి తెలుసు. తవ్వెడు మంచి నూనె అతనికి తెలుసు. కాని నూటయాభై రూపాయలంటే ఏమిటి? అతడు తలను గీరుకుంటూ నేల చూపులు చూడసాగాడు.

బైరాగి చిన్నోడిని చూస్తూ, "చిన్నోడా నూట యాభై రూపాయలు కూడబెట్టి ఏంవిజేద్దాంవనుండావురా?" అనడిగాడు.

చిన్నోడు కంటికి తగలబోయే పుల్లను తప్పించుకుంటున్నట్టు తల వెనక్కు జరిపి, "ఆఁ? ఏంవి జేస్తావా? అంతా మా నాయనకిస్తాను" అని తండ్రి వైపు చూసి, "నువ్వు చెప్పు నాయనా. తాత ఏందో అడగతా ఉండాడు. నువ్వు చెప్పునాయనా" అన్నాడు.

మన్నుగాడు తలెత్తి, "నాకేంవి దెల్చు సాఁవి. ఐదు రూపాయల నోటు ఎట్టుంటుందో కండ్ల జూసినోడ్నికాను. నూటయాభై రూపాయలంటే ఏందో! ఏంవో! అంత దుడ్డు చేతికొస్తే దాంతో ఏంవి జేసుకోవాల్నో నువ్వే చెప్పుసాఁవి" అన్నాడు.

బైరాగి తన బవిరి గడ్డాన్ని నిమురుకుంటూ, "ఒక పన్జెయ్యి. ఆ దుడ్డు పెట్టి పిలగోని పేరుతో అత నేల చెక్కకొనుక్కో. ఈ పాయకట్టులో నేల దరలు యట్టుండాయే నాకు తెలవదు. కనుక్కుందాం. నూటయాభై రూపాయలు పెట్తే యట్టలేదన్నా మూడెకరాలనేల కొనుక్కోవచ్చు. మెట్టనేలయితే ఐదెకరాలదాక వస్తుంది"

మన్నుగాడు అడ్డువస్తూ, "అదేదో సామెత చెప్పినట్టుంది సాఁవి నువ్వు చెప్పాటం. సేద్దిం పన్లు వీడికి చేతనయితే ఈ కష్టాలే లేకపోవునుగదా. వీడిని కాపోళ్ళ దగ్గర జీతానికి పెట్టేసి చీకూ, చింతా లేకుండా బతుకుదును గదా" అన్నాడు.

బైరాగి, "నేన్జెప్పేది విను. నేన్జెప్పేది పూరాగా విని మల్ల మాట్లాడు" అని సర్దుకూర్చుని, "నేల చెక్క పిలగోని పేరు మీదకొను. ఒక మూలను నీళ్ళు పడేతావున బాయి తొవ్వించు. పలమనేరు సంతకు పోయి ఒక జత గిత్తలు పట్టుకో. అంత చెక్కనేల, అందులో ఒక బాయి, జతగిత్తలు పెట్టుకోనుంటే

అప్పుడు జూడు. నీ కొడుక్కొక్క మతింపు వస్తుంది. కాపోల్లకు వచ్చినంత మతింపు వస్తుంది. అజ్జూసి ఎపుడో ఒకడు పిల్లనిచ్చేదానికి ముందుకొస్తాడు" అన్నాడు.

మన్నుగాడు నిరాశగా, "అది వొదిగే పనిగాదు సాఁవి. కని, పెంచి నోట్టి నేనే వీడితో వేగలేకుండా ఉండాను. ముక్కు మొగం తెలియంది వొచ్చి వీడితో యట్ట వేగుతుంది?" అన్నాడు.

బైరాగి, "అట్టనుకోవద్దన్నా, అట్టనుకోనే వద్దు. నేనింతకు ముందే చెప్తిని గదా. లోకంలో జనం ఎంత మంది ఉండారో అన్ని రకాల మనస్తత్వాలుం డాయి. పిలగోనికి కావలసినంత కండబలం ఉండాది. కాయకష్టం ఎంతయినా చేసెటోడు. పిసరంత గుండికాయ ఉండే వాణ్ణికొట్టే మొనగాడే లేడు. నాలుగు చోట్ల పోవిడి పెట్టితెంపు, తెగువ ఉండే పిల్లను దెచ్చి వీడికి ముడి పెట్టేద్దాం. ఇప్పుడు వీడు పిరిగ్గొడ్డు మాదిరుండాడు గాని, కాపరం చెయ్యంగ చెయ్యంగ బాణం మాదిరి దూసుకుపోయే తెంపు తెగవ వస్తుంది. అట్టాటివి జరగంగ చూసినానన్నా. ఏడడుగల బందఁవంటే ఇంకేంది? ఆలోచించన్నా. నీమనసుకేమనిపిస్తుందో అలోచించు" అన్నాడు.

మన్నుగాడు ఆలోచంచసాగాడు. కనుబొమలు ముడిపడు తుండగా, నుదు టి మీద చర్మం ముడతలు పడుతుండగా, కళ్లు చిట్లించుకుంటూ, దిగంతాల వైపు చూస్తూ ఆలోచించసాగాడు.

అదిగో తొలకరి వానలకు తడిసిన ఎర్రనేల, ఆ నేల మీద గిత్తలు నిలబడి ఉన్నాయి. చిన్నోడు గిత్తల మెడల మీద నాగలిని పూన్చుతున్నాడు. మెడమీద జోరీగ కుట్టడం వల్ల ఒక గిత్త తల అటూ, ఇటూ ఆడించింది. చిన్నోడు దాని కొమ్ములను చూచి నాలుగు బారలు దూరముగా వెనక్కు జరిగి నిలబడ్డాడు. చిన్నోడి

భార్య వాడి వీపు మీద చరచి, కండలు తిరగి ఉన్న అతడి జబ్బను పట్టుకుని గిత్తల వద్దకు ఈడ్చుకొచ్చింది. ఇద్దరు కలిసి నాగలిని గిత్తల మెడల మీద పూన్చారు. చిన్నోడు ముల్లుగర్రను కుడి చేత్తో పట్టుకున్నాడు. కాని గిత్తల వెనక కాళ్ళ గిట్టను చూసి జంకుతూ నాగలిమేడిని పట్టుకోవడానికి నిరాకరిస్తున్నాడు. అతని భార్య ముల్లుగర్రను తీసుకుని, నాగలి మేడిని ఎడమ చేతి పిడికిట్లో పట్టుకొని గిత్తలను అదిలించింది. నాగలి సాగుతున్నది. గిత్తల వెనక కాళ్ళ గిట్టలకు అందకుండా నాగలి వెంట ఎలా నడవాలో ఆమె భర్తకు వివరిస్తున్నది.

అదిగో, కావలి గుడిసె, వెన్నెల పిండారబోసినట్లున్నది. అడవి పందులు మందగా వచ్చి వేరు సెనగ పంటలను కుళ్ళగిస్తున్నాయి. కావలిగుడిసెలో పడుకుని ఉన్న చిన్నోడు, అతని భార్య పడుకుని ఉన్నారు. భార్య ముందుగా లేచి భర్త జబ్బ పట్టుకుని లేపింది. అతడిని గుడిసె ముందరకు ఈడ్చుకుని వచ్చింది. వేరు సెనగ పంటను కుళ్ళగిస్తున్న అడవి పందులను చూపించింది. కావలి గుడిసెలోనుంచి వడిసెలను తెచ్చి, దానిలో రాయిని పెట్టి భర్తకు ఇచ్చి బలిష్టమైన అతని భుజాన్ని తట్టింది. చిన్నోడు వడిసెలను గిరగిర తిప్పి గురి చూసి వదిలాడు. రాయి ప్రచండమైన వేగంతో వెళ్ళి, అడవి పంది కణతను తాకింది. అది కీచుమని అరుస్తూ పరుగెత్త సాగింది. మిగిలిన పందులన్నీ కీచుకీచుమని తోకలను ఆడించుకుంటూ పరుగెత్తసాగాయి.

అదిగో, రెండెడ్ల బండి. బండినిండా వరిధాన్యపు బస్తాలున్నాయి. చిన్నోడి భార్య బస్తాల పైన కూర్చుని భర్త కొరకు ఎదురు చూస్తూ ఉంది. చిన్నోడు కాడిమానుకింద దూరి వచ్చి ఎగిరి నొగ మీదకు కూర్చున్నాడు. అతడు తనకింద నేలను చూస్తూ, గిత్తల పగ్గాలను బిగపట్టి వాటిని కదలనివ్వడం లేదు.

గిత్తలు కదిలి బండి సాగబారితే తనకు కండ్లు తిరుగుతాయంటున్నాడు. బస్తాల మీద కూర్చుని ఉండిన అతని భార్య ముందుకు వచ్చి, భర్త వీపును ఆనుకుని, అతని వెనక కూర్చున్నది. నొగకింద నేలను చూడవద్దని, గిత్తల ముందున్న బాటను చూడాలనీ చెబుతున్నది. అతడు తలెత్తి దూరంగా బాట మీద దృష్టిని సారించి పగ్గాలను సడలించాడు. బండి సాగబారింది. అతని భార్య తన కాళ్ళతో గిత్తల పొట్టల కింద పొడిచింది. గిత్తలు పరుగు లంకించుకున్నాయి. బండి గల గల శబ్ధం చేస్తూ పరుగెడుతోంది.

అదిగో, చిన్నోడు, అతని భార్య కాపురముండే ఇల్లు. అది మూడంకణాల పూరిల్లు. ఇంటికప్పు పూర్తిగా బోరద గడ్డితో వేయబడి వుంది. వెన్నుగాడు అందంగా తీర్చి ఉంది. చూరు పొడుగ్గా ఉండి తిన్నెలను కప్పుతూ ఉంది. గోడలు సున్నపు పూతతో కాంతివంతంగా ఉన్నాయి. గోడలకు నాలుగు వైపుల కిటికీలు ఉన్నాయి. ఇంటిలోపల రెండు పెద్ద గాదెలున్నాయి. ఒకదాని నిండ వడ్లు, మరొకదాని నిండ రాగులు ఉన్నాయి. ఇంటిలో ఒక మూలన వేరుసెనగ కాయల బస్తాలున్నాయి. గోడనానుకుని కుండల దొంతరలున్నాయి. ఇంటినానుకుని పశువుల కొట్టం ఉంది. కొట్టంలో గిత్తలుపడుకుని నెమరువేస్తున్నాయి. చిన్నోడు భోజనం చేసి గుర్రున త్రేన్చుతూ వచ్చి ఇంటి అరుగు మీద కూర్చున్నాడు. అతని భార్య తమలపాకుకు సున్నంరాసి మడిచి అతనికి అందించి అతని పక్కన కూర్చున్నది.

ఎంత అద్భుతమైన దృశ్యం! ఎంత అందమైన దృశ్యాలు!!

మన్నుగాడు అలా దిగంతాల వైపు చూస్తూ, నిశ్చలనంగా కూర్చుని ఉన్నాడు. అతని నుదుటి మీదున్న చర్మపు మడతలు క్రమక్రమంగా మాయమవుతున్నాయి. అతని కనుబొమలు

ముడివీడుతున్నాయి. అతని కళ్ళు ప్రశాంతంగా వున్నాయి. అతని పక్కన ఉన్న రాజి ఎర్రటి నాలుకను వ్రేలాడవేసుకుని, సన్నగా వొగురుస్తూ ఉంది. దాని వొగుర్పు తప్ప చింత చెట్టు కింద మరే శబ్దమూ వినపడడం లేదు. పొద్దు పడమరకు వాలి చాలసేపయింది. చెట్టు కొమ్మల గుండా పొడఎండ పడుతూ ఉంది. గాలి ఉరవడి హెచ్చిందిగాని, కొమ్మలు నిశ్శబ్దంగానే ఊగుతున్నాయి. తొడిమ వీడిన పండుటాకులు చెట్టుకిందగాక అల్లంత దూరాన పడుతున్నాయి.

9

బైరాగి చాల సేపటి నుంచి చెట్టుబోదెనానుకుని ఒకే భంగిమలో కూర్చుని ఉండడం వల్ల అతని కాళ్ళు రెండూ తిమ్మిరెక్కాయి. అతని పాదాల మీద నల్ల చీమలు తిరుగుతుండడం కనిపిస్తున్నదిగాని, తిమ్మిరెక్కి ఉండడం వల్ల చీమలు కుట్టతుండడం తెలియడం లేదు. అతడు చెట్టు బోదెనుండి జరిగి బంగిమను మార్చి కూర్చున్నాడు. క్రమక్రమంగా అతని కాళ్ళ తిమ్మిరి వదలసాగింది. తిమ్మిరి వదిలేకొద్దీ కాళ్ళ మీద చీమలు కుట్టిన చోట మంట తెలియసాగింది. అతడు పాదాల మీద రుద్దుకుంటూ, "ఏం ఆలోచిస్తా ఉండావన్నా?" అన్నాడు.

మన్నుగాడు నిద్రలో నుంచి మేల్కొన్నాట్టు ఉలిక్కిపడి, దిగంతాల వద్ద నుండి దృష్టి మరల్చుకుని బైరాగిని చూశాడు. అతడు తన మనోనేత్రానికి ఇందాక కనిపించిన అద్భుతమైన, అందమైన దృశ్యాలను బైరాగికి వివరిం చాడు. అంతా వివరించి, దీర్ఘంగా నిట్టూర్చి, "ఇట్టాటివన్నీ కలలుగనే దానికి, మాట్లాడు

కోడానికీ బాగుంటాయి సావి. మేవు యానాదోల్లం. ఇట్టాటివి మా బతుకుల్లో జరగతాయా సావీ" అన్నాడు.

బైరాగి కాలిమీద రుద్దుకుంటూనే, "యానాదోల్లయితే ఏవయిందన్నా, యనాదోడు సేద్దింపన్లు చేయగూడదని శాస్త్రాల్లో రాసుండాదా యట్ట?" అన్నాడు.

మన్నుగాడు, "శాస్త్రాల్లో రాసుండాదో, మానొస్టిన్నే రాసుండాదో నాకు తెలవదు సావి. సేద్దింపన్లు మాకు అచ్చి రాలేదు. అచ్చిరాలేదు గాబట్టే చేతికొచ్చిన నేలగూడా మాకు దక్కకుండా పోయింది" అన్నాడు.

బైరాగి కాలిమీద గీరడం ఆపి, "నువు చెప్పేది నాకేంవీ గోచిరానికి రాలా. మీ చేతి కొచ్చిన నేల మీకు దక్కకుండా పోయుండేదేంది?" అన్నాడు.

మన్నుగాడు, "ఒకప్పుడు నాకు గూడా రెండెకరాల నేల ఉండేది సావి. సెంటు తక్కువగాకుండా రెండెకరాల నేల ఉండింది. గెద్ద తన్నుకపోతే కోడిపిల్ల మాయమైనట్టు ఆ నేల మాయమైపోయింది సావి ..." అని ప్రారంభించి మన్నుగాడు చెప్పుకు పోసాగాడు.

బైరాగి ఒళ్ళంతా చెవులు చేసుకుని వినసాగాడు.

"... ఇప్పుడైతే ఈ ఊర్లో యానాదోళ్ణి నేనొక్కడినేగాని, ఒకప్పుడు మేవు ఇరవై కుటుంబాలుంటివి సావి. మాకు తలొక గుడిసె ఉండింది. నేను తప్ప మిగిలినోళ్ళంతా ఒక్కరొక్కరే ఊరిడ్చిపోయిరి. వాళ్ళు పోంగానే వాళ్ళ గుడిసెలు ఒక్కటొక్కటే కూలిపోయినాయి. అట్ట జూడు" అని గుడిసెవైపు చేయి చూపించాడు.

బైరాగి తల తిప్పి చూశాడు. మన్నుగాని గుడిసెతో బాటు ఇరవై గుడిసెలు న్నాయి. ఒక్కొక్కవరుసలో పదేసి చొప్పున అవి రెండు వరుసలలో వున్నాయి. కాని మన్నుగాని గుడిసె తప్ప మిగిలినవన్నీ శిథిలమైపోయి ఉన్నాయి. వాటిలో ఒక్కదానికి గూడా పై కప్పులేదు. మొండి గోడలు మాత్రం ఉన్నాయి. కొన్నింటి గోడలు కాలప్రభావం వలన సగానికి కరిగిపోయి ఉన్నాయి. కూలిపోయిన గోడల మధ్య జిల్లేడు చెట్లు, కాసేరు చెట్లు మొలిచి ఉన్నాయి.

బైరాగి ఆ శిథిలాల వైపు చూస్తూ తలాడించి, "మొత్తం ఇరవై గుడిసెలుం డాయి. ఒక్కొక్క సోలుపులో పది లెక్కన కట్టినారు" అన్నాడు.

మన్నుగాడు "అవి మేము కట్టుకున్నవి కావు సామీ. నలభై ఏండ్ల కింద ఈ పాయకట్టులో ఒక తెల్లదొర కలెక్ట్రుగా ఉండె. ఆయన పేరు జార్జిదొర. ఆయనే ఈ గుడిసెల్ను కట్టించినాడు. మేవు యానాదులం గద సావి. అడవుల్లో కొండల్లో చెట్టుకొకడు, పుట్టకొకడు, లెక్కన బతకతా ఉంటిమి. ఎలుకల్ను, పాములను, కుందేళ్ళను పట్టి పొట్టబోసుకుంటా ఉంటిమి. మేవు ఆ మాదిర నాడోడి బతుకులు బతకటం జార్జి దొరకు ఇష్టం లేదు. ఆయన మా కోసం కాలినడకన అడవుల్లోకి వచ్చినాడు. మమ్మల్నందర్నీ ఈ ఊరికాడికి ఉడ్డేసి మాట్లాడినాడు. మేవంతా ఈ నాడోడి బతుకులు మానేసి మిగత జనం మాదిరి బతకాలన్జెప్పినాడు. అట్ట బతికే దానికి దోవ జూపిస్తానన్జెప్పినాడు. మమ్మల్నందర్నీ ఈ ఊరికాడికి తీసుకొచ్చినాడు. మేవు ఇరవై కుటుంబాలుం టివి సావి. ఈడ తలా ఒక గుడిసి కట్టించినాడు. నీళ్ళ బావి గూడా తొవ్వించినాడు. తలా రెండెకరాల భూమి గూడా పట్టాజేసి చ్చినాడు" అన్నాడు.

బైరాగి "ఆ భూమి యాడుందో?" అన్నాడు.

మన్నుగాడు ఊరికి దక్షిణంగా ఉన్న కొండను చూపించి, "ఆడొక అడ్డగుట్ట కనిపిస్తా ఉంది చూడు. దానికిందుడాది సావి. ఒక్కొక్కరికి రెండెకరాల లెక్కన నలభై యకరాల బూవి పట్టా జేసిచ్చినాడు. దాన్ని ఇప్పుడు గూడా 'యానాది మిట్ట' అంటారు సావి. సేద్దిం పన్లు మా కలరుత్తులు కాదు గద సావి. ఐనా మాకు తెల్సిన కాడికి ఆ నేలను సాగు చేస్తా ఉంటిమి. జొన్నలు, సజ్జలు, కందులు, ఇట్టాటి ఎలిపైర్లు ఏస్తా ఉంటిమి. సెనక్కాయలు గూడా పండిస్తా ఉంటిమి. సంవత్సరంలో ఆర్నెల్లకు పైగా ఆ పంటలతోనే మా పొట్టలు గడిచిపోతా ఉండె. ఆ నేల పుణ్యాన పస్తులంటే ఏందో తెలవకుండా బతికినాం సావి. అట్ట పదేండ్లు గడిచినాయి" అన్నాడు.

బైరాగి, "మల్ల ఏమాయె?" అన్నాడు.

మన్నుగాడు, "ఏమవుతుంది సావి. సేద్దిం పనులు మాకు అచ్చిరాలేదో ఏవో. చేతికిందుండిన బూవి దక్కకుండా పోయింది. గెద్ద తన్నుకపోయిన కోడిపిల్ల మాదిరమా బూవి మాయమై పోయింది సావి" అన్నాడు.

బైరాగి "తన్నుకుపోయింది ఎవరు?" అన్నాడు.

మన్నుగాడు, "ఇంగెవరు? ఈ ఊరి మనేగోడే. పీనుగుల్ను తినేమండా కొడుకు సావి. రివినీ యూవారాల్లో, కోరుటు యవారాల్లో పణితుడు. తోటల్లో, దొడ్లూ పోగా వానికి నన్నూ 7 యకరాల బూవి ఉండాది. అట్టాటోని చూపు యానాది మిట్ట మీద పడింది సావి. అంతే, నాలుగే నాలుగు సంవత్సరాలలో యానాది మిట్టను మింది నీళ్ళు తాగేసినాడు" అన్నాడు.

"యట్ట?"

మన్నుగాడు, "యానాదోళ్ళంతా దొంగలని ముద్దరేసినాడు సావి. మేమంతా బందిపోటు దొంగలమని ముద్దరేసినాడు. దొంగ బుద్దిలు మాకు పుటకల్నుంచే వస్తాయని గవుర్మెంటోల్ల పుస్తకాల్లో గూడా రాయించినాడు సావి. ఊర్లో ఏవి దొంగతనం జరిగినా దాన్ని మా మీద ఏసేటోడు. ఈ ఊర్లో ఎక్కడ దొంగతనం జరిగినా దాన్ని మేవు నెత్తినేసుకోవాల్సిందే. ఇండ్లల్లో సొత్తుగాని, కళ్ళాల్లో దాన్యం గాని దొంగతనం జరిగిందంటే మనేగాడు 'పలాన యానాదోణ్ణి ఈడ్చుక రండిరా' అనేటోడు. తలారోడొచ్చి ఆ యానా దోణ్ణి ఈడ్చు కపోయి కచేరికాడ రాతిస్తంభానికి కట్టేసేటోడు. చింత బరికెలు తీసుకుని రాత్రి, పగలు కొట్టి, కొట్టి వొళ్ళంతా నంజర నంజర చేసోటోళ్ళు. చీటికి మాటికి ఇట్ల జరగతా ఉంటే ఈ బాదలు పడలేక సగం మంది యానాదోళ్ళు బూవిని, గుడిసెను వొదిలి పెట్టేసి అడవుల్లోకి, కొండల్లోకి పారిపోయినారు. వాళ్ళట్ట పారిపోగానే మనేగాడు వాళ్ళ బూవిని ఆక్రమించుకున్నాడు. ఇంగ వాళ్ళ గుడిసెలు అట్టనే పాడుబడిపోయినాయి. ఒక వేళ యానాదోడెవుడన్నా దెబ్బలకు ఓర్చుకుని, బూవిని వొదిలి పెట్టకుండా మొండిగా కూసున్నాడనుకో, అప్పుడు మనేగాడు ఏవి జేసేటోడనుకున్నావు? వానిపైన పెద్ద కేసు పెట్టి పోలీసోల్లకు అప్పగించేసేటోడు. పోలీసోల్లు వొళ్ళంతా బాగ నలగ గుద్ది తీసకపోయి జెయిల్లో పారేసేటోల్లు. జెయిల్లో రెండు, మూడు సంవత్సరాలుండి బయటకొచ్చేటప్పటికి బూవి మాయమైపోయేది. ఇంగ జెయిల్లో నుంచి బయటపడిన మనిషి ఊర్లోకే వచ్చేటోడు గాదు. కడదోవన్నే అడవుల్లోకి వెళ్ళిపోయేటోడు. కొందరు కల్లూరు అడివిలో, కొందరు పనపాకం అడవిలోకి పోయి ఆడనే కాయమైపోయినారు. ఇంకొందరైతే అరవ రాజ్జానికి పోయి యాలగిరి కొండల్లో, జవ్వాది కొండల్లో బతకతా ఉండారు" అన్నాడు.

బైరాగి, "నీ బూవి యట్ల పోగొట్టుకుంటివి?" అన్నాడు.

మన్నుగాడు. "అట్టనే. ఒకసారి మనేగాని మందలో కొన్ని మేకలు మాయ మైనాయి. ఎవురెత్తకపోయినారో ఏవో ఆ మండేవానికే తెలవాల. గుడ్ల గూబ మాత్రం నా మీద వాలింది. మనేగాడు నన్ను తీసకపోయి జెయిల్లో ఏయిం చినాడు. రెండు సంవత్సరాలు జెయిల్లో ఉండినాను సావి. నేను బయట కొచ్చేటప్పటికి నా బూవిలో మనేగాని నాగళ్ళు తిరిగతా ఉండాయి. మిగతా వాళ్ళ మాదిరి నేను గూడ అడవుల్లోకి పోదమంటే కుదర్లేదు సావి. అప్పటికి ఈ పిలగోనికి మూడేండ్లు నిండతా ఉండాది. నా పెండ్లాం రానీపోని రోగాలతో ఏసిన పడక ఎత్తకుండా ఉండాది. ఈళ్ళను దీసుకొని అడవుల్లోకి యట్టబోదు? ఇంగ ఈ గుడిసెను అంటిపెట్టుకుని ఇట్టనే ఉండిపోయినా సావి. దేవుడు పెట్టినట్టు కానీ అన్జెప్పి ఇట్టనే ఉండిపోతి, నా బతుకు ఇట్టనే తెల్లారిపోయింది సావి" అన్నాడు.

బైరాగి, "ఇన్ని కరుమోలాలు జరగతా ఉంటే గవుర్మెంటోళ్ళు ఏవీ చెయ్యలేదా?" అనడిగాడు.

మన్నుగాడు, "గవుర్మెంటోళ్ళంటే ఎవరు సావి. తాసిల్దారు, రివినిస్సెట్రూ, మనేగాడూ ఈళ్లేగదా గవుర్మెంటు. యానాదోళ్ళంతా దొంగలని, సేద్దిం పనులకు లాకీ కారని, మాకిచ్చిన బూవులు మా అంతట మేమే యిడిసి పారిపోనావని ఈళ్ళంతా రాసి కలేట్రుకు పంపినారు. ఆ కలేట్రుతో మా బాదలు చెప్పుకుందావంటే అది మా గుండా అయ్యే పనేనా? ఆయన యాడుం టాడో. ఆయన కచేరి యాడుంటుందో మేవు ఎప్పుడన్నా చూసినామా? మేవు అడువుల్లో పుట్టి. అడవుల్లో పెరిగినోల్లం. మా మాట యాడికెక్కుతుంది సావి" అన్నాడు.

బైరాగి అతనితో ఏకీభవిస్తూ, "యాడికి ఎక్కదన్నా. నాకు దెల్సు యాడికీ ఎక్కదు. అన్నిటికన్న మించిన కలి ఇందులో ఒకటుం దన్నా, మీ బూవులు కాజేసింది గాక మీరంతా దొంగలని ముద్దరే సినాడు జూడు, అద్దల్సుకుంటే నాకే కడుపు కాలతా ఉంది. నీ కడుపు యట్ట కాలును?" అన్నాడు.

మన్నుగాడు, "ముద్దరెయ్యటమేగాదు సావి. ఈ పొద్దిటి గ్గూడ గవుర్మెంటోని పుస్లకాల్లో మేవు దొంగలమనే రాసుండాదంట" అన్నాడు.

బైరాగి విచిత్రంగాను, అకస్మాత్తుగాను కంఠస్వరం పెంచి, "రాసుకొని, వాళ్ళిష్టమొచ్చినట్టు రాసుకోని, ఎవడికి జవ. బ్రహ్మదేవుడు గీసిన గీతలే మారి పోతా ఉండాయి. వీళ్ళు రాసిన రాతలు మారిపోవా?" అన్నాడు. అలా అంటుండగా అతని కళ్ళలో ఎర్రజీరలు వ్యాపించాయి.

మన్నుగాడు ఏదో చెప్పబోయి, విచిత్రంగా ధ్వనిస్తున్న కంఠస్వరం విని, అతని కళ్ళలో కనిపిస్తున్న ఎర్రజీరను చూసి అవాక్కయిపోయాడు. చిన్నోడు నోరు వెళ్ళ బెట్టుకుని, మిడిగుడ్లు పెట్టుకుని బైరాగి ముఖం వైపు చూడ సాగాడు. రాజీ బైరాగి ముఖాన్నే చూస్తూ మెల్లగ లేచి, నాలుగు కాళ్ళపైన నిలబడి వీపును విల్లులాగ వంచింది. చిన్నోడు తన ఎడమ చేతిని దాని వీపు మీద వేశాడు. అతని చేయి తాకగానే అది మళ్ళీ పడుకుంది. కాని దాని చూపులు మాత్రం బైరాగి ముఖం మీదనే ఉన్నాయి.

సూర్యుడు మధ్య ఆకాశం నుండి పడమరగా సాగిస్తున్న తన ప్రయాణాన్ని సగానికి పైగా పూర్తి చేశాడు. చింత చెట్టు నీడ తూర్పు వైపున పడుతూ ఉంది. ఆ నీడ అంతకంతకూ పొడవవుతూ ఉంది. చెట్టు కింద కూర్చుని ఉన్న వాళ్ళ శరీరాల

మీద ఎండ ఏటవాలుగా పడుతూ ఉంది. సూర్య కిరణాలలో తగ్గిన వేడిమిని భర్తీ చేయడానికి వాళ్ళ గుండెలు మండుతున్నాయి. గాలి విసవిస వీస్తున్నప్పటికీ వాళ్ళ శరీరాలు చెమటలు కక్కుతూనే ఉన్నాయి. చెట్టు నుండి రాలిన చింతాకులు వాళ్ళ శరీరాలకు అతుక్కుంటున్నాయి.

వాళ్ళు అలా మాటలు దక్కి కూర్చుని ఉండగా గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది.

మన్నుగాడు బాట వైపు చూసి, "ఆద్దో గుర్రం మీద పోతా ఉండాడు జూడు, వాడే" అన్నాడు.

బైరాగి బాటపైన పరుగెడుతున్న గుర్రాన్నీ దాని మీదున్న రౌతును చూసి, "ఎవరు?" అన్నాడు.

మన్నుగాడు, "వాడే, మా వూరి మనేగాడు" అన్నాడు.

10

ఆ తెల్లగుర్రం ఎర్రటి ధూళి మేఘాలను రేపుకుంటూ మట్టిబాట మీద పరుగెడుతూ ఉంది. జీను లేని దాని వీపు మీద మణియం కూర్చుని కళ్ళెం చేతిలో పట్టుకుని ఉన్నాడు. గుర్రం అలా కొంతసేపు సాగి దక్షిణ దిక్కుగా మలుపు తిరిగింది. మలుపు తిరిగాక అది పరుగు మాని నడక ప్రారం భించింది.

ప్రతిరోజు ఉదయంగాని, సాయంత్రంగాని తన పొలాలను స్వయంగా తనిఖీ చేయడం మణియం గారికి రివాజు. తన

రాచకార్యాలు ఎన్ని ఉన్నప్ప టికీ అతడు ఈ దినచర్యను విధిగా నిర్వహిస్తూ ఉంటాడు.

గుర్రం ఒక ఏటి గట్టున సమీపించింది. వేసవి గనుక ఏటిలో ఒక వారన నీళ్ళు సొళసొళమని చప్పుడు చేసుకుంటూ కాలువలాగ ప్రవహిస్తున్నాయి. నీటి ప్రవాహం వెంబడి రెల్లుగడ్డి ఏపుగ నడుములెత్తు పెరిగి ఉన్నది. జెముడు కాకులు, నీటి కోళ్ళు రెల్లు పొదలలో తిరుగుతున్నాయి.

గుర్రం మెల్లగ, జాగ్రత్తగా గట్టుదిగి, నీటి ప్రవాహాన్ని దాటుకుని ఇసుక మీదకు వచ్చింది. మణియం గుర్రం దిగి తోలు దారాలను దాని వీపు మీద వేసి దానిజబ్బ మీద చరిచాడు. గుర్రం మోకాళ్ళు వంచి, ఇసుక మీద పడుకుని అటూ, ఇటూ దొర్లసాగింది.

మణియం పంచెను పైకెత్తి మడిచి పట్టుకుని, ఏటి అవతలి గట్టును ఎక్కాడు. అవతలి గట్టును ఎక్కగానే అతనికి సుక్షేత్రమైన నలభైయకరాల 'యానాది మిట్ట' దృగ్గోచరమయింది. ఆ నలభై యకరాలలో వరిపైరు విరగ పండి, సాయంకాలపు ఎండలో బంగారు వన్నెను సంతరించుకుని, కన్నుల పండువగా కనిపిస్తూ ఉంది. కంకుల భారానికి వరి కర్రలు వంగుతున్నాయి. గాలి వీచినపుడు వరికర్రలు వంగిలేస్తుండగా పొలం అలలతో నిండిన సముద్రం వలె భాసిస్తున్నది. పొలంలో అక్కడక్కడ దిష్టి బొమ్మలు నిలబడి ఉన్నాయి. పొలం మధ్యన కావలి జోబిడి ఉన్నది. పొలానికి ఒక వైపున వరుసగా కానుగ చెట్లున్నాయి.

మణియం సన్నటి గనిమ వెంబడి నడవసాగాడు. కంకుల మీద కూర్చుని ఉండిన పిచ్చుకలు మనిషి రాకను గమనించి, రవ్వున గుంపుగ లేచి కానుగ చెట్ల మీద కూర్చున్నాయి. మణియం తన నడకను ఆపి కానుగ చెట్ల వైపు చూస్తూ నిల్చున్నాడు.

పొలానికి కావలి ఉన్న జీతగాడు యజమానిని అంత దూరం నుండి చూసి పరుగు పరుగున వచ్చాడు. వాడి కుడి చేతిలో వడిసెల ఉన్నది. ఎడమ భుజానికి జోలె వ్రేలాడుతున్నది. జోలెలో గులక రాళ్ళున్నాయి.

జీతగాడు దగ్గరకు రాగానే మణియం, "గువ్వల పోరు మస్తుగా ఉండాది గదరా' అన్నాడు.

జీతగాడు చేతులు కట్టుకుని, "మస్తుగా ఉండాది దొర. వడిసెల తిప్పీ, తిప్పీ భుజాలు పుండ్లయి పోయనాయి. పగలంతా గువ్వల బోరు. రాత్రి కాగానే ఎలుకల పోరు" అన్నాడు.

మనియం, "ఎలుకల మందు తెచ్చిస్తినిగదరా. గానుక పిండిలో కలిపి పెట్టమంటినే. పెట్టలా?" అన్నాడు.

జీతగాడు, "పెట్టకేవి దొరా. గానుగపిండితో కలిపి పెంకుల్లో పెట్టినాం. బెల్లం కూడా కలిపి పెట్టినాం గెనాలంతా తిరిగి యాడేడ బొక్కలుండాయో ఆడంతా పెట్టినాం దొర." అన్నాడు.

మణియం. "ఎన్ని చచ్చినాయి?" అనడిగాడు.

జీతగాడు, "అవి యాడ చస్తాయి దొరా. అవి ఎలుక పుటక పుట్టినా యేగాని, వాటికి మనుషులకన్న జాస్తి తెలివి ఉండాది. మందు కలిపినామని వాసన బట్టి తెలుసుకున్నాయి దొరా. అవి పెంకుల్దగ్గిరికే పోవటం లేదు. నువ్వే సూద్దువురా" అని మణియంను గనిమ వెంబడి కొంత దూరం తీసుకు పోయాడు. అతడు ఒక చోట గనిమ దిగి మోకాళ్ళ మీద కూర్చుని, "ఈడ సూడు దొర. ఈ బొక్క ఎంత లావుందో సూడు. నీ తొడ లావుంది. ఈ బొక్క గుండా ఎలుకలు రాత్రంతా తిరిగి నాయి. ఇద్దో. పింటికలు గూడా ఎసినాయి సూడు. పెంకును మాత్రం

ముట్టుకోలా" అని పైకి లేచి, "ఇవి తెలివి మీరిన ఎలుకలు దొరా. వాటిదగ్గర మందులు, మాకులు పన్జెయ్యవు." అన్నాడు.

మణియం ఎలుక బొక్కలను, దాని ముందరున్న పెంకును చూస్తూ సాలోచనగా తలాడించాడు.

జీతగాడు మోకాళ్ళకు అంటుకుని ఉన్న బురదను తుడుచుకుని, "గువ్వలు ఎంతో మేలు దొర. అవి వచ్చేదీ పొయ్యేది మనక్కనిపిస్తుంది. అవి కంకి మీద వాలితే నాలుగ్గింజలు తిన్నా నాలుగ్గింజలు మిగిలిస్తాయి. ఎలుకలు అట్టగాదు దొర. అవి బయల్దేరేదే రాత్రిపూట. ఎప్పుడొచ్చేదీ తెలియదు.

ఎప్పుడు పొయ్యేదీ తెలియదు. కర్రను వంగ దీసి కంకిని మొదలు కాడికి తుంచి ఈడ్చుకపోతాయి. ఇంగ గింజ మిగిలే కతే లేదు. చేసేదంతా సడి చప్పుడు లేకుండా చేసేస్తాయి." అన్నాడు.

జీతగాడు మణియంను మరి కాస్త దూరం తీసుకుపోయి, "ఇట్ట జూడు దొర. ఈడ నుంచి ఆడదాక సగం కొండ్ర ఒక్క కంకి కనపడస్తా ఉండాదేవో సూడు. సుబ్బరంగా కొరుక్కుని ఎత్క పోయినాయి." అన్నాడు.

మణియం వరి పైరును చూస్తూ ఆలోచించసాగాడు. జీతగాడు కాస్త తగ్గుస్వరంతో, "గువ్వలు పోరు, ఎలుకల పోరు అట్టుండగా దొంగల పొటుకు గూడా దండిగా ఉంది దొరా" అని పడమటి దిక్కుగా చేయి చూపించి, "మొన్న తడకం సుబ్బా రెడ్డోల్ల పొలంలో దొంగలు పడినారు దొర. సందేల కాడ పైరు లచ్చినంగా ఉండింది. తెల్లారి లేచి చూసేటప్పటికి కంకి ఒక్కటిగూడాలేదు. అంతా కోసి బస్తాలకేసి తీసకపోయినారు. కావలి మనిషి ఉండంగనే ఇంతపనీ జరిగింది దొరా" అన్నాడు.

మణియం, "ఔ సిద్దా రెడ్డి చెప్పినాడు. పోలీసు రిపోర్టుగూడా ఇచ్చినాం" అన్నాడు.

జీతగాడు, "పోలీసు రిపోర్టు ఏవి పుణ్యందొర. ఊర్లోకొచ్చి డాష్ – దూష్" అంటారు. అదవగా దొరికినోణ్ణి పట్టుకుని నాలుగు దెబ్బలేస్తాన్నరు. చేతులు దులిపేసుకుని వాళ్ల దోవన వాళ్ళు పోతారు. అసలు దొంగను పట్టుకోరు. ఈ పోలీసోల్లిట్టుండబట్టే ఆ దొంగలు బరితెగించి పోతా ఉండారు. మన వరి పైరు చూస్తే నరగావు అడగతా ఉంది. ఈ పొద్దోరేపో వాళ్ళ చూపు దీని మీద పడు ..."

ఆ వాక్యాన్ని జీతగాడు పూర్తి చేయలేదు. ఆ వాక్యం మణియం గారి ముఖంలో కలిగించిన మార్పును చూసి జీతగాడు నివ్వెరపోయాడు. మణియంగారి ముఖం దెబ్బతిన్న త్రాచుపాము పడగ వలె సాయంకాలపు ఎండలో కనిపించింది.

జీతగాడు తేరుకుని, నోరు తడబడుతుండగా, "నె–నె–న్నేను ఊరికే, మాటవరసకు అంటిని దొరా. మన పైరు మీద కన్నేసే ధైర్యం ఎవరికుండాది? మనేగాని సొత్తుమీద చెయ్యేసే గుండికాయ ఎవరికుండాది. ఈ పాయకట్టు కంతా తెల్సు. మనేగాని సొత్తుమీద చేయేసినోడి ఇల్లు గుణాతం లేచిపో తుందని" అన్నాడు.

కాసేపటికి మణియంగారి ముఖంలో రౌద్రం అదృశ్యమయింది. అతడు తన ముందున్న వరి కంకిని చేత్తో నలిపి, "గింజ గూడా ముగ్గపండి పోయిందిరా. ఎంత తొందరగా కోసి వొబ్బిడి చేస్తే అంత మంచిది" అన్నాడు.

జీతగాడు, "ఔ దొరా. గింజ పూరా ముగ్గ పండిపోయింది. కొన్ని చోట్ల యితే గింజలు కింద రాలి మొలకెత్తతా ఉండాయి. ఎంత తొందరగ కోతలు మొదలు పెడ్తె అంత మంచిది" అన్నాడు.

మణియం నలభై యకరాల భూమిని కలయజూసి, "ఇంత పైరును కోసి వొబ్బిడి చేయాలంటే ఓపినంత మంది కూలోల్లు కావాల. కనీసం యాభైమంది కావాల అంతమంది యాడదొరుకుతారు. ఈ రోడ్డు పనొచ్చినప్పటి నుంచి ఒక్క కూలోడు దొరకడం లేదు. కాలూ, చేయి సుద్దంగా ఉండే వాళ్ళంతా రోడ్డు పనికి ఎగబడతా ఉండారు. ఇంగ మిగిలింది ఆడోళ్ళు, ముసిలోళ్ళే" అన్నాడు.

జీతగాడు, "వాళ్ళనయినా సరే. దొరికినంత మందిని తీసుకొచ్చి కోతలు మొదలు పెట్టించుదొరా. ఆలస్యం చేసే కొద్ది పంట శాదం అవతానే వుం టుంది" అన్నాడు.

మణియం "నాకు రెండు కాళ్ళాక చోట పెట్టే దానిగ్గూడ తీరిక లేదురా. పొద్దున మేస్త్రి వొచ్చినాడు. వానితో మద్యానందాక సరిపాయె. రేపు తాసిల్దారు వస్తానని మాట పంపించినాడు. వాణ్ణి దీసుకుని చిత్తూరుకు పోవాల. ఆడ నాలుగు దినాల పనుండాది. తిరిగొచ్చినాకనే కోతల పని చూడాల" అన్నాడు.

జీతగాడు, "అంతదాక ఆగితే యట్టాదొరా. ఈ ఎలుకలు పూటకు పుట్టెడు తినేస్తా ఉండాయి. వీటికి ఏదైనా ఒక దోవ చెయ్యకుంటే పంటంతా వెన్నపడేటప్పుడు కుండ పగలగొట్టుకున్నట్టవుతుంది దొరా" అన్నాడు.

మణియం కాసేపు మెడమీద గోక్కుంటూ ఆలోచించి, "ఐతే దీనికి ఒకే దోవ. యానాదోణ్ణి పిలవాల" అన్నాడు.

జీతగాడు, "ఔ దొరా. యానాదోణ్ణీ పిలిపించు దొరా. ఈ ఎలుకలు ఇద్ది లన్నీ వాడికి తెల్సు. వాడొచ్చి మూటుపెట్టి పొగేసినాడంటే ఇవి యాడివి ఆడ నీలిగి చస్తాయి. తెల్లారేటప్పటికి ఒక్క ఎలుక గూడా బతికుండదు. ఇంగ వేరే ఆలోచన ఎందుకు?

యానాదోణ్ణి పంపించుదొరా" అన్నాడు.

మణియం, "వేరే ఆలోచన ఏమీ లేదు. మనం ఈ పని ఎప్పుడో చేసుం డాల్సింది. నేను కడదోవన్నే పోయి యానాదోణ్ణి పంపిస్తా" అని సాగబారి, "రాత్రికి కావలి పడుకునేది ఎవరు? నువ్వా? ఎంకటిగాడా?" అనడిగాడు.

"నేనే దొరా".

మణియం పడమటి ఆకాశం వైపు చూస్తూ, "ఐతే నువ్వు ఇంటికి పోయి సంగటి తినేసి తొందరగా వచ్చెయ్ పొద్దుకూడా గూట్లో పడతా ఉంది" అని వెనుదిరిగి నడవసాగాడు.

11

పొద్దుగూట్లో పడింది. పడమటి కొండ వెనక నుంచి సూర్యుడు తన కిరణాలను నిట్టనిలువుగా ఆకాశం మీదకు ప్రసరింప జేస్తున్నాడు. ఆ కిరణాల ఆకాశం నుండి పరావర్తనం చెంది భూమి మీదకు ప్రసరిస్తున్నాయి. మేఘాలతో నిండి ఉన్న ఆకాశము, స్థావర జంగమాత్మకమైన భూమి కావిరంగును సంతరించు కున్నాయి.

మన్నుగాడు అక్కడక్కడ చిరిగిపోయి ఉన్న వలను బాగు చేస్తున్నాడు. వల ఒక చివర చింత చెట్టు కొమ్మకు ముడివేసి ఉంది. రెండవ కొనను చేత్తో పట్టుకుని చిన్నోడు నిల్చుని ఉన్నాడు.

మన్నుగాడు తను యానాది మిట్టన భూమిని సంపాదించిన వైనము, పోగొట్టుకున్న వైనము వివరించి చెబుతున్నాడు. బైరాగి అతని కథనాన్ని వింటూ అప్పుడప్పుడు ప్రశ్నలు వేస్తూ, సానుభూతి వాక్యాలు పలుకుతూ చింత చెట్టు కింద కూర్చుని ఉన్నాడు.

మన్నుగాడు, "... అట్టయి పోయినాయి సాఁవీ మా బతుకులు. చెప్పేకొద్దీ ఏపిస్తాది సాఁవి. గీరే కొద్ది పుండు రసికారినట్టు చెప్పేకొద్ది ఏపిస్తాది. ఇరవై కుటుంబాలు నాశనమై నల్లబొగ్గు లైనాయి సాఁవి. ఆ మనేగోని బాదలు పడలేక ఒక్కరొక్కరే బూఁవులిడిసి పెట్టేసి, గుడిసెలిడిసి పెట్టేసి దిక్కుకొకరై పోయిరి. నేనొక్కడిని మిగిలినా. ఈ గుడిసె ఒక్కటి మిగిలింది" అని తను చెబుతున్నది అకస్మాత్తుగ ఆపేసి, వల రంధ్రాల గుండా బాట వైపు చూడసాగాడు. మట్టి బాట మీద దుమ్ములేపుకుంటూ గుర్రం వస్తుండడం కనిపిస్తున్నది. మోకాటెత్తులేచిన ఆ ధూళి మేఘం సైతం కావిరంగును సంతరించుకున్నది. గాలి వీచడం ఆగిపోయి ఉండడం వల్ల ధూళి మేఘం మెల్లగ భూపతన మవుతున్నది.

బాట మీద గుడిసె సమీపాన గుర్రం తన పరుగును ఆపింది. అక్కడ మలుపు తిరిగి నడుస్తూ గుడిసెవైపుగా రాసాగింది. మన్నుగాడు తను చేస్తుండిన పనిని ఆపి వేశాడు. అతడూ, బైరాగి ఒకరినొకరు చూసుకున్నారు. చిన్నోడు వాళ్ళిద్దరిని మార్చి మార్చి చూడసాగాడు.

గుర్రం మెల్లగ వచ్చి మన్నుగాని దాపున ఆగింది. దూరాన తచ్చాడు తుండిన రాజీ పరుగున వచ్చి యజమాని కాళ్ళవద్ద నిలబడింది.

మన్నుగాడు తలపాగా తీసి చంకలో ఇరికించుకుని, "దండాలు దొరా" అన్నాడు.

మణియం గుర్రం మీదనే కూర్చుని, "ఏం జేస్తా ఉండావురా మన్నుగా" అన్నాడు.

మన్నుగాడు వినయంగా, "చేసేదానికి ఏముంది దొరా. దొరికితే ఎలుకలో, యంటవలో కొట్టి తినటం, లేకపోతే చెట్ల కింద ఈలకర్సుకోని పడుకోవడం" అన్నాడు.

మణియం, "అద్దెల్సురా, యానాదోడు ఎలుకల్ను, యంటవల్ను కొట్టి బతక్కపోతే ఇంగేఁవి కలెక్టరు పని చేస్తాడా? ఈ రాత్రికి ఏఁవి జెయ్యబోతావని అడగతా ఉండా" అన్నాడు.

మన్నుగాడు, " ఈ వలను కొంచెం అరువు చెయ్యాల దొర. అదయినాక దీన్ని బుజానేసుకుని అడివికి పోతాం. బయలుదేరిన వేళ మంచిదయితే ఒకిటో, రెండో కుందేళ్ళు దొరుకుతాయి. తెచ్చి కూర జేసుకుని తింటాం. దొరక్కపోతే తిరిగొచ్చి ముంతెడు నీళ్ళుదాగి పడుకుంటాం" అని మణియం వైపు ఆశగా చూసి, "మన దగ్గరేఁమన్నా పనుందా దొరా" అనడిగాడు.

మణియం, "పనిలేకపోతే నీ గుడిసికాడి కెందుకొస్తానా?" అన్నాడు.

మన్నుగాడు వంగి, వలకింద దూరి ఇవతలకు వచ్చి, "ఏఁవి పని చెప్పుదొరా" అన్నాడు. రాజి నీడ వలె కదిలి అతడి పక్కన నిలుచుంది.

మణియం, "ఎలుకల్ను పట్టాల్రా. వరి మడి ముగ్గపండిపోయింది. కూలోళ్ళను పిలిచి కోసి వొబ్బిడి చేద్దామంటే నాకు క్షణం తీరిక లేకుండా ఉంది. ఈ ఎలుకలేఁవో పూటకు పుట్టెడు వడ్లు శాదం చేస్తా ఉండాయి" అన్నాడు.

మన్నుగాడు, "నువ్వ అంతదూరం చెప్పాల్నా దొరా. ఎలుకల్ను పట్టేదానిగాక పోతే యానాదోడు ఉండేదేఁవిటికి? నువ్వు ఎప్పుడు పన్నోకి దిగమంటే అప్పుడే దిగతాను" అన్నాడు.

మణియం "ఈ రాత్రికే దిగాల్రా. ఆలస్యం చేస్తే పంట చేతికి దక్కేట్టు లేదు" అన్నాడు.

మన్నుగాడు. "ఇప్పుడే బయలుదేరతం దొరా" అని "ఒరే చిన్నోడా. ఈ వల తీసకపోయి లోపలెయ్" అన్నాడు.

మణియం "ఎలుకల్ను పట్టేదానిగ్గావల్సిన కొరముట్లన్నీ ఉండాయంట్రా?" అన్నాడు.

మన్నుగాడు, "అన్నీ ఉండాయి దొరా. మూటుకుండలు ఉండాయి. బొగ్గులుండాయి. వరిపొట్టు ఉండాది. మేఁవు పోవాల్సిన తావు చెప్పుదొర" అన్నాడు.

మణియం "యానాది మిట్టకు పోవాల్రా నేనిప్పుడు ఆడి నుంచే వస్తా ఉండా. గెనాల వెంబడి బారకొక ఎలుక బొక్కుండాది. ఒక్కొక్కటి నా తొడలావుండాది" అన్నాడు.

మన్నుగాడు ఏదో చెప్పుబోగా అతనికి పలక మారింది. అతడు కంగుకంగుమని దగ్గాడు. ఆ చప్పుడు విని రాజీ సన్నగా మొరిగింది. రాజి మొరగడం విని గుర్రం ఒకసారి సకిలించి నిల్చున్న తావుననే తొక్కులాడ సాగింది.

మన్నుగాడు గొంతు సవరించుకుని. "యానాది మిట్ట ఎలుకలకు పుట్టినిల్లు గద. పక్కనే అడ్డగుట్ట ఉండాది. పంటల్లేన ప్పుడు ఎలుకలన్నీ గుట్ట మీదకు చేర్తాయి. పంట ఎక్కగానే గుట్ట దిగొస్తాయి. వాటి గోత్రాలన్నీ నాకు దెల్సు దొర" అన్నాడు.

మణియం, "అవి తెలివిమీరి పోయినాయిగా. మందు పెట్తే పెంకుల్దగ్గరికే పోవటంలేదు" అన్నాడు.

మన్నుగాడు, "ఔ దొరా. మందు పెట్తే ఆమడదూరం నుంచే వాసన పట్టే స్తాయి. మనిషి అలికిడయితే నాలుగామడల నుండే గుర్తు పట్టేస్తాయి. నాకు దెల్సు దొరా. ఐతే వాటి ఆటలు నా దగ్గిర సాగవు. ఈ రాతిరంతా మేలుకున్నానంటే తెల్లారే సరికి ఇత్తనానికి గూడా ఒక ఎలుక మిగలదు. తెల్లారినాక నాకిష్టం జూసి నీకు తోచింది ఇయ్యి దొరా" అన్నాడు.

మణియం తొక్కులాడుతున్న గుర్రాని అదుపులోకి తెచ్చి, "ఇచ్చేదేందిరా. పట్టిన ఎలుకలన్నీ నువ్వే తింటావుగదా. మళ్ళా ఇనాఁవులేంది?" అన్నాడు.

మన్నుగాడు ప్రాధేయపడుతూ, "ఈ పాయకట్టుకే దొరవు. నువ్వే అట్టంటే యట్ట? మూటుపెట్టాలంటే నోటి మాటలా దొరా. నోటితో ఊది ఊది సోషతప్పి పోయేదాక ఊదాల. ఎలుకల్ని బయటకు తియ్యాలంటే నేలంతా కుళ్ళగించాల. తొవ్వి, తొవ్వి రెక్కలు పడిపోతాయి. పనంతా అయిపొయ్యే టప్పటికి నేను, నా కొడుకూ ఇద్దరం పడకెయ్యాల్సొస్తుంది" అన్నాడు.

మణియం కాసేపు ఆలోచించి, "సరే. ఒక్కొక్క ఎలుకకు దుగ్గాని ఇస్తాను. సరేనా"? అన్నాడు.

మన్నుగాడు పండ్లన్నీ కనిపించేలా నవ్వి, "సల్లగ నూరేండ్లు బతుకు దొర" అని చేతులు చాచి మణియం పాదాన్ని కండ్లకద్దుకున్నాడు.

మణియం కళ్ళేన్ని పక్కకు గుంచి గుర్రాన్ని వెనకకు తిప్పి, "నువ్వు ఎన్ని ఎలుకలు పట్టినావో నాకెట్ట తెలవాల?" అనడిగాడు.

మన్నుగాడు. "ఎలుక దొరగ్గానే దాని తోక కోసి పక్కన పెడతాను దొరా. ఆ తోకలన్నీ తీసుకొచ్చి రేప్పొద్దున నీకు జూపిస్తా. నువ్వే లెక్క పెట్టుకో దొరా" అన్నాడు.

మణియం "సరే. కొరముట్లు తీసుకుని బయలుదేరు. పొద్దుగూడా పోయింది" అని గుది కాళ్ళతో గుర్రం డొక్కలో పొడిచాడు. గుర్రం నడక ప్రారంభించింది.

12

పొద్దు పోయి చాలాసేపయింది. అలుముకోవడానికి ప్రయత్నిస్తున్న చీకట్లను చెదరగొట్టడానికి చంద్రుడుదయించాడు. అతనికి సహాయపడడానికి నక్షత్రాలు అసంఖ్యాకంగా ప్రత్యక్షమయ్యాయి. ఆకాశంలో నక్షత్రాలవలె అసం ఖ్యాకమైన మిణుగురు పురుగులు భూమి మీద చెట్లకొమ్మలను అంటి పెట్టుకుని మిణుకు మిణుకు మంటున్నాయి.

వెన్నెల వెలుగులో సన్నటి కాలిబాట వెంబడి మన్నుగాడు. అతని వెంబడి చిన్నోడు నడుస్తున్నారు. మన్నుగాడు రెండు చేతులలో రెండు మూటు కుండలను పట్టుకుని నడుస్తున్నాడు. చిన్నోడు బొగ్గులు, వరిపొట్టు ఉన్న రెండు తట్టలను నెత్తిన బెట్టుకుని, ఒక చేత్తో గునపం పట్టుకుని నడుస్తున్నాడు.

వాళ్ళిద్దరు ఏటిలోకి దిగి సన్నగ ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని దాటుకుని, ఇసుక మీద నడచి అవతలి గట్టెక్కాడు. మన్నుగాడికి నలభైయకరాల యానాది మిట్ట దృగ్గోచరమయింది. అతని నడక

అకస్మాత్తుగ ఆగిపోయింది. వెనక నడుస్తున్న చిన్నోడు అతని మీద పడబోయి తమాయించుకున్నాడు.

ఏటిగట్టు మీద మనిషి పొలకువ గమనించి కావలి జోబిడిలో ఉన్న జీతగాడు, "ఓయ్ ఎవుర్రా ఆడ?" అని అరిచాడు.

మన్నుగాడు, "మేఁవన్నా యానాదోల్లం" అని సమాధానమిచ్చాడు. వాళ్ళిద్దరు గనిమల మీద నడుస్తూ కావలి జోబిడి వద్దకు వచ్చారు. కావలి వాడు కల్లు దుత్త పక్కన బెట్టుకుని, కల్లును ముంతలోకి వంచుకొని తాగుతున్నాడు. అతడు ముంతను కింద బెట్టి, "మీరు ఎప్పుడొస్తారా అని దోవజూస్తా ఉండా" అన్నాడు.

మన్నుగాడు, "దొర ఇప్పుడే చెప్పినాడన్నా. చెప్పగానే కొరముట్లు తీసుకుని యలబారి వచ్చినాం" అన్నాడు.

కావలివాడు, "పని మొదులు పెడతారా? లేకపోతే చెరి రెండు ముంతలు కల్లు దాగి పన్లోకి దిగుతారా? కావల్సినంత కల్లు ఉండాది. లోపల ఇంగా రెండు దుత్తలుండాయి" అన్నాడు.

మన్నుగాడు, "వద్దన్నా. ఇప్పుడు తాగటం మొదలు పెట్తే పని పంచేటవుతుంది. తొలిజాఁవు దాటిందంటే ఎలుకలన్నీ బయటకొచ్చేస్తయి. మల్ల మూటు పెట్టే లాబం లేదు" అన్నాడు.

కావలి వాడు, "ఐతే ఇంగేఁవి. పని మొదలు పెట్టండి. నేను లెక్క బెట్టిన కాడికి గెనాల వెంబడి దాదాపు ఇరవై బొక్కలుండాయి నన్నొచ్చి చూపించమంటారా? మీరే ఎతుక్కుంటారా?" అన్నాడు.

మన్నుగాడు, "నువ్వు కూసో అన్నా, నువ్వు పగలంతా మడక కొట్టి, మానుకొట్టి అల్సిపోయి ఉంటావు. మాతో తిరిగి ఇంగా

ఎందుకు వొళ్ళు అల్ల పెట్టుకుంటావు. ఐనా ఎలుక బొక్కలు యాడుండేది యానాదోడికి ఒకడు చెప్పాల్నా?" అన్నాడు.

తండ్రి కొడుకులిద్దరు కావలి గుడిసె వద్ద నుండి వరి పొలంలోకి నడిచారు. గనిమల వెంబడి పొలమంతా కలయదిరిగారు. ప్రతి ఎలుక బొక్క వద్ద గుర్తుగా పొడుగాటి, తెల్లటి గోగు పుల్లను నాటారు. ఒక్కొక్క బొక్క దగ్గిర మూట పెట్టడం ప్రారంభించారు. మూట కుండలో బొగ్గులు, వరిపొట్టు, కొంత ఎండుగడ్డి వేశారు. అగ్గిపుల్ల గీసి కుండకు ఉన్న రంధ్రం ద్వారా ఎండుగడ్డిని రగిలించారు. ఎలుకబొక్కకు అడ్డంగా మూటుకుండను అమర్చారు. తండ్రి, కొడుకులిద్దరు ఒకరు మార్చి ఒకరు కుండముందు కూర్చుని, రంధ్రం ద్వారా గాలిని ఊదసాగారు. కుండలోని వరిపొట్టు, బొగ్గులురగులుకుని తెల్లటి పొగలు బయలుదేరాయి. పొగ బయటకు తప్పించుకుని పోకుండా ఉండేందుకు కుండ మూతి చుట్టూ బురద మట్టిని వేసి మెత్తించారు. పొగ క్రమక్రమంగా బొరియల లోపలకు వ్యాపించింది. వ్యాపిస్తున్న పొగను తప్పించుకోవడానికి ఎలుకలు బొరియలలో మరింత లోపలకు పరుగెత్తాయి. బొరియలు పొగతో నిండగానే ఎలుకలు గిల గిల తన్నుకుని ఒక్కటొక్కటే ప్రాణాలు విడిచాయి.

రాత్రి తొలిజాము గడిచింది. తండ్రి కొడుకులిద్దరు కలిసి ఒక్కొక్కటిగా వరి పొలంలో ఉన్న బొక్కలన్నింటికీ మూటు పెట్టడం పూర్తి చేశారు.

మన్నుగాడు గునపం తీసుకుని మొట్టమొదటగా మూటు పెట్టిన బొక్కను జాగ్రత్తగా త్రవ్వసాగాడు. అది సొరంగంలాగ ఉన్నది. అలా బారెడు దూరం త్రవ్వగా బొరియ చివరన చచ్చిపడి ఉన్న ఎలుకలు రెండు కనిపించాయి. అవి దాచుకుని ఉండిన

రెండు పిడికిళ్ళ వరికంకులు గూడ కనిపించాయి. మన్నుగాడు ఎలుకలను ఒక తట్టలోను, వరికంకులను మరొక తట్టలోను వేశాడు.

అప్పటికి మన్నుగాడికి ఆయాసం ముంచుకు వస్తున్నది. వెన్నెల కురుస్తున్నప్పటికీ వొళ్ళంతా చెమట పట్టింది. అతడు గునపాన్ని చిన్నోడికిచ్చి. "ఇంగా నాగుండా కాదురా సిన్నోడా. మిగత బొక్కల కత నువ్వు జూసుకో. నేను కావలిజోబిడి కాడికి పోయి నడుం వాలస్తా" అన్నాడు.

చిన్నోడు, గునపం అందుకుని, "నువ్వు పోయి పడుకో నాయనా. మిగతా పనంతా నేను జూసుకుంటా" అన్నాడు.

మన్నుగాడు కాళ్ళీడ్చుకుంటూ కావలి జోబిడి వద్దకు వచ్చాడు. కావలి వాడు జోబిడిలో కొయ్యగుంజకు జారగిల బడి ఉన్నాడు. వెన్నెల ఏటవాలుగ పడుతుండడం వల్ల అతని దేహం సగం వెన్నెలలోను, సగం చీకటిలోను ఉన్నది.

మన్నుగాడు రావడం చూసి కావలివాడు, "పని ఎంత దాక వచ్చిందిరా" అన్నాడు. మన్నుగాడు తలపాగాను విప్పి, విదిల్చి, "బొక్కలన్నిటికీ మూట పెట్టినాఁవన్నా. ఇక తొవ్వడం మొదలు పెట్టినాం. ఒకటి తొవ్వి ఇటొచ్చేసినా" అన్నాడు.

కావలివాడు, "ఎలుకలేఁవన్నా దొరికినాయా?" అన్నాడు.

మన్నుగాడు, "రొండు దొరికినాయన్నా. ఆలిమొగుడు మాదిరుండాయి. రొండు పిడికిళ్ళ వరికంకులు గూడా దాచి పెట్టుకుని ఉండినాయి" అని తలపాగాను నేలమీదవేసి దాని మీద కూర్చున్నాడు.

కావలివాడు, "కూసుంటా ఉండావే. మిగతా బొక్కలు ఎప్పుడు తొవ్వుతావు?" అన్నాడు.

మన్నుగాడు, "మిగతా వాటికత మా పిలగోడు సూసుకుంటాడు. నాగుండా కాదన్నా. ఒక బొక్క తొవ్వేటప్పటికి గుండికాయల్లోకి నీళ్ళు దిగినాయి. పాయం మీదుండినప్పుడు వొంచిన్నడుఁవెత్తకుండా ఇట్టాటి బొక్కలు నూరు తొవ్వేటోణ్ణి" అన్నాడు.

కావలివాడు మన్నుగాడి శరీరంపైన వెన్నెల మూలాన మెరుస్తున్న చెమటను చూస్తూ, "ఔ. వయసు ఉడిగినాక ఒక దానికొకటి వొదగదు" అని "మొత్తం ఎన్ని బొక్కలకు మూటు పెట్టినారు?" అనడిగాడు.

మన్నుగాడు, "దగ్గిరదగ్గిర ఇరవై దాక పెట్టినాఁవన్నా. బొక్కల దగ్గిర గోగుపుల్లలు నాటినాఁవు. కనిపిస్తా ఉండాయి చూడు" అని పొలం వైపు చేయి చూపించాడు.

పొలంలో అక్కడక్కడ నిలబడి ఉన్న తెల్లటి గోగుపుల్లలు వెన్నెలలో కనిపిస్తున్నాయి. ఒక గోగు కొయ్య దగ్గర చిన్నోడు వంచిన నడుమెత్తకుండా గునపంతో తవ్వుతుండడం కనిపిస్తుంది.

మన్నుగాడు ఎలుగెత్తి గట్టిగా, "ఓరి సిన్నోడా. తొవ్వేటప్పుడు జాగ్రత్తగా తొవ్వు లోపల ఎలుకలేగాదు. పావులు, మండ్రగబ్బలు గూడా ఉంటాయి. సూసుకుంటా తొవ్వు" అనరిచాడు.

చిన్నోడు, "అట్లనే నాయనా". అని తవ్వుకుంటూనే సమాధాన మిచ్చాడు.

కావలివాడు. "ఆ పిలగోడేగదరా నీ కడుగుట్టు కొడుకు?" అన్నాడు.

మన్నుగాడు. "ఔనన్నా. పోయినోళ్ళంతా పోగా వాడొక్కడు మిగిల్నాడు" అన్నాడు.

కావలివాడు, "జాలు నీళ్ళకు పుట్టినా వరపిండం పుట్టినాడురా అట్ట జూడు ఏనుగు మాదిర కూరాడతా ఉండాడు. నీకేఁవిరా. ఉడిగినేళ నిన్నుకూసో బెట్టి కూడు బెట్టే కొడుకుండాడు. రెండు జేతుల అడిగొచ్చినావు" అన్నాడు.

మన్నుగాడు, "పిల్లి వైభోగాన్ని చూసి ఎలుక మూర్ఛపోయిందట. అట్టుంది నువ్వు చెప్పటం. వాడు చూసేదానికి అట్టుండాడుగాని బుద్ది సూచ్చిం బొత్తిగా లేదన్నా. ఇంత వయసొచ్చింది. తూర్పు ఏదీ, పడమర ఏదీ తెలవదు" అని నిట్టూర్చి "బుద్ధి సూచ్చిం లేకపోతే పాయె. గుండె ధైర్యంగూడా లేదన్నా. ఏనుగు మాదిరుండాడంటివి.

ఏఁవి లాబం. చీమకున్నంత గుండికాయ లేదు. నేనిప్పుడు కూత వినపడేంత దూరంలో కూసోనుండబట్టి వాడు పని చేసుకుంటా ఉండాడు. నేను కొంచెం కన్ను మరుగైనాననుకో, చేతిలో పని యిచ్చి పెట్టేసి ఇంటికి పరుగెత్తతాడు. అంతెందుకు. ఇప్పుడు ఆ కానగ చెట్లలో యాడన్నా గుడ్ల గూబ కూస్తే చాలు. ఈడు గడ్డపార పారేసి బాయిలో పడినోడు మాదిర అర్సుకుంటా ఈడికొచ్చేస్తాడు" అన్నాడు.

కావలివాడు కాసేపు చిన్నోడి వైపు చూసి, "ఇట్టాటోళ్ళు ఆడాడ ఉంటార్రా. సూసేదానికి కొండమాదిరుండారుగాని, ఈడుండే పుల్లదీసి ఆడపెట్టేతెలివి ఉండదు. ఇంకొందరుంటారు. సూసేదానికి ఎండుతొక్క మాదిరుంటారు గాని రాజ్జాలు పట్టే తెలివుంటుంది" అన్నాడు.

మన్నుగాడు, "మా పిలగోడు కూడా అంతేనన్నా. ఆడుండే పుల్లదీసి ఈడపట్టే తెలివిలేదు. ఆ మాత్రం పనిగూడ నేను పక్క నుండి చేస్తేనే చేస్తాడు. నేను ఎన్నాళ్ళుంటాను. ఈ పొద్దో రేపో రాలిపోయేటోణ్ణి. నేను పోయినాక వాడు యట్ట పొట్ట పోసుకుంటాడో ఏమో. ఈ దిగులుతోనే సగమై పోతా ఉండానన్నా" అని కాసేపు ఊరుకుని. "ఈ పొద్దు తెల్లారి ఒక బైరాగి కనబడినాడన్నా. నాకడుపులో ఉండేదంతా బైరాగితో చెప్పుకున్నా. పిలగోనికి పెండ్లి చేసేస్తే ఆ పిల్లే వాడిని దోవలో పెడుతుందంటాడు బైరాగి. అట్టాటివి జరగంగ, చూసినానంటాడు. నువ్వే మంటావన్నా" అన్నాడు.

కావలివాడు "ఎందుకు జరగవురా, అట్టాటివి దండిగా జరిగినాయి. పిల్ల ఇంట్లో అడుగు పెట్టిన వేళా విశేషం జూడు – ఆ లగ్నం మంచిదైతే చేసుకున్నోని జాతకవే మారిపోతుంది. నువ్వు వూరికే పిలగోడు – పిలగోడు అంటా ఉండావుగాని వాడు పిలగోడు ఏవిటికాయె. పెండ్లీడు ఎప్పుడో వచ్చేసుండాది. గంతకు తగిన బొంతను తెచ్చి వాడికి ముడిపెట్టేసి నీనెత్తి బరువు దించుకో" అన్నాడు.

మన్నుగాడు ఊరఁకుహరం వ్యాకోపించేలా దీర్ఘంగా నిట్టూర్చి "ఇట్టాటోనికి పిల్లను తేవాలంటే నోటి మాటలా అన్నా ..." అని ప్రారంభించి, ఉదయం తనూ, బైరాగీ కలిసి చిన్నోడి భవిష్యత్తును గురించి వేసిన పథకాలనన్నింటినీ పునశ్చరణ చేశాడు. మేస్త్రీ రోడ్డు పనిలోకి చిన్నోడిని తీసుకుపోవడము, సంవత్సరం దాక చిన్నోడిని రోడ్డు పనిలో ఉంచడానికి నిశ్చయించుకోవడము, సంవత్సరాంతానికి చేతికొచ్చే డబ్బులో మూడు ఎకరాల భూమిని కొనుక్కోవడము వగైరాలన్నీ వివరించాడు. తొలకరి వానలకు తడిసిన ఎర్రనేలలో చిన్నోడు నేర్పుగా కొండ్రదున్నుతున్నట్టు,

రాత్రిపూట వేరుసెనగ పంటను నాశనం చేయడానికి వచ్చిన అడవి పందులను చిన్నోడు వడిసెల విసిరి తరమగొడుతున్నట్టు, వరి బస్తాలతో నిండిన బండినొగ మీద చిన్నోడు కూర్చుని ఉండగా బండి గలగలమని సాగుతున్నట్టు, మూడంకణాల యింటి అరుగు మీద చిన్నోడు కూర్చుని భార్య ఇచ్చిన తాంబూలాన్ని నములుతున్నట్టు, తన మనోనేత్రానికి కనబడిన అందమైన, అద్భుతమైన దృశ్యాలను మన్నుగాడు వివరించసాగాడు.

చంద్రుడు ఆకాశం పైన ఎగబ్రాకేకొద్దీ జోబిడి తాలూకు నీడ కిందకు జారసాగింది. కొంత సేపటికి కావలిని శరీరాన్నంతటినీ చీకటి కప్పివేసింది. అతడు చీకటిలోను, మన్నుగాడు వెన్నెలలోను కూర్చుని ఉన్నారు.

మన్నుగాడు తను చెప్పడం ముగించి, "చ్చ్" అని నోరు చప్పరించి, ఉదయం బైరాగితో అన్నట్టుగానే, "ఇట్టాటివన్నీ కలలు కనేదానికి, మాట్లాడుకునే దానికి బాగుంటాయి గాని మా బతుకునోన ఇట్టాటివి జరుగుతాయా అన్నా" అన్నాడు.

కావలివాడు, "గుడిసెల్లో పుట్టినోడు గుడిసెల్లోనే సావాలని నొస్టిన రాయలేదురా, దేవుడు కన్ను తెరవాల్నేగాని మూడంకణాల పూరిల్లేంది, మూడంకణాల మిద్దెలోనే బతకొచ్చు" అన్నాడు.

అందమైనట్టివి, అపురూపమైనట్టివీ అయిన వాటికి దిష్టి తగులుతుం దంటారు. అది కలలకు కూడా వర్తిస్తుందేమో. చిన్నోడి భవిష్యత్తును గురించి తాను ఇలాంటి అందమైన కలలు కనడము, ఆ కలలను ఇతరులతో పంచుకోవడము మంచిది కాదని మన్నుగాడికి అనిపించింది. అతడు చర్చనీయాంశాన్ని మార్చాలను కున్నాడు.

13

మన్నుగాడు, "ఒక్క బొక్క తొవ్వగానే రెండు ఎలుకలు దొరికినాయన్నా. ఒక్కొక్కటి బలరాకాసి మాదిరి బలిసి ఉండాయి. కోసి కుప్పేస్తే వీసెడు మాంసం పడుతుంది" అన్నాడు.

కావలి మనిషి, "ఇంగేఁవి. బొక్కలన్నీ తొవ్వినాక యట్టలేదన్నా నలభై యాభై ఎలుకలు దొరుకుతాయి. ఉప్పూ, కారం ఏసి ఎండేసినావంటే వారం దినాలు దాక మూడు పూటలు తినొచ్చు" అన్నాడు.

మన్నుగాడు, "ఎలుకలేగాదు, ఒక తట్ట వడ్లుగూడ జఁవ అయ్యేట్టుండాయి. అసలే యానాది మిట్టన పండిన వడ్లు. దంచి కూడొండి తింటే, కూరా నారా లేకుండానే నానారుసులు బార్తుంది. ఈ నేల దినుసే అట్టాడిది" అన్నాడు.

కావలివాడు, "నీకెట్ల దెల్సు. ఈ నేల దినుసుకత నీకెట్ల దెలుసు?" అన్నాడు.

మన్నుగాడు "నీకు దెలవదా అన్నా, ఇరవై ఏండ్ల కింద ఈ నేలంతా మాదేగదా" అన్నాడు.

కావలివాడు ఏదో జ్ఞాపకమొచ్చినట్టు "ఔ, ఇరవై ఏండ్ల కింద ఈ నేలంతా యానాదోల్లదేనంట. దీని పేరే యానాదిమిట్ట గదా" అన్నాడు.

మన్నుగాడు, "ఇంగిలీసు దొర మాకు పట్టా జేసిచ్చినప్పుడు ఈ నేల ఇట్టలేకుండె. యాడ జూసినా జెముడు పొదలు, బలుస పొదలు, ముష్టి చెట్లు, ఈత చెట్లు అడివి మాదిరిగా ఉండె. చెట్లు,

పుట్టలు, కొట్టి; మిట్ట పల్లం సదరం చేసేదానికి ఆర్నెల్లు పట్టింది. వానలు పడినప్పుడు ఎలిఫైర్లు ఏసేటోల్లం. వానలు లేనప్పుడు నేలంతా బీడు పెట్టేటోల్లం. బావులు తొవ్వించి సేద్దిం చేసుకునే తెలివి మాకు యాడిదన్నా" అన్నాడు.

కావలివాడు, "అదే నేల ఇప్పుడెట్టుండాదో సూడు సీతమ్మ తానఁవాడి నట్టుండాది. దొర ఈడొకటి, ఎగవనొకటి రెండు కోనేరు బావులు తొవ్వించినాడు. సంవత్సరం పొడుగునా బంగారం పండిస్తా ఉండాడు. ఎందుకు దారబోసుకుంటిర్రా ఇట్టాటినేలను? అన్నాడు.

మన్నుగాడు, "ఏఁవని చెప్పాలన్నా, చెప్పినా ఏఁవి లాబముండాది? నేల మొత్తం దొర పేరుతో పట్టా అయిపోయుండాది. ఇప్పుడు చెప్పుకుని వొగిస్తే ఏఁవిలాబం. ఎలుకల్ను యంటవల్ను పట్టి బతకమని మా నొస్టిన రాసుండాది. అట్టన్జెప్పి సరిపెట్టుకోవాల," అన్నాడు.

కావలివాడు గూడా దీర్ఘంగా నిట్టూర్పు విడిచి, చీకటిలోనుంచి, "యానాది మిట్టేగాదురా. దొర దగ్గరుండే యకరాలన్నీ అట్ట సంపాదించినవే. ఇన్ని యకరాలు యట్ట సంపాదిస్తివని అడిగే అతోరటీ కలెక్ట్రుకూ లేదు. గవునీరుకూ లేదు, నువ్వు నేను ఆడ గూసోని వొట్టి నోరు నఁవలాల్సిందే" అన్నాడు.

అతడు మైకం దిగిపోతుండడం గమనించి, పక్కకు వంగి, దుత్తలోని కల్లును ముంతలోకి వంచాడు. ముంతను పెదవులకంటించుకుని ఒక్క పెట్టున ఖాళీ చేసి కింద బెట్టి, "దినమంతా గుండాలి మిట్టన దుక్కిదున్నినాన్రా. రెండు సాళ్ళు దున్ని మడక యిడిసి పెట్టేటప్పటికి కీళ్ళన్నీ పచ్చి పుండ్లయి

పోయినాయి. ఇది కడుపులో ఉన్నంత సేపు నొప్పుడు అణగతాయి. ఇది ఆవిరి అయిపోగానే నొప్పులు మొదలవుతాయి" అన్నాడు.

మన్నుగాడు, "ఈ లెక్కన తాగతా ఉంటే ఇంకొంచేపటికి కాళ్ళు చాపేసి నిద్రపోతావు. మళ్ళీ కావలెట్ట కాస్తావన్నా?" అన్నాడు.

కావలివాడు, "నువ్వొక ఎర్రిబోగలోడివి. నేనీడుండేది కావలికోసమే ననుకుంటివా? ఏదో మాటవరసకు కావలి ఉండానంతే. దొరోళ్ళ పొలమని తెలిసీ దీనిపైన కన్నేసేటోడెవరు? ఆయుస్సు తీరిపోయినోడే అట్టాటి పనికి పూనుకోవాల. పులినోట్లో తలకాయ పెట్టినోడన్నా బతకతాడుగాని, దొరోళ్ళ సొత్తు మీద చెయ్యి వేసినోడు బతకతాడా?" అన్నాడు.

వెన్నెలలో కూర్చుని ఉన్న మన్నుగాడు, "నాకు దెలవదా అన్నా. నాకు దెలవదా" అన్నాడు హీనమైన స్వరంతో. ఇరవై ఏండ్ల క్రితం మేకల దొంగతనం తనపై మోపడం అతనికి గుర్తుకొచ్చింది. ఆనాడు జరిగిన సంఘటనలు అతని కళ్ళముందు కదలసాగాయి. ఆ దినం సూర్యుడు పడిమింటనుండగా దొర పంపిన మనుషులు మన్నుగాని గుడిసెకు వచ్చారు. వాళ్ళు అతని చంకలకింద చేతులు వేసి దొర వద్దకు లాక్కెళ్లారు.

పశువుల కొట్టంలో దొర అతని కోసం ఎదురు చూస్తున్నాడు. అతడు దాపుకు రాగానే దొర తన అభియోగం వినిపించాడు. దొరగారి దొడ్లో నుంచి పన్నెండు మేకలు ఒక్కసారిగ మాయమయ్యాయి. వాటిని మన్నుగాడే మాయం చేశాడు,

దొర, "ఆ మేకల్ను ఎవరికమ్మావు? ఏ వూర్లో అమ్మావు?" అనడిగాడు.

అతడా ప్రశ్నలను చాల సౌమ్యంగానే అడిగాడు. ఐనప్పటికీ ఆ ప్రశ్నలు ఒక విచిత్రమైన శక్తిని ఆపాదించుకుని మన్నుగాని శరీరంలోని రక్తాన్ని గడ్డ కట్టించాయి. తన శరీరం కొయ్యబారి పోయింది. జీతగాళ్ళిద్దరు అతని చంకల కింద చేతులు వేసుకుని అలాగే పట్టుకుని ఉన్నారు. లేకుంటే అతడు కుప్పగ కూలిపోయేవాడే.

కొంత సేపటికి అతడు తేరుకుని, "పొద్దుననంగా నా పెండ్లాన్ని తీసుకుని అడవికి పోతిని దొర. ఇప్పుడే గుడిసెకొచ్చి కాళ్ళు చేతులు" అతని వాక్యం పూర్తి కాలేదు.

దొర, "అడవికి నీ పెండ్లాన్ని తీసకపోతివో, నీ తల్లిని తీసకపోతివో నిన్నడి గిందెవరు? మా దొడ్లో మేకల్ను ఏంవి జేసినావు అజ్జెప్పు" అన్నాడు.

మన్నుగాడు చేతులు జోడించి, "యానాదోణ్ణి దొరా నాకు మేకలతో ఏం పని? ఉడతల్ను, కుందేళ్ళను సంపి పొట్ట పోసుకునేటోణ్ణి. మేకల కత నాకు తెలవదు దొర" అన్నాడు.

మణియం, "నీకు గాక పోతే ఇంగెవరికి తెలుస్తుందిరా. ఒగిటి గాదు, రెండు గాదు, పన్నెండు మేకలు కన్ను మూసి తెరిచేలోగా మాయమై పోయినాయి. ఇది యానాదోడు గాక ఇంకొకరు చేసే పనిగాదు. ఒక్కొక్కరే యానాది నా కొడుకులంతా ఊరిడ్సిపోయిరి. పీడ విరగడయిందనుకుంటే నువ్వొక్కడివి ఇంగా మిగిల్నావు?" అన్నాడు. క్రమక్రమంగా అతని కంఠంలో కర్కశత్వం చోటు చేసుకుంటూ ఉంది.

మన్నుగాడు దీనంగా, "యానాదోడై పుట్టడమే నా తప్పా దొరా" అన్నాడు.

మణియం. "యానాదోడై పుట్టడం నీ తప్పుగాదురా. ఆ తెల్లదొర మిమ్మ ల్నందర్నీ ఊర్లోకి తీసుకొచ్చినాడు జూడు వాడిది తప్పు. నిన్నింకా ఊర్లో ఉండనిచ్చినాను జూడు నాది తప్పు. మేకల్నేవి జేసినావురా అంటే పుటకలూ, జాతకాలు మాట్లాడతావేందిరా. మా మేకల్ను దీసుకొచ్చి మా దొడ్లో ఎప్పుడిడిసి పడ్తావు? అది మాట్లాడు" అన్నాడు.

మన్నుగాడు నూతిలో నుంచి వస్తున్నట్లున్న స్వరంతో, "నాకు తెలవదు దొర. నా పెండ్లాం బిడ్డల సాచ్చి దొర. మేకల కత నాకుతెలవదు. నువ్వెం గేఁవన్నా అడిగితే చెప్తా దొరా" అన్నాడు.

మణియం, "నిన్నింగేఁవన్నా అడిగేదేఁవుందిరా. నిన్నడగాల్సిందొక్కటే. నువ్వు ఊరిడిసి యాడన్నా అగ్గిబడు. యానాదోడు ఒక్క నలుసు ఊర్లో ఉన్న మా గొడ్డూ గోదా మాకు దక్కువు. మా పైరు, పచ్చా మాకు దక్కవు" అని పక్కకు తిరిగి, "ఒరె తలారోడా గురబ్బండిని బయటకు తియ్యరా" అన్నాడు.

మరి కాసేపటికి గుర్రపు బండి తయారయింది. తలారి వాడు బండి ముందు భాగాన కూర్చున్నాడు. బండిలోపల మణియం కూర్చున్నాడు. ఒక పొడుగాటి దారంతో మన్నుగాడి రెండు చేతులను మణికట్టుల వద్ద కట్టివేశారు. దారం రెండవ కొనను బండి వెనక భాగాన ముడివేశాడు.

తలారివాడు, "బండి యాడికి పోవాల దొరా" అన్నాడు.

మణియం, "నేరుగ పోలీసు స్టేషన్‌కు పోనీ" అన్నాడు.

ఆ మాట వినగానే మన్నుగాడు, "వొద్దు దొరా. నన్ను పోలీసోల్లకు అప్పగించొద్దు దొరా. వాళ్ళు నన్ను పులుసులోకి ఎఁనిక లేకుండా కొట్టే ..."

అతని మాట పూర్తి కాలేదు. ఇంతలో తలారివాడు గుర్రాన్ని అదిలించాడు. బండి కదిలింది. మన్నుగాడు తూలిపడబోయి తమాయించుకుని, దారం తనను లాగుతుండగా బండి వెంబడి నడవసాగాడు.

ఆ విధంగా ఊరు వదిలిన మన్నుగాడు రెండేండ్లకుగాని ఊర్లో అడుగు పెట్టలేదు. అతడు తిరిగి వచ్చేటప్పటికి యానాది మిట్ట రూపురేఖలు మారి పోయి ఉన్నాయి. యానాదులందరూ దేశద్రిమ్మరులనీ, వాళ్ళు జన్మతః నేర ప్రవృత్తిగల వారనీ, వాళ్ళకు పట్టా జేసిచ్చిన భూములను వాళ్ళు ఎప్పుడు సాగు చేయలేదనీ, భూములను వదిలిపెట్టి అడవులలోనే ఉంటున్నారనీ మణియం కలెక్టరుకు, ఇంకా పైఅధికారులకు తగినంత సాక్ష్యాధారాలతో నివేదించు కున్నాడు. యానాది మిట్టను చట్టబద్ధంగా కైవశం చేసుకున్నాడు.

చంద్రుడు ఆకాశంలో క్రమక్రమంగా పైకి వస్తుండగా జోబిడి తాలూకు నీడ మన్నుగాడి మీదకు కూడా వ్యాపించింది. నలభైయకరాల వరిపైరు బంగారు వన్నెను సంతరించుకున్న సముద్రంవలెనూ, కావలిజోబిడి ఆ సముద్రం మధ్యన ఒక దీవి వలెను అగుపిస్తున్నది. జోబిడి ముందు కూర్చుని ఉన్న మన్నుగాడు ఇరవై ఏండ్ల క్రితం సంఘటనలను మననం చేసుకుంటున్నాడు.

అతనికి దాదాపు కావలివాడు జోబిడి గుంజపక్కన నేలమీద వెల్లకిలపడి గుర్రుపెడుతున్నాడు.

వరిపొలం నుండి చిన్నోడు గట్టిగా అరచి, "నాయనా, నువ్వు గుర్తు పెట్టిన బొక్కలన్నీ తొవ్వేసినా. ఎలుకలు, వరికంకులు మస్తుగా దొరికినాయి." అని చెప్పాడు.

మన్నుగాడు గూడ గట్టిగా అరచి, "ఐతే ఇక వచ్చెయ్. ఎలుకల్నొక తట్టలో, వరికంకుల్నొక తట్టలో ఏసుకుని వచ్చెయ్. సగం రాతిరి దాటింది. ఇంటికి పోదాం" అన్నాడు.

మన్నుగాడు అరవడంతో కావలివాడికి మెలకువ వచ్చింది. అతడు లేచి కూర్చుని చుట్టూ చూసి, "నువ్వు ఇంగా ఈడనే ఉండావా? పని ముగించుకుని ఇల్లు చేరినావనుకుంటి" అన్నాడు.

మన్నుగాడు, "పని అయిపోయిందన్నా. ఇంగ యలబారదఁవనుకుంటా ఉండాం. నిన్నులేపి, నీతో ఒక మాట చెప్పకుండా మేం మాత్రం యట్ట పోతాఁవన్నా" అన్నాడు.

ఇంతలో చిన్నోడు రెండు తట్టలను, మూటు కుండలను, గునపాన్ని తెచ్చి జోబిడి వద్ద దించాడు. కావలివాడు కల్లు మైకం మూలాన వాలిపోతున్న కనురెప్పలను భారంగా ఎత్తి రెండు తట్టలలోకి చూసి, "ఓరి నీ యమ్మ!

ఒక తట్ట నిండ ఎలుకలు, ఒక తట్ట నిండ వడ్లు. ఒక వారం గాదు, రెండు వారాల దాక మీరు అన్నానికీ, కూరకు తడుఁవుకునే పనే లేదు" అన్నాడు.

చిన్నోడు సంతోషంతో పండ్లికిలిస్తూ, "ఎలుకలేగాదు. తట్ట అడుగున నాలుగు యంటవలు గూడ ఉండాయి. ఒక్కొక్కటి పంది పిల్లలంత ఉండాయి" అన్నాడు.

కావలివాడు మైకం ముంచుకొస్తుండగా మళ్ళీ పడుకుని, "ఇంగేఁవి ఇంటికి తీసుకుపోయి పండగ జేసుకోండి. కావాలంటే ఒక దుత్త కల్లు గూడ తీసుకుపోండి. ఆ మూలన రొండు దుత్తలుంటాయి. ఒక దుత్త తీసుకుపోండి" అని కండ్లు మూసుకుని నిద్రలోకి జారుకున్నాడు.

మన్నుగాడు, చిన్నోడు తమ కొరముట్లను, తట్టలను, కల్లు దుత్తను తీసుకుని బయలు దేరారు.

వాళ్ళిద్దరు ఒకరి వెనక ఒకరుగా గనిమల వెంబడి నడిచి, ఏరును దాటుకుని ఊరి వైపు నడవసాగారు.

యానాది మిట్ట పక్క పొలంలో కావలి ఉన్న రైతు ఒకసారి, "ఓ – హోయ్" అనరచాడు. అతనికి సమాధానంగా మరో పొలంలో ఉన్న రైతు, "ఓ– హోయ్" అనరచాడు. మణియంగారి పొలంలో ఉన్న కావలి వాడు మాత్రం సన్నగ గురక పెడుతూ జోబిడిలో వెల్లకిల పడిఉన్నాడు.

14

రాత్రి రెండవ జాము గడిచింది. బైరాగి గుడిసె ముందర ఊరు బయట చాపమీద పడుకుని నక్షత్రాల కేసి చూస్తున్నాడు. అడుగుల సవ్వడి విని అతడు పక్కకు చూశాడు. తండ్రికొడుకులిద్దరు బరువులు మోసుకుంటూ గుడిసె వద్దకు వచ్చారు.

మన్నుగాడు తన నెత్తిమీద, భుజం మీద ఉన్న సామానును దించి పెట్టి, "సగం రాత్రి దాటి పోయింది. ఇంగా నిద్రపోలేదా సాఁవి" అన్నాడు.

బైరాగి లేచి కూర్చుని, "నా నిద్దర కేమొచ్చె. ఇప్పటికి పదిసార్లు నిద్ర పోయినా. పదిసార్లు మేలకున్నా... ఈ వయసులో వచ్చేది కోడినిద్రేగదా" అన్నాడు.

మన్నుగాడు, "అట్టని తెల్సుంటే మాతో బాటు యానాది మిట్టకు తీసకపోయుందునే" అన్నాడు.

బైరాగి, "ఆడికొచ్చి నేను చేసే పని మాత్రం ఏముండాది. నాకు అసలే రేచీకట్లు. పొద్దుపోయినాక కూసున్న తావు నుంచి కదలాలంటే ఎవురన్నా చేయి పట్టుకుని నడిపించాల్సిందే" అన్నాడు.

మన్నుగాడు "నేను మాత్రం ఆడ చేసిందేఁవీ లేదు సాఁవి. కావలుండే మనిషి దగ్గర కూసోని రానీపోనీ మాటలు మాట్లాడతా ఉంటి. చేసే పనంత మన పిలగోడే చేసినాడు" అన్నాడు.

బైరాగి, "మీరు రాతిరంతా అట్టనే ఉండి తెల్లారినాక వస్తారనుకుంటి. ఇంత బిన్నె వస్తారనుకోలా" అన్నాడు.

మన్నుగాడు, "ఇంగెవడన్నా ఐతే తెల్లవారేదాకా తొవ్వుకుంటానే ఉందును. మన పిలగోడు గాబట్టి గెడిసేపిట్లో తొవ్వేసినాడు. నేను బొక్కలుండే తావులు జూపించి గునపం చేతికిచ్చినానంతే. పిలగాడు బొక్కలన్నీ పంది మాదిరి కూరాడేసినాడు" అన్నాడు.

బైరాగి తట్టలలోకి చూసి, "ఎలుకలు మస్తుగా దొరికినట్లుం డాయి. ఈ వడ్లు యాడివి? అన్నాడు.

మన్నుగాడు. "అవి బొక్కల్లోనే దొరికినాయి. ఎలుకలకు మనుషులకుండే తెలివి ఉంటుంది సాఁవి. వడ్లే కాదు. జామకాయలు, చింతకాయలు గూడా తీసకుపోయి దాచుకుంటాయి" అన్నాడు.

చిన్నోడు కల్లుదుత్తను దించి పెట్టి, "తాతా ఈ కల్లు దుత్త మాత్రం ఎలుక బొక్కల్లో దొరకలేదు" అని తానాడిన చతురోక్తికి తానే పకపక నవ్వాడు.

బైరాగి "కల్లుదుత్త ఏంది" అన్నాడు.

మన్నుగాడు, "మేఁ వొచ్చేటప్పుడు కావలిగాసేటాయన ఈ కల్లుదుత్త ఇచ్చి నాడు సాఁవి. ఎలుకలు, వడ్లు మస్తుగా దొరికినాయిగదా ఈ పూట పండగ జేసుకోమని చెప్పి యిచ్చినాడు" అన్నాడు.

చిన్నోడు, "ఔను తాతా, ఈ పూట మనం పండగ చేసుకోవాల, ఇన్ని వడ్లు నేనెప్పుడూ కండ్ల జూడలా కూరజేసుకునేదానికి తట్ట అడుగున నాలుగు యంటవలుండాయి" అని గుడ్లు తిప్పుతూ, "ఒకటీ, రెండూ గాదు, నాలుగు యంటవలుండాయి. ఒక్కొక్కటి పంది పిల్లలంతుండాయి. ఇక కల్లు దుత్త ఉండనే ఉండాది. మనం ఇప్పుడే పండగ జేసుకోవాల తాతా" అన్నాడు.

మన్నుగాడు, "నువ్వు తెల్లారే దాక ఆగేట్లు లేవు గదరా"

చిన్నోడు, తండ్రిని ఎదిరిస్తున్న స్వరంతో, "ఎందుకు ఆగాల" ఎలుకలు ఈడనే ఉండాయి. వడ్లు ఈడనే ఉండాయి. కల్లుదుత్త ఈడనే ఉండాది. ఇంగ తెల్లారెదాకెందుకు అగాల?" అన్నాడు.

మన్నుగాడు "ఇదీ సాఁవి ఈడి కత, తిండి దగ్గర ఒక్క చనం ఆగదు. బర్రెగొడ్డు కుడితి కాడికి ఉరికినట్టే" అన్నాడు.

బైరాగి బవిరి గడ్డం కదిలేలాగ నవ్వి, "మరి వాడినేఁవి జెయ్యమంటావన్నా. చేతి వేళ్ళకు వెన్న పూసి నాకకుండా ఉండమంటే యట్లుంటాడు?" అన్నాడు.

చిన్నోడు ఏదో సాధించినట్లు, "అట్ట చెప్పుతాతా. అట్ట జెప్పు?" అన్నాడు.

మన్నుగాడు అరచేతులు తిప్పి, "తాతా మనుముళ్ళది ఒకే మాట ఐనప్పుడు ఇంగ నేను చేసేదేఁవుండాది. ఇప్పుడే పండగ

జేసుకుందాం పట్టండి. ఒరె సిన్నోడా, ముందు నువ్వు వడ్లు రోట్లో ఏసి దంచు. నేను ఎలుకల కత జూస్తా" అన్నాడు.

ఆ మాట కోసమే ఎదురు చూస్తున్నట్టు చిన్నోడు వెంటనే పనిలోకి దిగాడు. తట్టలోని వడ్లను దోసిళ్ళతో తీసి రోట్లో పోసి దంచసాగాడు. వాడు రోటి చుట్టూ తిరుగుతూ, "ఏ బీబి – సో బీబి" అని రాగం తీస్తూ, బలమైన చేతులతో దంచుతుండగా వడ్లు బియ్యంగా మారసాగాయి. వాడు ఆ బియ్యాన్ని నీటిలో కడిగి ఒక మట్టి పాత్రలో పోశాడు.

మన్నుగాడు తట్టలోనుంచి ఎలుకలను ఒక్కొక్కదాన్నే తీసి తోకలను కోసి వేశాడు. ఆ తోకలన్నిటిని కట్టగట్టి గుడిసెలో ఒక కుండలో దాచి పెట్టాడు. ఎలుకలను కోసీ ప్రేవులను తీసి వేశాడు. మిగిలిన శరీరాలను ముక్కలు ముక్కలుగా కోసి, ఆ ముక్కలకు ఉప్పు, పసుపు, కారం పట్టించాడు. ఆ ముక్కలన్నిటినీ సన్నటి దారానికి గుచ్చి, గుడిసె వెనక తోరణం లాగ వ్రేలాడదీశాడు. చిన్నవిగా ఉన్న ఎలుక పిల్లలను రాజి ముందు పడేశాడు. ఆఖరున తట్ట అడుగున నాలుగు యంటవలను తీసి ముక్కలు కోసి ఒక మట్టి పాత్రలో వేశాడు.

ఈ లోగా బైరాగి వెన్నెలలో తారాడుతూ వెదికి రాళ్ళను తెచ్చి గుడిసె ముందర రెండు పొయ్యిలు అమర్చాడు. పొయ్యిలో ఎండు పుల్లలను, ఎండుటాకులను వేసి రగిల్చాడు. మట్టి పాత్రలు పొయ్యిల మీదికెక్కాయి.

వాళ్ళు ముగ్గురు మండుతున్న పొయ్యిల చుట్టూ కూర్చున్నారు. అల్లంత దూరాన రాజి కడుపును నేలకు ఆనించి ఎలుక పిల్లలను చీల్చి తింటున్నది.

మన్నుగాడు కల్లుదుత్తను దగ్గరకు లాక్కుని, ముంతను నింపి, బైరాగికి అందించి, "నువ్వు బోణీ చెయ్యి సాఁవి" అన్నాడు.

బైరాగి తన నోటికడ్డంగా ఉన్న మీసాలను పక్కకు తోసి, గుక్కెడు తాగి, "బాగ పులిసిపోయింది గదన్నా. ఇది దినమంతా ఎండలో ఉండినట్లుంది" అన్నాడు.

మన్నుగాడు, "తాగితే పులిసిపోయిన కల్లే తాగాలి సాఁవి. అప్పుడే దించిన కల్లు ఈ పాయకట్టులో ఆడవాళ్ళు కూడా తాగరు" అన్నాడు.

బైరాగి ముంతను ఖాళీ చేశాడు. మన్నుగాడు తానొక ముంతెడు వంచుకుని తాగి, లొట్టవేసి పెదాలకు అంటుకుని ఉన్న కల్లు చుక్కలను తుడుచుకున్నాడు. చిన్నోడు తండ్రి చేతి నుండి ముంతను లాక్కుని, కల్లు వంచుకుని తలపైకెత్తి, పీకపైకి కిందకు ఆడుతుండగా గటగట తాగాడు. ముంతను కింద బెట్టి, "ఏఁవి కమ్మగా ఉంది నాయనా. కావిలాయన జోబిడిలో ఇంగా ఒక దుత్త ఉండాది. అదిగూడా తెచ్చుకోనుంటే బాగుండు." అన్నాడు.

మట్టి పాత్రలలో అన్నము, కూర ఉడుకుతున్నాయి. పొయ్యిలో నుండి పొగలు, పాత్రల నుండి ఆవిరి సన్నగా పైకి లేస్తున్నాయి. ఈ అపరాత్రివేళ చెట్టుకింద పొగలు లేస్తుండడం గమనించి కొమ్మల మీద నిద్రిస్తుండిన కాకులు కొన్ని లేచి, కావుకావుమని కాసేపు అరిచి, మళ్ళీ నిద్రలోకి జారుకున్నాయి.

కల్లు ముంత ఆ ముగ్గిరి మధ్య ఒకరి చేతుల నుండి ఒకరి చేతులలోకి మారుతూ వుంది. క్రమంగా దుత్తలో కల్లు మట్టం తగ్గుతూ ఉంది. వాళ్ళ ముగ్గురి కడుపులలో కల్లు వెచ్చగ కుదురుకుంటున్నది. వాళ్ళ నాలుకలు, కాళ్ళు, చేతులు

తిమ్మిరెక్కుతున్నాయి. వాళ్ళ కంఠస్వరాలు, మాటలు, చేష్టలు క్రమక్రమంగా మారసాగాయి.

చిన్నోడు మాటిమాటికి మోకాళ్ళ మీద మోచేతుల మీద వంగి ఉడుకుతున్న పాత్రలలోకి చూస్తూ పండ్లికిలించసాగాడు.

బైరాగి, "గెడికొకసారి తొంగి చూస్తే ఏఁవి కనిపిస్తుందిరా పిలగా, అవి పూరా ఉడికేదాక నీకు ఉచ్చ ఆగేట్టులేదు గదరా" అన్నాడు.

మన్నుగాడు, "వాడు ఆగడు సాఁవి ఎప్పుడూ అంతే, అన్నం ఉడకతా ఉంటే వాడు ఆవు పలఁవైతే ఇడుగులాడినట్టు ఇడుగులాడతాడు" అన్నాడు.

చిన్నోడు "ఆవు పలఁవైతే ఇడుగులాడేది నేను గాదు తాతా. కోడె ఇడుగులాడుతుంది" అని పకపక నవ్వాడు. అలా నవ్వుతూనే మళ్ళీ అరచేతుల మీద, మోకాళ్ళ మీద వంగి పాత్రలోకి తొంగి చూడసాగాడు.

మన్నుగాడు, "ఇంగవాడు మనలోకంలోకి రాడు సాఁవి. అన్నమూ, కూర పొయ్యి మీదనుంచి దిగేదాక వానిలోకం అట్టనే ఉంటుంది. అంతదాక మనం గుక్కిళ్ళు మింగతా కూసునేదెందుకు? నువ్వేదైనా ఒక కత సెప్పు సాఁవి" అన్నాడు.

చిన్నోడు, "ఔ తాతా. నువ్వు కత జెప్పు. కత ఎందుకు. ఒక పాట పాడు. తంబూర పట్టుకుని ఈదుల్దిరగతావు గద. ఒక మంచి పాట పాడు" అన్నాడు.

బైరాగి "ఎందుకు పాడను. తప్పకుండా పాడతాను. అడ్డమైన లంజలు, లంజకొడుకులూ అడిగితే పాడేటోణ్ణి. నా మనమడు

అడిగితే పాడనా. తంబూర తెచ్చుకుంటానుండు" అని పైకి లేవబోయాఁడు.

చిన్నోడు అతని భుజం మీద చేయి వేసి కూర్చోబెడుతూ, "నువ్వు కూసో తాతా. అసలే రేచీకట్లంటివి. తంబూరను నేను తెస్తా" అని లేచి తూలుకుంటూ గుడిసెలోకి వెళ్ళి తంబూరను తెచ్చి ఇచ్చాడు.

బైరాగి బాసింపట్ట వేసుకుని తంబూరను మీటుతూ పాడసాగాడు.

"చేనెట్ల గాతు

దేవా

చేనెట్ల గాతు"

పొయ్యిలో ఎండు పుల్లలు చిటపటమని చప్పుడు చేస్తూ కాలుతున్నాయి. తండ్రి కొడుకులిద్దరు అసలే కల్లుమైకం వల్ల నిలకడగా లేని తలలను ఊపుతూ, తొడల మీద తాళం వేయసాగారు. రాజి ఎలుకలను చీల్చడం మాని మోరెత్తి తంబూరను తదేకంగా చూడసాగింది.

వెన్నెలలో సుదూరాన కనిపిస్తున్న కొండలను చూస్తూ బైరాగి పాడు తున్నాడు. అతడు గత ముప్పై సంవత్సరాలుగా సాగిస్తున్న అన్వేషణ, అన్వే షణలోని జయాపజయాలు ఆ పాటలో దాగి ఉన్నాయి.

"ఓ దేవా ఈ చేనును ఎలా కాపాడుకొనగలను.

పరమాత్మవైన నీలో లీనమయ్యేదాక ఈ ఆత్మను ఎలా కాపాడుకొనగలను.

నా ఆత్మ అనే ఈ చేను ఎన్నో ఆటుపోటులకు

గురవుతూ ఉంది

ఓ దేవా ఈ చేనును ఎలా కాపాడుకొనగలను.

భార్య, పిల్లలు నే పిచ్చుకలు, చిలుకల చేను మీద వాలు తున్నాయి.

ఓ దేవా ఈ చేనును ఎలా కాపాడుకొనగలను.

కామక్రోధాలనే ఎలుకలు, ఏదుపందులు

నా చేనును నాశనం చేస్తున్నాయి.

ఓ దేవా ఈ చేనును ఎలా కాపాడుకోగలను.

మోహము, భ్రాంతి అనే పొగమంచు చేమను కమ్ముతున్నది.

ఓ దేవా ఈ చేనును ఎలా కాపాడుకొనగలను.

సిరులు, సంపదలు అనే కీటకాలు నా

చేనును కొరికి వేస్తున్నాయి.

ఓ దేవా! ఈ చేనును ఎలా కాపాడుకోగలను.

ఓ దేవా! పరమాత్మవైన నీలో లీనమయ్యే

నా ఆత్మను ఎలా కాపాడుకోగలను"

బైరాగి పాటను ముగించి తంబుర కింద బెట్టాడు. కల్లు దుత్త ఖాళీ అయింది. చిన్నోడు చివరిసారిగ ముంతను పైకెత్తి తాగి. "దుత్త ఖాళీ అయిపోయింది. తాత బోణీ చేసినాడు. మనవడు ఆఖరు చుక్క తాగినాడు" అని దుత్తలోకి తొంగి చూసి, దానిని ఎత్తి బోర్లించాడు.

మన్నుగాడు, "ఏంవి పాట పాడినావు సాంవి. ఏడుపు పాట. మనం పండగ జేసుకుంటా ఉండాంవా? లేకుంటే ఎవురన్నా చస్తే

పూడ్చి పెట్టి వొప్పారి పాడతా ఉండాంవా?" అని కొడుకు వైపు తిరిగి, "ఒరె సిన్నోడా, నువ్వొక కుశాల పాట పాడరా. పోయిన్నెల బుచ్చిమాంవ పెండ్లికాడ పాడినావు జూడు. ఆ పాటపాడు" అన్నాడు.

చిన్నోడు. "పాడటంవేంది! ఆడనుగూడ ఆడతా. నువ్వీ దుత్త మీద దరువెయ్యి తాతా" అని ఖాళీ దుత్తను బైరాగి ముందుకు జరిపి, లేచి నిల్చున్నాడు. వాడు నిక్కరును బిగించి కట్టుకుని, అడుగులేస్తూ, చేతులు తిప్పుతూ, పొయ్యి చుట్టూ తిరుగుతూ పాడసాగాడు.

"సీమ దాన్నీ బూమిదాన్నోరయ్య

సీమ గొల్లోల్ల చిన్నదాన్నీ ...

... ... "

చిన్నోడు పాడిన చరణాన్నే పాడుతుండడం గమనించి మన్నుగాడు గబుక్కున లేచి, "పాడిన నుడుగే పాడతా ఉండావేందిరా పిల్ల నాకొడకా" అని చిన్నోడి పిర్రపైన ఒక తన్ను తన్ని "పాట నేను పాడతాను. నువ్వు వంతపాడు. నువ్వు దరువెయ్యి సాంవి. మనం పాట పాడితే దుమ్ములేచిపోవాల" అన్నాడు. అతడు తలపాగాను. గోచెను బిగించి కట్టుకుని పొయ్యిల చుట్టూ లయబద్ధంగా ఎగురుతూ పాడసాగాడు. చిన్నోడు వంతపాడుతూ తండ్రి వెంబడి ఎగరసాగాడు.

"సీమ దాన్నీ బూమి దాన్నోరయ్య

సీమ గొల్లోల్ల సిన్నదాన్ని.

తూరుపు సీమ దాన్నోరయ్య

తూరుపు సీమ దాన్నోరయ్య
తూరుపు సీమ దాన్నోరయ్య
తుమ్మి పూల రైకదాన్ని ॥సీమదాన్నీ॥

పడమర సీమ దాన్నోరయ్య
పడమర సీమదాన్నోరయ్య
పత్తిపూల చాయదాన్ని ॥సీమదాన్నీ॥

ఉత్తరాది సీమదాన్నోరయ్య
ఉత్తరాది సీమదాన్నోరయ్య
ఉల్లిపూల చీరదాన్ని ॥సీమదాన్నీ॥

దచ్చినాది సీమ దాన్నోరయ్య
దచ్చినాది సీమ దాన్నోరయ్య
దామర పూల కళ్ళదాన్నీ ॥సీమదాన్నీ॥

ఆ తండ్రి కొడుకులు పాటపాడుతూ, పొయ్యిల చుట్టూ తిరుగుతూ, నాట్యం చేస్తుండగా వాళ్ళ పాదాల తాకిడికి దుమ్ము మేఘం వలె మోకాటెత్తు లేచింది. బైరాగి భుజాలెగరేసుకుంటూ దుత్త మీద దరువేస్తున్నాడు. రాజి ఎలుకలను చీల్చడం మానేసి,

తోక ఆడిస్తూ ఆ ముగ్గురినీ మార్చి మార్చి చూడసాగింది.

చింత చెట్టు కింద జరుగుతున్న సందడి విని కొమ్మల మీదున్న కాకులు నిద్రలేచి, కింది కొమ్మల నుంచి పై కొమ్మలకు, అక్కడ నుంచి ఇంకా పై కొమ్మలకు చేరాయి. కొన్ని కాకులు కావు కావుమని అరుస్తూ చెట్టును వదలి దూరంగా ఉన్న చెట్లపై వాలాయి.

మేఘ రహితమైన ఆకాశం చింత చెట్టుకింద సందడి చేస్తున్న వాళ్ళ మనసుల వలె నిర్మలంగా ఉన్నది. వాళ్ళ ముగ్గురి మనసుల నుండి ఉబుకుతున్న ఆనందం వలె చంద్రుని నుండి వెన్నెల ఉబుకుతున్నది.

ఊరి చివరన కుక్కి మంచం పైన పడుకుని ఉన్న ఒక రైతుకు మెలకువ వచ్చింది. అతడు లేచి మంచం మీద కూర్చుని, కాసేపు చెవివొగ్గి విని. “ఏఁవయిందీ యానాదోళ్ళకు? పిచ్చి కుక్క కరిచిందా యట్ట? ఊర్లో వాళ్ళను నిద్దర పోనీకుండా రచ్చజేస్తా ఉండారు”. అని సణుక్కుంటూ మళ్ళీ పడుకున్నాడు. బాటకవతల పొలం వద్ద కావలి ఉన్న రైతుకు మెలకువ వచ్చింది. అతడు లేచి మునిగాళ్ళపైన నిక్కి చూసి, “యానాదోళ్ళకు యాడనో లిబ్బి దొరికినట్టుంది. పాముల పుట్ట తొవ్వతా ఉంటె లంకె బిందెలు దొరికినయేఁవో. పట్టపగ్గాల్లేకుండా ఉండారు” అని విసుక్కుంటూ మళ్ళీ పడుకున్నాడు. అనుభవంలేని కోడి పుంజులు ఊరి బయట నుండి, అపరాత్రివేళ వినిపిస్తున్న సందడికి దిక్కుతోచక “కొక్కరోకో” అని కూయసాగాయి.

చింత చెట్టు కింద ముగ్గురూ పిచ్చి పట్టినట్లు అర్థరహితంగానూ, నిధి దొరికినట్లు సంతోషంగానూ ఎగురుతూ సందడి చేస్తున్నారు. క్రమక్రమంగా తండ్రి కొడుకులు అలసి

పోతున్నారు. వాళ్ళ కాళ్ళ చేతుల కదలికలు ఎప్పుడో లయతప్పాయి. వాళ్ళ శరీరాల మీద సన్నగ చెమటలు పడుతున్నాయి. వాళ్ళ గొంతులు రాచిపోతున్నాయి. బైరాగి భుజాలు, దండలు నొప్పి పెడుతున్నాయి. రాజి మందకొడిగా తోకను ఆడించసాగింది. పొయ్యిలలో మంటలు అణగారిపోయాయి. నిప్పుకణికలు మాత్రం నిగనిగలాడుతున్నాయి.

చిన్నోడు తన నృత్యాన్ని అకస్మాత్తుగ ఆపి, "నాయనా మాడు వాసన వస్తుంది" అన్నాడు.

మన్నుగాడు పొయ్యి ముందర కూర్చుని, రెండు మెతుకులను పట్టి చూసి, "సమయానికి గేపకం చేసి పుణ్యం కట్టుకున్నావురా సిన్నోడా. అన్నం మాడిపోలేదుగాని, చిమిడి పోవడం మొదలు పెట్టింది" అన్నాడు. అతడు అన్నం పాత్రను, కూర పాత్రను కిందకు దించి పెట్టాడు.

చిన్నోడు కడుపు మీద రుద్దుకుంటూ, ఆవిర్లు కక్కుతున్న పాత్రలవైపు చూడసాగాడు.

మన్నుగాడు కొడుకువైపు చూసి, "ఒంటికాలు మీద నిల్చుకోనుండావు గదరా. ఇదంతా తినబోయేది మనమే. పత్తి కొండ నుంచి దొంగలొచ్చి తినబొయ్యేది లేదు. ఇవి కొంచెం సల్లారేదాక ఆగు" అన్నాడు.

చిన్నోడు అలాగే పొట్ట మీద రుద్దుకుంటూ, "ఉడుకుడుగ్గా తింటేనే బాగుంటుంది. ఇస్తరాకులు గూడా తయారుగా ఉండాయి. ఇప్పుడే తిందాం" అన్నాడు.

మన్నుగాడు, "సరె ఇస్తరాకుల్ను తెచ్చి అట్టకూసో" అన్నాడు.

అన్నం పాత్రను, కూరపాత్రను మధ్యలో ఉంచుకుని, వాటి చుట్టూ వాళ్ళు ముగ్గురూ కూర్చున్నారు. ఎవరికి వారు వడ్డించుకుని ఆవురావురుమని తిన సాగారు. ఎముకలను రాజీ వైపు గిరవాటు పెడుతున్నారు. రాజి ఎముకలను గాలిలోనే నోటితో పట్టుకుని, పటపట కొరుకుతూ, తోక ఆడించుకుంటూ తింటున్నది.

బైరాగి తలవంచుకుని, అందరికన్న మెల్లగ తింటున్నాడు. కొంత సేపటికి అతని కండ్ల నుంచి నీరు కారడం గమనించి మన్నుగాడు, "ఏంది సాఁవి. కూరలో కారం జాస్తయిందా?" అనడిగాడు.

బైరాగి ఉలిక్కిపడినట్లు తలెత్తి, "కారం జాస్తి లేదన్నా. ఏదో జ్ఞాపకం వచ్చింది" అని ఎడమ చేత్తో కళ్ళు తుడుచుకుని, "నాకీ పూట కొత్తగా జన్మ ఎత్తి నట్టుందన్నా. ఒక నరమానవుని పక్కన కూర్చుని, ఇస్తరాకులో అన్నం పెట్టుకుని తిని ముప్పై ఏండ్లయిందన్నా, రెండ్రోజులది, మూడు రోజులది సల్లటి అన్నం తినటమే గాని పొయ్యి మీద నుంచి దించి ఉడుకుడుగ్గా తినింది లేదన్నా" అన్నాడు.

చిన్నోడు అన్నం వడేసి నములుతూ, "ఐతే ఇంగేఁవి. మాతోనే ఉండిపో తాతా. రోజూ మనం ఇట్లే తిందాం. పొయ్యి మీద నుంచి దించి, ఇస్తరాకుల్లో ఏసుకుని ఉడుకుడుగ్గా తిందాం. ఇంగ నువ్వు ఉండిపో తాతా" అన్నాడు.

మన్నుగాడు "ఆ మాట పొద్దునే అనుకుంటిమి గదా. ఇంగ నువ్వు దేశాల్దిరిగేదేఁ విటికి? మాతోనే ఉండిపో" అన్నాడు.

బైరాగి మెల్లగ తల వంచి, "ఈ పొద్దంతా ఆ మాటే ఆలోచించినానన్నా. ఇంగ ఇట్టనే ఉండిపోదాఁమనే మనసు జేసుకున్నా.

ఐతే తిండి కోసం కాదన్నా" అని చిన్నోడి వైపు చూస్తూ, "ఎన్నాళ్ళు బతికినా గుంత బాకీ తీరాల్సిందే. ఆ బాకీ తీర్చాల్సిన దినం దగ్గరపడతా ఉంది. నేను సచ్చినాక నా గుంతమీద మన్నేసేదానికి ఒక మనవడు దొరికినాడు. ఈ పొద్దిటి నుంచి ఈ గుడిసే నా యిల్లు" అన్నాడు.

పాత్రలు రెండూ ఖాళీ అయిపోయాయి. వాళ్ళు ముగ్గురు విస్తర్లను మడిచి, బ్రేవ్‌మని త్రేన్చుతూ పైకిలేచారు. విస్తర్లను దాపున ఉన్న జిల్లేడు పొదలో పారవేసి, పెరట్లో కెళ్ళి చేతులు కడుకున్నారు.

అలసట వల్ల, భుక్తాయాసం వల్ల, కల్లు మైకం వల్ల చిన్నోడు చేయి కడుకున్నదే తడవుగా చాప పరచుకుని పడుకున్నాడు. పడుకున్న కాసేపటికి అతడు గుర్రు పెట్టడం ప్రారంభించాడు. మన్నుగాడు, బైరాగి పాత్రలను కడిగి, గుడిసెలో పెట్టి చిన్నోడికి చెరొక వైపున పడుకున్నారు. ఒకరి వెనుక ఒకరుగా వాళ్ళిద్దరు నిద్రలోకి జారుకున్నారు. రాజి మిణుగురు పురుగులను చెదరగొడుతూ, ఇస్తరాకులను చింపుతూ, జిల్లేడు పొదలో కాసేపు గడిపింది. తరవాత చెవుల టపటప కొట్టుకుంటూ వచ్చి ఆ ముగ్గురి కాళ్ళ వద్ద ముడుచుకుంది.

చంద్రుడు నిర్విరామంగా వెన్నెలను కుమ్మరిస్తూ, ఆకాశంలో పడమటి వాలున జారుతున్నాడు. క్రమక్రమంగా తూర్పున వేగుచుక్క పుట్టింది.

15

యానాది మిట్ట మీద కావలి జోబిడి వెన్నెలలో ముడుచుకుని ఉంది. కావలి వాడు లేచి, జోబిడి బయటకొచ్చి, నాలుగడుగులు వేసి, నిలబడే మూత్ర విసర్జన చేశాడు. అతడలా నిలబడి తూర్పు ఆకాశాన వేగుచుక్క పుట్టి ఉండడం గమనించాడు. "తెల్లవార డానికి ఇంకా చాలా సమయముంది. ఈ లోగా ఇంకొక కునుకు తియ్యొచ్చు" అనుకున్నాడు. అతడు వెనుదిరిగి జోబిడిలోకి నడుస్తూ, వెన్నెలలో బంగారు రంగును సంతరించుకున్న సముద్రం వలె ఉన్న వరి పంటను ఒకసారి కలియజూశాడు. అలా చూస్తూ గతుక్కుమన్నాడు. నడుము చుట్టూ ఊడిపోతున్న పంచెను సైతం లెక్కజేయకుండా ఎక్కుపెట్టి విడిచిన అమ్ము వలె వరిపొలం మధ్యకు పరుగెత్తాడు.

రాత్రి పొలంలో దొంగలు పడ్డారు. దాదాపు అర ఎకరా మేర వరికంకులన్నీ మాయమై ఉన్నాయి. కంకులు లేక బోసిగా ఉన్న వరికాడలతో మూడు ఎకరాల మేర పొలం పేనుగొరిగిన తలవలె కనిపిస్తున్నది. 'ఒకడు కాదు. ఇద్దరు కాదు. కనీసం పదిమంది చేసిన పని యిది. కల్లు మైకంలో నిద్రమైకంలో నేను జోబిడిలో పడి ఉండగా ఈ పని జరిగింది. యానాది మిట్టన దొంగతనం జరగడం ఇదే మొదటిసారి'. ఈ ఆలోచనలతో కావలి వాని శరీరం ఆపాదమస్తకం గడగడ వణికింది. అతడు అసంకల్పితంగా నడుం చుట్టూ పంచెను కట్టుకుంటూ గనిమల వెంబడి పరుగు ప్రారంభించాడు. అతడు ఏటిలోకి దిగి, ప్రవాహాన్ని దాటుకుని, అవతలి గట్టెక్కి గ్రామం వేపు దూసుకుపోసాగాడు.

అతడు మణియం గారి భవంతిని చేరేటప్పటికి తూలి పడిపోయేటంతగా అలసిపోయి ఉన్నాడు. అతడు భవంతి ముందర అరుగుమీద నిద్రిస్తున్న ఒక జీతగాడిని లేపి. "ఒరే ఎంకటీ, దొరను పిలవాలరా" అన్నాడు.

జీతగాడు లేచి కళ్ళు నులుంకుంటూ, "దొరను పిలవాల్నా? ఇంతరాత్రిలోనా? ఏఁవిటికి?" అన్నాడు.

కావలివాడు, "కొంపమునిగిపోయిందిరా. తచ్చనం దొరతో మాట్లాడాల. యానాది మిట్టన దొంగలు పడినార్రా" అన్నాడు.

జీతగాడు కళ్ళు నులుముకోవడం అకస్మాత్తుగ ఆపి, తల విదిలించి, "దొంగలా? యానాది మిట్టన్నా? ఏఁవి ఎత్తక పోయినారు?" అన్నాడు.

కావలివాడు అసహనంగా, "అన్నీ నేను చెప్పుకుంటా. నువు దొరను లేపరా" అన్నాడు.

జీతగాడు తలుపు తోసుకుని లోపలికెళ్ళాడు. మరికాసేపటికి మణియం బయటికొచ్చాడు. అతని కండ్లు నిద్రాభారంతో ఉబ్బి ఉన్నాయి.

మణియం బయటకు రాగానే కావలివాడు, "దండాలు దొరా" అన్నాడు.

మణియం కనురెప్పలను భారంగా పైకెత్తి, "ఏఁవయిందిరా యానాది మిట్టనా?" అన్నాడు.

కావలివాడు చేతులు జోడించి, "వరికంకులు మాయమైనాయి దొరా. అర ఎకరా దాక కంకులు మాయమైనాయి దొర" అన్నాడు.

మణియం నిద్రమత్తు ధ్వనిస్తున్న కంఠంతో, "ఎలుకలు సందులేకుండా తిరగతా ఉండాయి గదా. అవి కొట్టేసినాయేఁవో" అన్నాడు.

కావలివాడు, "అది ఎలుకలు చేసిన పని కాదు దొరా. దొంగలు పడినారు దొరా" అన్నాడు.

మరుక్షణమే కావలివాడి చెంప చెళ్లుమన్నది. మణియంగారి కళ్ళలో నిద్రమత్తు మాయమయింది. ఆ కళ్ళలో రౌద్రం చోటు చేసుకుంది. అతడు కావలివాడిని చురచుర చూస్తూ, "దొంగతనమా? యానాది మిట్టన దొంగతనమా? ఆ మాట ఇంగొక సారి అన్నావంటే నరికి పాతి పెట్టేస్తాను" అన్నాడు.

కావలివాడు మోకాళ్ళమీద కూర్చుని, నెత్తిమీద చేతులు జోడించి, "నేన్జెప్పింది నిజందొరా. అర ఎకరా దాక ఒక్క వరికంకిలేకుండా మాయమైనాయి. అది ఎలుకలు జేసే పనికాదు దొరా" అన్నాడు.

మణియం నిశ్శబ్దంగా కావలివానివైపు చూడసాగాడు. అతని కళ్ళలో క్రమంగా రౌద్రం పోయి, అవమానం చోటు చేసుకుంది. అతడు తల వంచుకుని, "మరి రాత్రంతా నువ్వు యాడ సచ్చుంటివి?" అన్నాడు.

కావలివాడు, "రాత్రంతా జోబిడిలోనే ఉంటిని దొరా. జోబిడి యిడిసి ఒక చనం గూడా యాడికీ పోలేదు దొరా. అర్ధరాత్రయినాక కొంచెం కన్నుమూసినా. అర్ధరాత్రి దాక యానాదోనితో మాట్లాడతా ఉంటి" అన్నాడు.

మణియం, "యానాదోడు" అని ప్రారంభించి ఏదో చెప్పబోయి ఆగిపోయాడు.

కావలివాడు, "ఔను దొరా యానాదోడు సందేళకాడొచ్చి సంగం రాత్రిదాక నాతోనే ఉండినాడు. వాడిని నువ్వే పంపితివి గద దొరా" అన్నాడు.

మణియం పక్కనున్న వాళ్ళకు వినిపించేలాగ పండ్లు పటపట కొరికి, "నేనే పంపినా. నేను వాడిని ఎలుక బొక్కలు తొవ్వమని పంపినా. వాడి గుంతను తొవ్వుకోమని పంపలేదు" అని పక్కకు తిరిగి, "యంకటి, గుర్రాన్ని బయటకు తీసుకురారా" అని అరిచాడు.

జీతగాడు పరుగున వెళ్ళి కొట్టంలోనుంచి గుర్రాన్ని బయటకు తీసుకొచ్చాడు. మణియం చెంగున గెంతి దాని వీపు మీద కూర్చుని, గుది కాళ్ళతో దాని డొక్కల్లో పొడిచాడు. గుర్రం పరుగు ప్రారంభించింది. కావలివాడు, జీతగాడు గుర్రం వెంబడి పరుగెత్తసాగారు. గుర్రం వెన్నెలలో తన కాలిగిట్టలతో ధూళి మేఘాలను రేపుతూ, మలుపులు తిరుగుతూ వీధుల వెంబడి పరుగెడుతూ ఉంది.

ఒక ఇంటి ముందు వీధి అరుగు మీద నిద్రిస్తుండిన రైతు గుర్రపు డెక్కల చప్పుడు విని, లేచి కూర్చున్నాడు. వీధి వెంబడి పరుగెడుతున్న జీతగాడిని ఆపి, "ఏఁవయిందిరా. ఇంతరాతిర్లో దొర గుర్రఁవేసుకుని పోతా ఉండాడేందిరా?" అనడిగాడు.

జీతగాడు గసపోసుకుంటూ ఆగి, చేతులు తిప్పుకుంటూ, "యానాది మిట్టన దొంగలు పడినారంట వరిపైరు అర ఎకరా కోసుకుపోయినారంట" అన్నాడు.

రైతు, "దొంగలు పడినారా? యానాది మిట్టలోనా?" అని తల, చేతులు అడ్డంగా ఊపి, "ఐపోయింది. ఆ పనికి పాలుమాలిన వాడెవడోగాని వాని పెండ్లాం మెడలో తాడు ఈ పొద్దు తెగిపోతుంది" అని, ముసుగు పెట్టి పడుకున్నాడు.

16

గుర్రం చింతచెట్టు నీడలో ఆగింది. గుడిసె ముందర వెన్నెలలో మన్ను గాడు బైరాగి, వాళ్ళిద్దరి మధ్య చిన్నోడు పడుకుని ఆదమరచి నిద్రిస్తున్నారు. వాళ్ళ కాళ్ళ దగ్గర రాజి ముడుచుకుని పడుకుని ఉంది.

చెట్టు నీడలో గుర్రపు ఉనికిని గ్రహించి రాజి లేచి నిలబడింది. అది గుర్రానికి అభిముఖంగా నిలబడి "భౌ – భౌ" మని ఏకధాటిగా మొరగడం ప్రారంభించింది. దాని అరుపులు విని మొదట మన్నుగాడు, తరవాత బైరాగి, ఆఖరున చిన్నోడు నిద్రలేచారు.

మన్నుగాడు చాపమీద కూర్చుని, చెట్టుకింద నీడలో ఉన్న ఆకారాన్ని చూస్తే "ఎవురక్కడ?" అన్నాడు.

గుర్రం నాలుగడుగులు వేసి వెన్నెలలోకి వచ్చి నిలబడింది.

మన్నుగాడు గబగబ లేచి నిలబడి, "నువ్వా దొరా. దండాలు" అన్నాడు. రాజి మొరగడం ఆపి తన యజమాని కాళ్ళ వద్దకొచ్చి నిలబడింది.

మన్నుగాడు చేతులు కట్టుకుని, "ఇంతరాతిరికాడ వచ్చినా వేంది దొరా" అన్నాడు.

మణియం, "రాతిరి నువ్వు చేసిన పనేందో తెల్సుకుందామని వచ్చినా" అన్నాడు.

మన్నుగాడు పండ్లన్నీ కనిపించేలా నవ్వుతూ, "ఎలుకలన్నిటినీ పట్టేసినా దొరా. మూటుపెట్టి, ఊదరపెట్టి ఒక్క ఎలుకగూడా మిగలకుండా పట్టేసినా దొర. యానాది మిట్టన ఇప్పుడు ఇత్తనానికి గూడ ఒక ఎలుక లేదు దొరా. తోకలన్నీ కోసి, కట్టగట్టి దాచి పెట్టినా. చూపిస్తానుండు" అని వెనుదిరిగి గుడిసెలోకి పోబోయాడు.

మణియం, "ఆగు!" అని గట్టిగా అరచాడు. మన్నుగాడు ఆగి వెనుదిరిగి చూశాడు. మణియం ముఖ కవళికలు పూర్తిగా మారిపోయి ఉన్నాయి. అతని కళ్ళు ఎర్రదనాన్ని మసకకాంతిలో లీలగా కనిపిస్తోంది. ఆ ముఖ కవళికలను, కళ్ళ ఎర్రదనాన్ని చూసి మన్నుగాని ముఖంలో నవ్వు గబుక్కున మాయ మయింది. మణియంగారి ముఖంలో వస్తున్న మార్పులకు స్పందిస్తూ రాజి మళ్ళీ మొరగడం ప్రారంభించింది.

మణియం "నువ్వు తోకల్నేగాదు, తలకాయల్నుగూడా కోసే వాడివని నాకు దెలుసు. ఎలుకల్ను పట్టినాక నువ్వు యానాది మిట్టన ఏంవిజేసినావు. అజ్జెప్పు" అన్నాడు.

మన్నుగాడు అమాయకంగా చూస్తూ "ఏంవి చేసినాను దొర. ఎలుకల్ను తట్టలో ఏసుకుని నేరుగ వచ్చి గుడిసె చేరుకున్నా" అన్నాడు.

మణియం "ఒరె యానాదోడా. ఈ నంగి మాటలు కట్టిపెట్టు. చేసిన పని ఒప్పుకుంటే ఇంగా నాలుగుదినాలు బూమ్మీద తిరగతావు. లేకుంటే పులు సులోకి ఎంవికి లేకుండా అయిపోతావు" అన్నాడు.

మన్నుగాడు అలాగే అమాయకంగా, అయోమయంగా చూస్తూ, "నన్నేంవి జెప్పమంటావు దొరా. నువ్వడిగేది నాకేంవీ గోచిరానికి రావటం లేదు దొరా" అన్నాడు.

మణియం "ఏంవి తెలవనట్టు మాట్లాడతా ఉండావుగదరా. సరె, అంతా యిలావరిగా చెప్తా. ముందా కుక్కను కట్టెయ్" అన్నాడు.

మన్నుగాడు కదలకుండా ఉండడం గమనించి, మణియం రెట్టింపుగా కంఠం పెంచి "కుక్కను కట్టెయ్యమని చెప్తే యినపడలేదంట్రా లంజకొడకా" అన్నాడు.

మన్నుగాడు యాంత్రికంగా నడుస్తూ రాజిని తీసుకెళ్ళి దారంతో పందిరి గుంజకు కట్టేసి, తిరిగొచ్చి, గుర్రం ముందర చేతుల కట్టుకుని నిల్చున్నాడు.

మణియం, "రాత్రి నువ్వు చేసిన పనేందో నానోటితో నేను చెప్తే వినాలని నీకు కుశాలగా ఉన్నట్టుంది. చెప్తాను పట్టు" అని గుర్రం దిగి రాత్రి ఎలుకలు పట్టడం అయినాక అర ఎకరా వరికంకులు మాయం జేసినావు. ఆ వడ్లన్నీ యాడ దాచి పట్టినావు? అదీ నేనడగతా ఉండేది" అన్నాడు.

ఎట్ట ఎదుట ఒక భూతం కనబడుతున్నట్టు మన్నుగాని ముఖం పాలి పోయింది. అతడు. "నాకేంవీ తెలవదు దొరా. ఎలుక బొక్కల్లో పిడికెడు పిడికెడు కంకులుండినాయి. అవన్నీ ఏరితే తట్టెడు వడ్లయినాయి. అవి దీసుకు వొచ్చి వండుకుని రాత్రి తింటిమి దొరా" అన్నాడు.

మణియం, "నేనడిగేది తట్టెడు వడ్ల కతగాదురా. అర ఎకరా అవి యట్ట మాయమైనాయి చెప్పు" అన్నాడు.

మన్నుగాడు "నన్నడిగితే నేనేంవి జెప్పుదు దొరా. సగం రాత్రి దాక కావలాయనతోనే ఉంటిని. సగం రాత్రి నుంచి ఈ గుడిసె ముందరే పడుండా" అన్నాడు.

మణియం, "యాడుంటే ఏంవిరా. యానాదోడు ఉన్న కాడనే ఉండి గోల కొండ కాడ అగ్గి బెట్టేస్తాడు. యానాదోడు చేసే పన్లన్నీ సొంత చేతులతో చెయ్యడు. ముంగిసను ఎగదోలి పామును పంపిస్తాడు. కుక్కను ఎగదోలి కుందేలును సంపిస్తాడు. ఇట్టాటి యిద్దిలు పెట్టుకుని బతకమనే బ్రహ్మదేవుడు మీ నొస్టిన రాసుండాడు. రాతిరి జేసిన పని గూడా అట్టనే చేసినావు. నువ్వు గుడిసె ముందర పడుకుని యానాదోల్లను రప్పించి అర ఎకరా వరి పైరును సుబ్బరం చేయించినావు. వాళ్ళను ఎక్కడ నుండి పిలిపిస్తివి? ఏ అడవుల్లో నుంచి పిలిపిస్తివి? ఏ కొండల్లోనుంచి పిలిపిస్తివి?" అన్నాడు.

భయం చేత, దుఃఖం చేత మన్నుగాడు కొయ్యబారిపోయి నేల చూపులు చూస్తూ నిల్చున్నాడు.

మణియం, "నువ్వు చెప్పవురా. నువ్వు చెప్పవురా. నువ్వు చెప్పవు. నీకు పెట్టాల్సిన నలుగు నీకు పెట్టేదాక నువ్వు చెప్పవు" అని ఎడమ చేయి విసిరి మన్నుగాడి జుట్టు పట్టుకుని వంచి, వాడి వీపు మీద కుడిచేతి పిడికిలితో బలంగా గుద్దాడు. మన్నుగాడు చారెడు ఇసుక నోటిలోకి పోయేలా బోర్ల పడ్డాడు.

మన్నుగాడు బోర్లపడగానే చిన్నోడు గావుకేకపెట్టి, బైరాగిని గట్టిగా కౌగిలించుకుని, "తాతా నాకు బయంగా ఉంది. నన్ను కొట్టొద్దన్జెప్పు. నేను చచ్చిపోతాను. నేను చచ్చిపోతాను" అంటూ గట్టిగా కళ్లు మూసుకుని వికృతంగా ఏడవసాగాడు. బైరాగి తనను పెనవేసుకుని ఉన్న చేతులను విడదీయడానికి ప్రయత్నించాడు. అతని శరీరంలో కలిసిపోతున్నట్లు గాఢంగా చిన్నోడు అతనిని హత్తుకుని ఉన్నాడు. అతడు చిన్నోడిని ఓదారుస్తూ, 'నిన్నెవరు కొడతార్రా? ఎర్రోడా. నిన్నెవరూ కొట్టరు. నేనుండానుగదా .... నిన్నెవరూ కొట్టకుండా నేను చూస్తాను. ఊరుకో" అన్నాడు.

చిన్నోడు కండ్లు అలాగే మూసుకుని, బైరాగిని మరింతగా హత్తుకుని, "నన్నుయాడికన్నా తీసుకపో తాతా ... నాకు బయంగా ఉంది. నేను చచ్చిపోతాను. నన్ను యాడికన్నా తీసుకపో" అన్నాడు. తనకేమీ పాలుపోకుండా బైరాగి కాసేపు నలువైపుల చూశాడు. తరవాత చిన్నోడిని పొదివి పట్టుకుని, నడిపించుకుంటూ గుడిసె వెనక్కు తీసుకెళ్ళాడు. చిన్నోడు ఒక్కసారి గూడా కళ్ళు తెరవకుండా బైరాగిని అంటి పెట్టుకుని నడిచాడు.

గుడిసె వెనక ఒక కాకర పొద దట్టంగా అల్లుకుని వుంది. దాని తీగెలు గుడిసె కప్పుమీదకు ప్రాకుతున్నాయి. బైరాగి చిన్నోడిని కాకర పొదలో కూచోబెట్టి, "సిన్నోడా. నువ్వు ఈడనే కదలకుండా కూర్చో. నిన్నెవరూ చూడరు. చూసినా నిన్నెవరూ కొట్టకుండా నేను చూసుకుంటాను" అన్నాడు.

చిన్నోడు గడగడ వణుకుతూ, "నాకు బయంగా ఉంది తాతా. కండ్లు తెరవాలంటేనే బయంగా ఉంది. నన్ను కొట్టొద్దని చెప్పుతాతా. కొట్టితే చచ్చిపోతా" అన్నాడు. బైరాగి అతడి భుజం మీద తడుతూ "నువ్వు ఆ బయమేమీ పెట్టుకోకు. నీ మీద ఈగ వాలకుండా నేను చూసుకుంటాను. నీకు అంత బయంగా ఉంటే కండ్లు తెరవనే వొద్దు. కావాలంటే చెవుల్లో వేళ్ళుకూడా పెట్టుకో" అన్నాడు. వెంటనే చిన్నోడు తన రెండు చూపుడు వేళ్ళను రెండు చెవులలో జొనిపి ఉంచుకున్నాడు. అతడలా చెవులు, కండ్లు మూసుకుని గడగడ వణుకుతూ కాకర పొదలో వొదిగి కూర్చున్నాడు.

బైరాగి చిన్నోడిని వదిలి పెట్టి గుడిసె ముందుకొచ్చాడు. మణియం చేతిలో బారెడు పొడవు, ముంజేతిలావు కర్ర ఉన్నది. ఆ కర్రతో అతడు ఇసుక మీద పడి ఉన్న మన్నుగాడిని బాదుతున్నాడు. అతడు ఇసుకమీద నుండి లేవడానికి

ప్రయత్నిస్తున్నాడు. అవిరామంగా పడుతున్న దెబ్బల వర్షం మూలాన అతని ప్రయత్నాలు వృధా అవుతున్నాయి. అతడు నేలమీద నుండి జానెడెత్తు గైడా పైకి లేవలేకపోతున్నాడు.

గుర్రం సకిలిస్తూ, సర్కసు జంతువువలె పదడుగులు వెనక్కు నడిచి నిల్చుంది. రాజి పందిరి గుంజ వద్ద ఇడుగులాడుతూ అవిరామంగా మొరుగు తూంది. దాని మెడకు, పందిరి గుంజకూ మధ్య ఉన్న దారం ఒక్కక్షణం పాటు కూడా నేలను తాకడం లేదు.

మణియంగారి చేతిలోని కర్ర క్షణం విశ్రాంతి లేకుండా పాము పడగవలె లేస్తూ పడుతూ ఉంది. కొంత సేపటికి మన్నుగాడు నేల మీద నుండి పైకి లేచే ప్రయత్నాలు విరమించుకున్నాడు. దానికి బదులు అతడు కాళ్ళు చేతులు కొట్టుకుంటూ నేలమీద అటూ, ఇటూ దొర్ల సాగాడు. కాని మణియంగారి ముఖం క్రౌర్యాన్ని వెలిగక్కడం విరమించలేదు. అతని చేతిలోని కర్ర నేలమీద దొర్లుతున్న శరీరాన్ని తాకడంలో ఉరవడి తగ్గలేదు. కర్ర ఢీకొన్న చోట్లను చేతులతో కప్పుకుంటూ గావు కేకలు పెడుతూ మన్నుగాడు నేలమీద దొర్లుతున్నాడు. ఒక దెబ్బ బలంగా ఆయువు పట్టులో తగలడంతో మన్నుగాని అరుపులు అకస్మాత్తుగా ఆగిపోయాయి. అతని శరీరం నిశ్చలనమై పోయింది. మణియం బాదడం ఆపి, నిశ్చలనంగా పడి ఉన్న శరీరాన్ని పండ్లు కరచుకుంటూ కాసేపు చూసి, కర్రను చలనరహితంగా ఉన్న శరీరం మీదకు విసిరి కొట్టాడు. తరవాత నుదుటి మీద చెమటతుడుచుకుని, చుట్టూ చూసి, "వీని కొడుకేడి? యాడబోయినాడా మొద్దోడు?" అనరిచాడు.

బైరాగి గబగబ ముందుకొచ్చి, "వాడుపారిపోయినాడు దొరా ... నువ్వు వాళ్ళయ్యను కొట్టడం మొదలు పెట్టగానే వాడు అట్ట పరుగెత్తి పారిపోయాడు దొరా" అన్నాడు.

మణియం బైరాగిని మొదటి సారిగ చూస్తున్నట్టు చూసి, "నువ్వెవరు?" అన్నాడు.

బైరాగి, "నేనొక బైరాగోణ్ణి దొర. మాది అరవ దేశం. బిచ్చమడుక్కుంటా పొట్ట బోసుకునేటోణ్ణి. ఈ దోవన పోతా ఉంటే ఈడ పొద్దుపోయింది. ఈ రాత్రి ఈ చెట్టుకింద ముడ్సుకున్నా" అన్నాడు.

మణియం మన్నుగాడిని కాసేపు చూసి, తరవాత బైరాగితో, "వీడికి ఇంకొంచేపటికి తెలివొస్తుంది. తెలివొచ్చినాక లేపి కూర్చోబెట్టు. తాగతానంటే నీళ్ళు నిప్పులు యియ్యి. నేను మళ్ళీ మాపటేళకు వస్తా. నేనొచ్చేలోగా బాగా ఆలోచించుకోమని చెప్పు. వీడు రాతిరి జేసిన పని వొప్పుకోవాల. వీనితో చెయ్యి కలిపినోళ్ళు యాడుండారో చెప్పాల. చెప్పితే సరి. లేకుంటే వీని సంగతి కాకులు, గద్దలు విచారిస్తాయని చెప్పు" అని, బైరాగి నుండి సమాధానం కోసం కూడా ఎదురు చూడకుండా వెనుదిరిగి గుర్రం వైపు చూసి చిటికె వేశాడు. గుర్రం పదడుగులు వేసి ముందుకొచ్చింది. మణియం గుర్రం పైన కూర్చుని, దానిని వెనకకు మలిపాడు. గుర్రం గ్రామం వైపు పరుగు ప్రారంభించింది.

గ్రామంలో తొలికోడి కూయడం వినిపించింది.

17

కోళ్ళు అవిరామంగా, ఒకదాని వెనక ఒకటిగానూ, జమిలిగానూ కూస్తున్నాయి.

బైరాగి గుర్రం కనుమరుగయ్యేదాక చూస్తూ నిలబడ్డాడు.

తరవాత వెనుదిరిగి నేలమీద పడి ఉన్న మన్నుగాడి వద్ద నిశ్శబ్దంగా కూర్చున్నాడు. మన్నుగాడి ఎద మెల్లగా పైకి, కిందకూ లేస్తూ పడుతూ ఉంది. నోరు ఇంచుక తెరచుకుని శ్వాసక్రియ జరుపుతున్నాడు. కళ్ళు మూసుకుని ఉన్నాయి. ఆపాదమస్తకం శరీరం గాయాలతో నిండి ఉంది. గాయాల నుండి రక్తం స్రవిస్తున్నది. రెండు చేతులలో ఉన్న వేళ్ళు చాలా వరకు విరిగి పోయి ఉన్నాయి.

బైరాగి మన్నుగాని భుజం మీద చేయి వేశాడు. మన్నుగాడు మెల్లగ కళ్ళు తెరిచి, బైరాగిని గుర్తించి, బలహీనమైన స్వరంతో, "నువ్వా సాంవీ. పిలగోడు ఎట్టుండాడు?" అనడిగాడు.

బైరాగి, "పిలగోడు బద్రంగా ఉండాడు. దొరకంట బడకుండా దాచిపెట్టినా. పిలవమంటావా?" అన్నాడు.

మన్నుగాడు, "వద్దు, వద్దు. నేను యట్టుండానో సూడు. వాడు నన్ను చూసినాడంటే అట్టనే యదబడిపోతాడు. యాడదాచి పెట్టినానో ఆడనే ఉండనీ" అన్నాడు.

బైరాగి, "ఈదురగాలి తోలతా ఉంది. లోపల పడుకుందువు లెయ్యి" అన్నాడు.

మన్నుగాడు, "ఇంగ నేను లేచేకత యాడిది సాంవి. ఏ కీలు ఎక్కడుందో నాకే తెలడం లేదు. ఇంగనేను బతకతాననే నమ్మకం నాకులేదు. అట్టాంటి నమ్మకం నువ్వు కూడా యిడిసి పెట్టెయ్. పిలగోని కత నువ్వే చూసుకోవాల సాంవి. నా గుంత మీద వానిచేత మన్ను ఎయ్యించినాక వాణ్ణినీతో తీసకపో సాంవి. యట్ట చూసుకుంటావో వాణ్ణి నువ్వే చూసుకోవాల" అన్నాడు.

బైరాగి, "అట్టాటి మాటలు ఎందుకంటావన్నా. ఊర్లోకి పోయి వైద్యుడెవరన్నా ఉంటే పిలుసుకొస్తా. ఈ గాయాలకు కట్లు కట్టి,

మందూ మాకు ఇస్తే నాలుగు రోజుల్లో తెవురుకుంటావు" అన్నాడు.

మన్నుగాడు, "లేదు సాంవి. ఇవి తెవురుకునే గాయాలు కావు. నీకు బయటి గాయాలే కనిపిస్తా ఉండాయి. ఆయువు పట్టుల్లో తగిలుండే గాయాలు నీకు కనపడవు. ఏ వైద్యుడూ నన్ను బతికించలేడు సాంవి. మొండిపానం గాబట్టి ఎగిరిపోకుండా ఇంగా తనకలాడతా ఉండాది.

ఈ పొద్దిటికి నా ఆకు రాలిపోతుంది. ఆ ప్రకారం బెమ్మదేవుడు గీటు గీసేసినాడు. నువ్వు యాడ పుట్టితివో, యాడ పెరిగితివో, సమయానికి ఈడికొచ్చినావు. పిలగోణ్ణి నీ చేతుల్లో పెట్తా ఉంటా. అది గూడా బెమ్మదేవుడు చేసిన ఏర్పాటే" అన్నాడు.

క్రమక్రమంగా మన్నుగానికి మాట్లాడటం దుస్తరమై పడుతున్నది. శ్వాస క్రియ లయ తప్పుతున్నది. అతడు తన కనురెప్పలను తప్ప ఏ అవయవాన్నీ కదిలించలేకపోతున్నాడు.

బైరాగి, "అట్ట ధైర్యం ఇడిసి పెట్టేస్తే యట్టా అన్నా. నువు కండ్లు మూసు కుని అట్లనే పడుకో. నేను ఊర్లోకి పోయి గెడిసేపిట్లో వైద్యుణ్ణి తీసుకొస్తా" అన్నాడు.

మన్నుగాడు, "లాబం లేదు సాంవి. దెబ్బలు ఏయే ఆయువు పట్టుల్లో తగిలుండాయో నాకు తెల్సు. నేను చిన్నప్పట్నుంచి అడవుల్లో వేటాడి బతికి నోడిని. ఏ ఆయువు పట్టులో దెబ్బ తగిలితే జీవం ఎంత సేపుంటుందో నాకు తెల్సు. నాకత మర్సిపో సాంవి. పిలగోని కత ఆలోచించు" అని కండ్లు మూసుకున్నాడు.

బైరాగి గాయాలతో చిన్నాభిన్నమై ఉన్న శరీరాన్ని అసహాయంగా చూస్తూ కూర్చున్నాడు. ఈదురుగాలి ఉండి ఉండీ

వీస్తున్నది. చంద్రుడు పడమటి కొండ వెనక క్రుంకి చాలా సేపయింది. నక్షత్రాలు నిస్తేజమవుతున్నాయి.

కొంత సేపయ్యాక మన్నుగాడు మెల్లగా కండ్లు తెరచి "ఈడనే ఉండావా సాఁవి?" అన్నాడు.

బైరాగి "ఉండాను చెప్పు" అన్నాడు.

మన్నుగాడు, "నన్ను తీసకపోయి గుడిసెలోకి చేర్చు సాఁవి. నా పానం గుడిసెలోనే పోవాల. ఆ గుడిసెలోనే నలబై సంవత్సరాలు కాపురముండినా. ఈ కట్టె ఆ గుడిసెలోనే రాలి పోవాల సాఁవి" అన్నాడు.

బైరాగి మన్నుగాని తొడల కింద, వీపు కింద చేతులు వేసి నేలమీద నుండి లేపి, అతి కష్టం మీద మోసుకెళ్ళి గుడిసెలో చాపమీద పడుకోబెట్టాడు. గుడిసెలోకి చేర వేస్తున్నప్పుడు గాయాలు మరింత విచ్చుకుని రక్తస్రావం ద్విగుణీకృతమయింది. శరీరమంతా నెత్తురోడుతున్నది.

మన్నుగాడు బైరాగి వైపు చూసి, ఏదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. పెదాల మధ్య నుండి గాలి వెలువడుతున్నదిగాని, శబ్దం వెలువడడం లేదు. బైరాగి అతనికి చేరువగా కూర్చుని, కదులుతున్న అతని పెదవులనే చూడ సాగాడు. మన్నుగాడు శక్తినంతా కూడదీసుకుని, "ఈ మంటలు భరించ లేకుండా ఉండాను సాఁవి. వొళ్ళంతా సున్నంలో యిడగబోసి నట్టుండాది" అన్నాడు.

బైరాగి, "వైద్యుణ్ణి తీసుకురమ్మంటావా?" అన్నాడు.

మన్నుగాడు, "వొద్దు. ఈ మంటలు సల్లార్చు సాఁవి.

కానుగాకులు కావాల. వంక గెడ్డన వరసగా కానగ చెట్లుండాయి. కానుగ మండలు తెచ్చి, చాప మీద పరచి, వాటి మీద నన్ను పడుకోబెట్టు, సల్లంగ ఉంటుంది. ఆ పని చేసి పుణ్యం కట్టుకోసాఁవి" అన్నాడు.

బైరాగి పైకి లేచి, గుడిసెలో ఒక మూలన వున్న కత్తిని, దారపు చుట్టను తీసుకుని, "నువ్వు మంటలు కొంచెం సేపు సమాళించుకో అన్నా. నేను కానుగ మండలు కొట్టుకుని గెడిసెపట్లో వచ్చేస్తా" అన్నాడు. ఈతడు గుడిసె ద్వారానికడ్డంగా వెదురు తడకను ఉంచి గుడిసె వెనకకు వచ్చాడు.

చిన్నోడు కాకర పొదలో అలాగే కూర్చుని ఉన్నాడు. చెవులలో చూపుడు వేళ్ళను జొనుపుకుని, కండ్లు గట్టిగా మూసుకుని, వణుకుతూ కూర్చుని ఉన్నాడు. బైరాగి వంగి, చిన్నోడి భుజం పైన చేయి వేశాడు. చిన్నోడు ఉలిక్కిపడి, కూర్చున్నా చోటుకుండే రెండడుగులు వెనక్కు జరిగి, చెవుల్లో వేళ్ళను తీసేసి, కళ్ళు తెరిచాడు. బైరాగిని యగాదిగా చూసి, "నువ్వా తాతా. నేనింగా దొర వొచ్చేసినాడనుకుంటి పై పానాలు పైన్నే పోయినాయి" అన్నాడు.

బైరాగి, "దొర ఎల్లిపోయి జాఁవు సేపయింది" అన్నాడు.

చిన్నోడు, "ఎల్లిపోయినాడా? మళ్ళీ వస్తాడేఁవో" అన్నాడు.

బైరాగి, "ఇంగెందుకొస్తాడు. దొరకు లక్షాతొంబై పనులుంటాయి." అని చిన్నోడి రెక్కపట్టి లేపుతూ, "నువ్వులెయ్ మనం ఇప్పుడు వంక గెడ్డదాక పోయిరావాలి" అన్నాడు.

చిన్నోడు. "వంక గెడ్డన ఏం పని తాతా?" అన్నాడు.

బైరాగి, "చెప్తాను నడు" అని దారి తీశాడు.

వాళ్ళిద్దరు గుడిసె వద్ద నుండి బయలు దేరాడు. రాజి అవిరామంగా మొరుగుతుండడం వినిపిస్తూంది. చిన్నోడు దారిలో ఆగి, "తాతా, రాజీ అరస్తా ఉంది. ఏఁవయిందో చూసొద్దాం" అన్నాడు.

బైరాగి అతడి రెక్క పట్టి గుంజుతూ, "దాన్ని పందిరి గుంజకు కట్టేసినాం గద. అందుకని అరుస్తా ఉంది. మనం తిరిగొచ్చినాక యిడిపిద్దాం. నువ్వు నడు" అన్నాడు.

కొంత దూరం నడిచాక చిన్నోడు, "తాతా – నాయన యట్టుండాడు?" అనడిగాడు.

బైరాగి, "నాయన కేమయిందిరా. బాగానే ఉండాడు. ఏదో పనిమీద పక్కూరుకు పోయినాడు. మద్యానానికి తిరిగొస్తాడు. ఈ లోగా మనం వంకగెడ్డకు పోయొద్దాం" అన్నాడు.

చిన్నోడు కాసేపు ఊరుకుని "తా–తా" అని ప్రారంభించి ఏదో అడగబోయాడు. బైరాగి అతడిని కసురుకుంటూ, "నువ్వు నోరు మూసుకుని బిర బిర నడవరా. మనకు వంక గెడ్డన ఓపినంత పనుండాది" అన్నాడు.

వాళ్ళిద్దరు ఒకరి వెనుక ఒకరుగా సన్నటి కాలిబాట వెంబడి నడవసాగారు. వాళ్ళు గుడిసె నుండి దూరమయ్యే కొద్దీ రాజి అరుపులు అస్పష్టంగా వినిపించ సాగాయి. కొంత సేపటికి దాని అరుపులు వినిపించలేదు.

చంద్రుడు అస్తమించి చాలా సేపయింది. సూర్యుడింకా ఉదయించలేదు. నక్షత్రాలన్నీ ఒకటొక్కటే మాయమై పోయాయి. చంద్రుడి నుంచి కాక సూర్యుడి నుంచి కాక, నక్షత్రాల నుంచి కాక

ఏవో రహస్య స్థావరాల నుంచి బితుకు బితుకు మంటూ వస్తున్న వెలుగు భూమి మీదకు వ్యాపిస్తున్నది. ఆ వెలుగు మాయవలె వింతగానూ, గూఢంగానూ, అస్పష్టంగానూ ఉన్నది.

వాళ్ళు నడుస్తున్న దారికిరువైపుల ఎండుటాకులు దట్టంగా పడి ఉన్నాయి. ఆ ఎండుటాకుల మీద తొండలు పరుగెడుతున్నప్పుడు సరసరమని చప్పుడ వుతూ ఉన్నది.

బైరాగి తల వంచుకుని బిరబిర నడుస్తూ, తన ముందున్న సమస్యలను గురించి, బాధ్యతలను గురించి ఆలోచిస్తున్నాడు. కానుగ మండలను కొట్టు కొచ్చి, వాటిమీద పడుకోబెట్టి మన్నుగాని మంటలను తగ్గించవచ్చు. కాని అతడు బతుకుతాడా? తన ఆయువు పట్టులలో తగిలిన దెబ్బలను గురించి, వాటి పర్యవసానాలను గురించి అతనికి క్షుణ్ణంగా తెలిసినట్టుంది. అతడు నిజంగానే చనిపోతే తరవాత తన కర్తవ్యమేమిటి? తను తనజోలను చంకను తగిలించుకుని, తంబురను చేత బట్టుకుని, గుడిసెను వదిలి వెళ్ళిపోగలడా? అన్నిటికన్నా మించిన సమస్య చిన్నోడు. చిన్నోడిని గురించిన సమస్య ఒక పెద్ద కొండవలె, బ్రంహాండం వలె తన ఎదుట నిలిచి ఉన్నట్టు బైరాగికి అనిపించసాగింది.

దారి పక్కన ఎండుటాకుల మీద గలగలశబ్దం వినిపించటంతో బైరాగి ఆగి వెనుదిరిగి చూశాడు. రాజి ఎండుటాకుల మీద పరుగెత్తుకుంటూ వచ్చి వాళ్ళిద్దరినీ కలుసుకుంది. దాని మెడ నుంచి సగం తెగిన దారం వ్రేలాడుతూ ఉంది.

బైరాగి, "దారం తెంచుకోనొచ్చేసినట్టుందిరా. పందిరిగుంజకు కట్టేసి నప్పట్నుంచి ఇడుగులాడతా ఉండింది. పందిరిని గూడా కూలదోసేసి వొచ్చిందేఁవో" అన్నాడు.

చిన్నోడు మోకాళ్ళమీద కూర్చుని, రాజి మెడ నుండి వ్రేలాడుతున్న దారాన్ని విప్పాడు. తెగిన దారపు కొసను కాసేపు పరిశీలనగా చూసి, "ఇది దారాన్ని తెంచలేదు తాతా. దారాన్ని కొరికేసింది. దీని పండ్ల పదును రంపం పండ్లకు యాడిది. ఇంగ దీని దవడల సత్తువంటావా చూస్తేగాని నమ్మలేవు. ఏదుపందినో, దుప్పినో చూపించి, "ఇసుకో" అంటే చాలు యనకనే పోయి నోటితో కాలుపట్టేస్తుంది. ఇంగ ఆకాలు రెండుగా ఇరగాల్సిందేగాని, దీని పట్టు మాత్రం యిడవదు" అని దాని వీపు మీద చరచి లేచి నిలబడ్డాడు.

వాళ్ళు ముగ్గురు ఒకరి వెంబడి ఒకరుగా మళ్ళీ ఆ సన్నటి దారి వెంబడి, ఆ మాయవంటి వెలుగులో నడవసాగారు.

18

వాళ్ళు ముగ్గురు ఏటి వొడ్డుకు చేరేటప్పటికి ఉషోదయ మయింది. సూర్యుడు తాను తూర్పు కొండ వెనుక దాగుకుని, తనకిరణాలను నిట్ట నిలువుగా ఆకాశం మీదకు ప్రసరింప జేస్తున్నాడు. నిన్న నిర్మలంగా ఉండిన తూర్పు ఆకాశం దట్టమైన మేఘాలతో నిండి ఉంది. వివిధ ఆకారాలలో, వివిధ పరిమాణాలలో ఉన్న ఆ మేఘాలు సూర్య కిరణాల తాకిడితో ఎర్ర రంగును సంతరించుకుని చూపరులకు భయం గొలుపుతున్నాయి. ఏటిలో నీళ్ళు ఒక వారన సన్నటి కాలువలా ప్రవహిస్తున్నాయి.

నీళ్ళు సొళసొళమని చప్పుడు చేస్తూ, పరిసరాలలో వున్న ప్రాణులకు రహస్య సంకేతాలనిస్తున్నాయి. ప్రవాహం వెంబడి

నడుములెత్తు దట్టంగా పెరిగి ఉన్న రెల్లు పొదలలో పాములకోసం ముంగిసలు, మిడతల కోసం జెముడు కాకులు, జలగల కోసం నీటికోళ్ళు తిరుగుతున్నాయి. వాటి గమనం వల్లను, ఉదయపు గాలుల తాకిడి వల్లను రెల్లు పొదలు నిశ్శబ్దంగా ఊగుతున్నాయి. ఏటి ఒడ్డు వెంబడి వరుసగా కానుగ చెట్లున్నాయి. వెడల్పయిన పచ్చని ఆకులతోను, దట్టమైన కొమ్మలతోను ఒక్కొక్క చెట్టు గుంభనంగా నిలుచుని ఉంది.

బైరాగి, చిన్నోడు ఒక కానుగ చెట్టుకిందకు వచ్చారు. బైరాగి దారపు చుట్టను చిన్నోడికిచ్చి, "మనమిప్పుడు ఒక మోపు కానుగ మండలు కొట్టి ఇంటికి తీసుకుపోవాలి. నేను చెట్టెక్కి మండలు నరుకుతాను. నువ్వు మండలు కింద పడంగానే ఏరి ఆదారంతో మోపుకట్టు" అన్నాడు.

చిన్నోడు దారపు చుట్టను భుజానికి తగిలించుకుని, "కానుగ మండలు ఏంవిటికి తాతా?" అనడిగాడు.

బైరాగి ఆ ప్రశ్నను సరకు చేయకుండా, గోచె బిగించి కట్టుకుని, కత్తిని బొడ్లో దోపుకుని చెట్టెక్కడం ప్రారంభించాడు. చిన్నోడు, రాజి మోర పైకెత్తుకుని చూస్తూ నిలబడ్డారు.

చెట్టుపైకెక్కిన బైరాగికి తూర్పు ఆకాశం మరింత ఎర్రగా, మరింత స్పష్టంగా మరింత భీకరంగా కనిపిస్తున్నది. అతడు ఒక కొమ్మను నరకడానికి బొడ్లోనుంచి కత్తిని తీసి పైకెత్తి, అలాగే ఆగిపోయాడు. కత్తి కొమ్మను తాకకుండా గాలిలోనే ఆగిపోయింది.

చిన్నోడు పైకి చూస్తూ "ఏవయింది తాతా. అట్టనే ఆగిపోయినావు" అన్నాడు.

బైరాగి కిందకు చూసి, "సిన్నోడా. దొర వస్తా ఉండాడు. గుర్రం వేసుకుని ఈ దిక్కుగా వస్తా ఉండాడు. నువ్వు పోయి ఆరెల్లు

పొదల్లో దాక్కో. గుబురుగా ఉండే చోట పొదలో కనబడకుండా కూచో. పరుగెత్తు" అన్నాడు.

చిన్నోడు గబగబ ఏట్లోకి దిగి, కాలువ వెండడి గుబురుగా పెరిగి ఉన్న రెల్లు పొదల వెనకకూర్చున్నాడు. అతడు కూర్చుని ఉన్న చోటు నుంచి తొంగిచూస్తే అతనికి నీటి ప్రవాహం, ప్రవాహం పక్కన ఇసుక, ఏటికి ఇరువైపుల ఉన్న గట్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

బైరాగి చెట్టు దిగి, చెట్టు బోదె వెనక వొదిగి నిలబడ్డాడు. రాజి మంత్రించి నట్టుగా వచ్చి అతని కుడి వైపున నిల్చుంది.

మరి కొంతసేపటికి మణియం గుర్రంతో సహా ఏటి గట్టుమీద ప్రత్యక్షమయ్యాడు. గుర్రం మెల్లగ ఏటిలోకి దిగి నీటి కాలువను దాటుకుని ఇసుక మీదకు వచ్చింది.

సూర్యుడు తూర్పు కొండల వెనకనుంచి పైకి వచ్చాడు. సూర్యబింబం మాటు వేసి ఉన్న పులివలె ఎర్రటి మేఘాల వెనకదాగి ఉన్నది. మేఘాలు సూర్యకిరణాలు చేదించరానంత దట్టంగా ఉన్నాయి. సూర్యుని కిరణాలు మేఘాల అంచుల మధ్య నుండి తప్పించుకుని భూమి మీదకు వ్యాపిస్తున్నాయి.

చెట్టు బోదె వెనకున్న బైరాగి కళ్ళు మణియం కదలికలను గమనిస్తున్నాయి. ఆకళ్ళు తన ఆహార జంతువును వేటాడుతున్న పులి తాలూకు కళ్ళువలె క్రూరంగాను, నిశితంగానూ చూస్తు న్నాయి. ఆ కళ్ళకు కూలిపోయి నేలమట్ట మయిన పందొమ్మిది గుడిసెలు కనిపిస్తున్నాయి. ఆ కళ్ళకు ఆయువు పట్టులలో దెబ్బలు తగిలి చలన రహితంగా చివరి గుడిసెలో పడి ఉన్న శరీరం కనిపి స్తున్నది.

మణియం గుర్రం మీద నుంచి దిగాడు. ఇసుక మీద నిలబడి ఉన్న అతని నీడ ప్రవాహపు నీటిలో కనిపిస్తుంది.

బైరాగి కుడి చేతి వేళ్ళు కత్తి పిడిచుట్టూ బిగుసుకున్నాయి. మోచేయి ఇంచుక వంగింది. కరచుకుని ఉన్న అతని పండ్ల మధ్య నుండి పాము బుసవంటి చప్పుడు క్షణకాలం వినిపించింది. అతడు చెట్ల చాటు నుండి ఇవతల కొచ్చాడు. అడుగు ముందుకు వేయడానికి కుడిపాదం పైకెత్తాడు.

ఇంతలో అతనికి దిగంతాల వద్ద ఎక్కడో ఉరుముతున్నట్లు సన్నటి శబ్దం వినిపించింది. అతడు ఎత్తిన పాదాన్ని దించి పక్కకు చూశాడు. రాజి నాలుగు కాళ్ళపైన దృఢంగా, పర్వతాలను ఢీకొనబోతున్నట్టుగా నిలబడి ఉంది. దాని వీపు వంచిన బిసకంపవలె ఉన్నది. తోక పైకెత్తుకుని ఉన్నది. చెవులు రిక్కిరించుకుని ఉన్నవి. దాని కళ్ళలో వేయి సూర్యుల తీక్షణత ఉన్నది. ఆ చూపులు మణియం మీద స్థిరంగా నిలిచి ఉన్నాయి. ఇంచుక తెరచుకుని ఉన్న దానినోటిలో పదునైన పళ్ళు తెల్లగ, క్రూరంగా కనిపిస్తున్నాయి. ఉరుమువంటి ధ్వని ఆ నోటి నుండి వినవస్తున్నది.

బైరాగి రాజిని, మణియంను ఒకసారి మార్చి మార్చి చూశాడు. తరవాత దాని పక్కన కూర్చుని, దాని చెవి దగ్గర నోరుపెట్టి, ఎడమ చేత్తో మణియంను చూపిస్తూ, తగ్గు స్వరంతో, "రాజి, ఇసుకో, ఇసుకో, రాజీ ఇసుకో" అన్నాడు. అరగజం దూరం దాటి వినిపించని ఆ స్వరంలో వంశాలను నాశనం చేయగల ద్వేషం, పగ దాగి ఉన్నాయి.

రాజి చివ్వున గాలిలోకి ఎగిరింది. మరుక్షణమే అది మణియం గారి ఎడమ భుజం మీద వాలింది. తనపుష్టికరమైన దవడలతో,

వాడియైన పండ్లతో అతనిపీకను ఒక పైపును తెంచివేసింది. అరవడానిగ్గూడ, వ్యవధి లేకుండా మణియం దబ్బున ఇసుక మీద బోర్లపడ్డాడు. అతడు లేచి కూర్చోవడానికి ప్రయత్నిస్తుండగా రాజి మళ్ళీ ఎగిరి అతని కుడి భుజం మీద వాలి మిగిలిన సగం పీకను తెంచి వేసింది. పీక పూర్తిగా తెగిపోవటంతో అతని కంఠం నుండి శబ్దానికి బదులు గాలి, నెత్తురు కలిసి నురగ రూపంలో చిమ్ముకు రాసాగింది. అతడు నిశ్శబ్దంగా వెనకకు తూలి వెల్లకిల పడ్డాడు. గుర్రం తన గొంతు చిరిగిపోయేలాగ సకిలించి వాగు వెంబడి పరుగు ప్రారంభించింది.

బైరాగి గట్టు దిగి శవం చెంతకొచ్చాడు. మణియం తల, గొంతు, రొమ్ము కాలువలో పడి ఉన్నాయి. మిగిలిన శరీరం ఇసుక మీద పడివుంది. తెగిన పీక నుండి ఏకధాటిగా నెత్తురు చిమ్ముతూ వుంది. ఆ నెత్తురు కలిసి, కాలువలో నీళ్ళకు బదులు నెత్తురు ప్రవహిస్తున్నట్లు అగుపిస్తున్నది. రాజి తన మూతికి అంటుకుని ఉన్న నెత్తురును నాలుకతో తుడుచుకుంటూ శవాన్ని కొరకొర చూస్తున్నది. శవానికి అవతలి వైపున రాజి, ఇవతలి వైపున బైరాగి నిలబడి వుండగా సూర్యబింబం మేఘాలను చీల్చుకుని బయటకొచ్చింది. తను మాటు వేసి, వేటాడిన జంతువును చీల్చి చెండాడి, తృప్తిగా భుజించిన పులి పొదలో నుండి బయటకు వచ్చినట్టు సూర్యుడు మబ్బుల చాటునుండి పైకి వచ్చాడు. సూర్యకిరణాల తాకిడికి కాలువలో పారుతున్న నీళ్ళు మరింత ఎర్రగా కనపడసాగాయి.

సన్నగా వీస్తున్న గాలిపాటుకు కాలువ వెంబడి వున్న రెల్లు పొదలు, ఏటికి ఇవతలి గట్టున ఉన్న కానుగ చెట్లు, అవతలి గట్టున ఉన్న వరిపొలం నిశ్శ బ్దంగా కదులుతున్నాయి. ఎర్రటి నీటి ప్రవాహం చేస్తున్న సవ్వడి తప్ప వాతావరణమంతా భయంకరమైన నిశ్శబ్దంతో నిండి ఉంది.

ఆ నిశ్శబ్దాన్ని చీల్చుతూ ఇసుక మీద అడుగులసప్పుడు వినిపించి బైరాగి వెనుదిరిగి చూశాడు. చిన్నోడు భయం భయంగా నడిచి వస్తున్నాడు. అతడు ఇసుకమీద అడుగులు తూచి తూచి వేస్తూ వచ్చి బైరాగి పక్కన నిలబడ్డాడు. ఎర్రగ పారుతున్న కాలువను, నెత్తురును చిమ్ముతున్న కంఠాన్ని అతడు క్షణకాలం పాటు చూశాడు. ఆ తరవాత రక్తం గడ్డగట్టుకు పోయేలాగ కెవ్వున కేకవేసి, కండ్లు గట్టిగ మూసుకుని, ముఖాన్ని రెండు చేతులతో కప్పుకున్నాడు. ఇసుక మీద ఒక్కొక్క అడుగే వెనక్కు వేస్తూ, వికృతమైన స్వరంతో, "నెత్తురు కాలవై పారతా ఉండాది నాకు బయంగా ఉంది తాతా. వంకంతా నెత్తురే. ఇంగ దొర నన్ను సంపేస్తాడు. నాకు బయంగా ఉంది తాతా" అని అరవసాగాడు.

బైరాగి చిన్నోడిని, కాలువను, శవాన్ని మార్చి మార్చి చూస్తూ దిగ్భ్రాంతు డయినట్టు నిలబడిపోయాడు.

చిన్నోడు ఇసుకమీద వెనుకకు అడుగులు వేస్తూ, రెండు బారల దూరం సాగి, అకస్మాత్తుగ ముఖం మీద నుండి చేతులు తీసేసి, కండ్లు తెరిచి, గిరుక్కున వెనుదిరిగి వాగు వెంబడి పరుగు ప్రారంభించాడు. రాజి చెంగు, చెంగున దూకి చిన్నోడిని కలుసుకుని అతని వెంబడి పరుగెత్తసాగింది.

బైరాగి దిగ్భ్రాంతి నుండి కోలుకుని, "చిన్నోడా, యాడికిరా పరుగెత్తుతా ఉండావు. నీకేం బయంలేదురా. నేనుండానురా" అనరిచాడు. కాని అప్పటికే చిన్నోడు అతని అరుపులు వినపడనంత దూరాన పరుగిడుతున్నాడు. చూస్తుండగానే అతడు వాగు వెండి పరుగిడుతూ పొదల వెనక అదృశ్య మయ్యాడు.

బైరాగి చిన్నోడిని వెదుకుతూ అతడు వెళ్ళిన దిక్కుగా నడవసాగాడు. అతడు వాగులోని రెల్లు పొదలను, నాగదాడి

పొదలను, కలబంద పొదలను వెదుకుతున్నాడు. గట్టుమీద కెక్కి కాకి వెదురు పొదలను, గురివెంద పొదలను వెదికాడు. గోతులను, గుహలను వెదికాడు. కానుగ చెట్లను, సుంక్రేసు చెట్లను వెదికాడు. మళ్ళీ ఏటిలోకి దిగి చిన్నోడు పరుగెత్తిన దిశగా నడవసాగాడు.

సూర్యుడు క్రమక్రమంగా ఎర్రదనాన్ని కోల్పోతూ, తూర్పు ఆకాశాన ఎగబ్రాకుతున్నాడు. ఎర్రదనం తరిగే కొద్దీ సూర్యబింబం తీక్షణతను రాజుకుం టున్నది. కొంత సేపటికి సూర్యుడు చూడశక్యం కాకుండా తయారై, చరాచర జగత్తును మాడబెట్టడం ప్రారంభించాడు.

బైరాగి శరీరం ఆపాదమస్తకం చెమటతో తడిసిపోయింది. అతనికి అలసట ముంచుకొస్తున్నది. ఇసుకలో అడుగు తీసి అడుగు వేయడం గగనమై పోతు న్నది. 'బహుశ వాడు నేరుగ గుడిసెకు వెళ్ళాడేమో.

ఈ పాటికి గుడిసె చేరుకుని, తడకతీసి, లోపలకు వెళ్ళి, తండ్రిని చూసేడేమో' ఆ తలంపురాగానే అతనిని ఒక్కసారిగా వివశత్వం ఆవరించింది. మోకాళ్ళు, నడుము తమంతట అవే వంగుతుండగా అతడు ఇసుకమీద కూర్చున్నాడు. తన శరీరం గాలిలో తేలుతున్నట్లు, తన చుట్టూ ఉన్న పరిసరాలు గిర్రున తిరుగుతున్నట్లు అతనికి అనిపించింది. క్రమక్రమంగా అతనికి కళ్ళకు చీకట్లు కమ్మసాగాయి.

ఆ చీకటిలో అతనికి ఎక్కడో రాజి మొరుగుతున్న ధ్వని వినిపించింది. ఆ శబ్దం వినగానే అతని శరీరంలోకి కొత్తగా జవసత్వాలు వచ్చినట్లయింది. అతని కళ్ళకు కమ్ముతున్న చీకట్లు విచ్చిపోయాయి. అతడు తలను విదిలించి, చెవివొగ్గి వినసాగాడు. రాజి ఏటి ఎగువన అవిరామంగా మొరుగుతూ వుంది.

అతడు లేచి ఇసుకలో కాళ్ళీడ్చుకుంటూ, శబ్దం వినవస్తున్న దిశగా నడవసాగాడు. అతడు ముందుకు సాగే కొద్దీ రాజీ అరుపులు మరింత స్పష్టంగా వినిపించసాగాయి. శబ్దం స్పష్టంగా వినిపించే కొద్దీ గమనవేగాన్ని, హెచ్చించడానికి అతడు ప్రయత్నిస్తున్నాడు. అలా కొంత దూరం సాగాక ఒక చోట ఏరు మలుపు తిరుగుతుండడం గమనించాడు. అతడు మలుపు తిరిగి తన ఎట్టఎదుట కనిపిస్తున్న దృశ్యం చూసి శిలాప్రతిమలా నిలబడిపోయాడు.

చిన్నోడు దారంతో ఒక చెట్టుకు ఉరివేసుకుని వ్రేలాడు తున్నాడు. అతని భారానికి చెట్టుకొమ్మ కాస్త వంగి ఉన్నది. అతని కండ్లు పిదుకుకుని వస్తున్నాయి. నాలుక నోటి బయట వ్రేలాడుతున్నది. రాజి కింద నిలబడి మోర పైకెత్తి మొరుగుతూ ఉంది.

19

రాజి తన గుది కాళ్ళను తొక్కుకుంటూ, తనను వెన్నంటి వస్తుండగా బైరాగి గుడిసెను సమీపించాడు. వెదురు తడకను తీసి లోపలకు ప్రవేశించాడు. గుడిసెకప్పుకు ఉన్న కంతల ద్వారా ఉదయపు ఎండలోపలకు చొచ్చుకు వస్తోంది.

మన్నుగాడు కళ్ళు మూసుకుని, నిశ్చలనంగా వెల్లకిల పడి ఉన్నాడు. అతని శరీరాన్నంతటినీ తడుపుతూ ఉండిన ఎర్రటి రక్తం ఎండిపోయి నల్లగా మారి ఉంది. శరీరం మీదున్న అసంఖ్యాకమైన గాయాలు పక్కులు కట్టి వున్నాయి. ఉండుండి అతని దొక్కలు ఎగిరెగిరి పడుతున్నాయి. శ్వాసక్రియ పూర్తిగ లయ తప్పి ఉంది.

బైరాగి మన్నుగాడి దగ్గర కూర్చుని, అతని భుజం మీద చేయివేసి కుదుపుతూ, "అన్నా, లెయ్యన్నా, అంతా అయిపోయింది లెయ్యన్నా" అన్నాడు.

మన్నుగాడు కళ్ళు తెరిచాడు. పెదిమలు విప్పి మాట్లాడడానికి సర్వ ప్రయత్నాలు చేసి, విఫలుడై కనురెప్పల తాటింపుతో "ఏమయింది?" అనడిగాడు.

బైరాగి రుద్ధమవుతున్న గొంతుకతో, "అంతా అయిపోయిందన్నా. మన పిలగోడు ఇక లేడన్నా" అన్నాడు.

మన్నుగాని కనురెప్పలు ఉరులలో చిక్కుకున్న పిట్ట తాలూకు రెక్కల వలె కొట్టుకోసాగాయి. అతని కనుగుడ్లు గేలానికి చిక్కుకున్న చేపల వలె గిల గిలలాడసాగాయి.

బైరాగి అంతకంతకు పూడుకుపోతున్న గొంతుకతో "మన పిలగోడు మన గుంతల మీద మన్నేస్తాడనుకుంటిమి. వాడింత అల్పాయువు అడిగొచ్చినాడను కోలేదన్నా. ఇప్పుడు వాని గుంత మీద మనం మన్ను ఎయ్యాల" తరవాత చెప్పదలచుకున్నది అతడు పూర్తి చేయలేకపోయాడు. అతని కళ్ళలో గంగసుడులు తిరుగుతూ ప్రారంభమయింది. కన్నీటి పొరలగుండా అతడేమీ చూడలేక పోయాడు. అతడు కనురెప్పలనప్పళించగా కన్నీళ్ళు కిందకుజారి చెంపల మీదున్న అసంఖ్యాకమైన ముడతలలో ఇంకిపోయాయి. మిగిలిన కన్నీళ్ళను అరచేతులతో తుడుచుకున్నాడు. కళ్ళు అలా పొడిగా అయ్యాక అతడు చూడగలిగాడు.

అప్పటికి మన్నుగాని కనురెప్పలు కొట్టుకోవడం లేదు. అతని కనుగుడ్లు గిలగిలలాడటం లేదు. రెండు నల్ల చీమలు గునగున నడుస్తూ అతని చెంపల మీదుగ, రెప్పల మీదుగ సాగి కనుగుడ్ల మీదకు చేరి అల్లిబిల్లిగా తిరగసాగాయి. ఐనప్పటికీ అతని

కనురెప్పలు కొట్టుకోవడం లేదు. ఆ కళ్ళు గుడిసె కప్పుకు ఉన్న రంధ్రాల ద్వారా నీలాకాశాన్ని, ఆకాశంలో రాత్రంతా వెలిగి అదృశ్యమై పోయిన నక్షత్రాలను చూస్తున్నాయి.

20

రైలుబండి లయబద్ధంగా చప్పుడు చేసుకుంటూ దక్షిణ దిశగా దూసుకుపోతూ ఉంది. రైలు పెట్టెలో ప్రయాణీకుల కాళ్ళ సందున తలుపు నానుకుని, బైరాగి కూర్చుని ఉన్నాడు. సర్వమూ కోల్పోయినట్లు అతని ముఖం నిర్లిప్తంగాను, నిస్తేజంగానూ ఉన్నది. ఖాళీగా ఉన్న జోలె అతని ఎడమ భుజం నుంచి వ్రేలాడుతున్నది. తంబుర కుడి భుజానికి ఆనించి ఉన్నది. పెట్టెలోని ప్రయాణీకులు అటూ, ఇటూ తిరుగుతుండగా వాళ్ళ చేతి వేళ్ళు తంబుర తీగకు తగిలి "టంగ్" మని చప్పుడవుతున్నది. ఆ శబ్దం అతనికి వినిపించడం లేదు. అన్ని శబ్దాలను అధిగమిస్తూ, దిగంతాల వరకు వినిపించేట్టుగా అతని మనసు ఘోషిస్తున్నది. "ఓ దేవా! నా చేను కొళ్ళబోయింది. నీకు సమర్పించడానికి ఇన్నాళ్ళుగ కాపాడుకుంటూ వచ్చిన నా ఆత్మనాశనమయింది. ఏటి గట్టున ఉన్న వృక్షజాలం నీటి ప్రవాహపు ఉరవడికి కూలిపోయినట్లు, భవబంధాల మాయకులోనైనా ఆత్మ నాశనమయింది. ఈ భవబంధాలు నన్ను చుట్టుముట్టింది. ఒక రాత్రి, ఒక పగలు మాత్రమే. ఆ స్వల్ప వ్యవధిలోనే మాయ తాలూకు శిఖరాలను, అంచులను దర్శించారు. ఫలితంగా నా ఆత్మ చిన్నాభిన్నమయింది. ఓ దేవా! నా చేను కొళ్ళబోవడమే గాదు, నా చేను మీద వాలిన పిచ్చుకలు, చిలుకలు, నా చేనును కమ్మిన పొగమంచు, నా

చేనును కొరుకుతుండిన కీటకాలు అన్నీ మాయమయ్యాయి. అన్నీ నాశనమయ్యాయి. ఆత్మలోపించిన ఈ నా శరీరం కాముకుని లజ్జవలె, పిరికివాని దర్పం వలె, అహంకారి క్షమవలె శూన్యానికి ప్రతినిధిగా మిగిలిపోయింది".

రైలు బండి నదులను లోయలను, కొండలను, అడవులను, గ్రామాలను దాటుకుంటూ సాగుతున్నది. పొగ గొట్టము నుండి బయలు వెడలిన నల్లని దట్టమైన పొగలు పైపైకి లేస్తూ ఆకాశంలోని మేఘాలను కలుసుకోవడానికి విఫలప్రయత్నం చేస్తున్నాయి.

* * *

రాజి రేయింబవళ్ళు గుడిసె పరిసరాలలో తచ్చాడుతూ కనిపిస్తూంది. ప్రతి రోజూ అది గుడిసె పరిసరాల నుండి కొన్ని గంటలపాటు మార్మికంగా మాయమైపోతుంది. మళ్ళీ అంతే మార్మికంగా గుడిసె వద్ద ప్రత్యక్షమవుతుంది. అది ప్రతి రాత్రి గుడిసె ముందర నిలబడి, మోరను నిట్టనిలువుగా పైకెత్తి, నక్షత్రాలకేసి చూస్తూ, సుదీర్ఘంగా, హృదయ విదారకంగా అరుస్తుంది. అలా ప్రతి రాత్రి నాలుగైదు సార్లు చేస్తుంది. ఆ శబ్దాన్ని దూరం నుంచి విన్నవారికి చిరాకు మాత్రమే గాక భయము, గగుర్పాటు కూడా కలుగుతాయి.

పక్షం రోజులలో దాని శరీరం చిక్కి శల్యం కావడం ప్రారంభించింది. దాని చర్మం మీద నుండి బొచ్చు అక్కడక్కడ

రాలిపోసాగింది. పక్కటెముకలు చర్మాన్ని పొడుచుకుని వస్తున్నట్టు కనిపించసాగాయి. వీపు మీద రెండు, మూడు చోట్ల పుండ్లు ఏర్పడ్డాయి.

ఒకానొక పున్నమి రోజున అది గుడిసె దాపున నడుస్తుండిన రైతు మడమను కరిచింది. దానికి పిచ్చి పట్టిందని గ్రామస్థులు నిర్ధారించారు. పది మంది కుర్రవాళ్ళు కర్రలు, రాళ్ళు తీసుకుని దానిని వెంబడించారు. దానిని వీధుల వెంబడి, పొలాల వెంబడి, లోయల వెంబడి తరిమి కొట్టి చంపారు. దాని శవాన్ని ఊరి బయట ఒక పాడు బడిన బావిలో పడవేశారు.

* * *

నిర్మానుష్యమైన ఆ చివరి గుడిసెలో వేసవి ముగిసే వరకు గబ్బిలాలు, పాములు స్థిర నివాసమేర్పరుచుకున్నాయి.

ఆషాడమాసం ప్రారంభంలో ఈశాన్య దిశ నుండి విపరీతమైన గాలులు వీచాయి. గాలి తాకిడికి గుడిసె కప్పు ఉన్న బోదగడ్డి, వరిగడ్డి, తాటాకులు పూర్తిగా ఎగిరిపోయాయి. అవి గుడిసెకు పదిబారల దూరాన పడి, క్రమంగా చెదపట్టి, మట్టిలో కలిసి పోయాయి. కప్పు పూర్తిగా లేచి పోవడంతో కప్పు కింద ఉండిన వెదురు బొంగులు నగ్నంగా కనిపించసాగాయి. ఒకనాటి సాయంత్రం ఆ దారిన పోతుండిన రైతు గుడిసె ముందు ఆగి బొంగులను చూశాడు. తన జొన్న చేనులో మంచె వేయాల్సిన అవసరం అతనికి గుర్తుకొచ్చింది. మరుసటి దినం ఉదయం

అతడు వెదురు బొంగులన్నిటిని ఊడ బెరికి మోపు కట్టి తీసుకెళ్ళాడు. పై కప్పు వెదుర్లు పోవడంతో మొండి గోడలు మాత్రం మిగిలాయి.

శ్రావణ మాసంలో వర్షాలు ప్రారంభమయ్యాయి. ఆచ్ఛాదన లేని గోడలు వర్షపు నీటితో నాని మెత్తబడ్డాయి. తేమ గోడలలోకి ఇంకసాగింది. వర్షాలు ప్రారంభమైన మూడవ రోజుననే గోడ తూర్పు వైపున, ఉత్తరం వైపున పూర్తిగా కూలిపోయాయి. కార్తీక మాసాంతానికి మిగిలిన గోడలు రెండు మూరల వరకు కరిగిపోయింది. మొండి గోడల మధ్య వెంపలి చెట్లు, జిల్లేడు చెట్లు, ఉమ్మెత్త చెట్లు మొలిచి నవనవలాడుతూ పెరగసాగాయి.